# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పత్రిక

సంపుటి : 52 | సంచిక : 19, 20 | విజయవాడ | 20-10-2019 | పేజీలు : 24 | వెల : రు. 10/-


## ప్రజాస్వామిక, జాతీయ విప్లవాలు సాగించని పాలకవర్గాలతో ఏడు దశాబ్దాలుగా సాగుతున్న భారత సర్వవ్యాపిత సంక్షోభంలో మరొక అంకం

**2025** నాటికి భారత ఆర్థికాన్ని ఐదు లక్షల కోట్ల డాలర్లకు చేరుస్తానని ప్రధాని మోడీ ప్రకటిస్తున్న సమయానికే దేశ ఆర్థిక వ్యవస్థ కుంటినడక కూడా మందగిస్తున్న సూచనలు స్పష్టంగా కన్పించాయి. అంతరంగంలో ఏమున్నా బయటకు మాత్రం "అధిక సంస్కరణ"ల ఫలితంగా సాగుతున్న "దిద్దుబాటు"గా ప్రభుత్వం చిత్రించింది. అయితే నానాటికీ వెలువడుతున్న ఆర్థికరంగ సమాచారంతో (బడ్జెట్టు పెట్టే నాటికే ఇకనామిక్ సర్వే, రిజర్వుబ్యాంకుల సమాచారంలో ఇది వున్నది) నిరాకరించలేని స్థితి ఏర్పడటంతోపాటు భారత బడా బూర్జువావర్గం విరుగుడు చర్యలు తీసుకొమ్మని కోరటంతో, కేంద్ర ప్రభుత్వం "ఉద్దీపనా" చర్యలని పేర్కొనకుండానే అలాంటి చర్యలనే తీసుకుంది. 2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభ సమయంలో, సామ్రాజ్యవాద దేశాధినేతలు తీసుకున్న ఉద్దీపనా చర్యలనే ఇవి పోలి వుండటం ఆశ్చర్యాన్ని కలిగించదు.

ప్రస్తుతం ఆర్థిక మాంద్యమని పిలుస్తున్న దాని స్వభావమేమంటే ఉత్పత్తిరంగాలన్నిటా-వ్యవసాయం, గనులు, తయారీ పరిశ్రమ-వృద్ధి సన్నగిల్లటం, వస్తు తయారీ పరిశ్రమ 2010 నాటినుండీ కోలుకోలేదు. ప్రధాన పరిశ్రమలన్నిటా ఉత్పాదసూచిక అతి స్వల్పంగా పెరగటమో లేదా తగ్గిపోవటమో జరిగింది. వస్త్ర పరిశ్రమ(0.1%), తోలు ఉత్పత్తులు(0.2%), కాగితం దాని ఉత్పత్తులు(-14.2%), శుద్ధిచేసిన బొగ్గు, చమురు(2.23%), రసాయనాలు(0.3%), రబ్బరు-ప్లాస్టిక్ (-4.1%), లోహేతర ఖనిజాలు(-11%), విద్యుత్తు పరికరాలు (-4.6%), యంత్రాలు-ఇతర సామాగ్రి(-1.6%), మోటారు వాహనాలు(-8.4%), రవాణా వాహనాలు, పరికరాలు(-1.7%) కుంటుతున్నాయి.

మొత్తం ఉత్పాదక రంగంలో స్థాపిత ఉత్పత్తి సామర్థ్యంలో సగటున 70 శాతాన్ని మాత్రమే వినియోగించుకుంటున్నాయి. గత ఐదేళ్ల సగటుకంటే తక్కువకు రైల్వేల సరకు రవాణా చేరింది. రియల్ ఎస్టేటు రంగంలో నిర్మిత గృహాలు అమ్ముడు కాకుండా పేరుకుపోవటం ఏడేళ్లుగా సాగుతున్నది. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి అమలు నాటినుండీ ఈ సూచనలు కన్పిస్తున్నాయి.

గనుల చట్టాన్ని సవరించి విదేశీ పెట్టుబడులను అనుమతించేందుకు చర్యలు తీసుకున్నా, కొన్ని బొగ్గుగనులు వేలంవేసినా, ఫలితం రాలేదు. భూసేకరణ, అటవీ, పర్యావరణ చట్టాలను ఆటంకంగా చూపి విదేశీ పెట్టుబడిదారులు తమకు పట్టనట్లు వూరకుండిపోయారు. ప్రభుత్వ రంగంలోని విశాఖ ఉక్కు, సింగరేణిలకు గనులు కేటాయించకుండా ఆపారు. దీనితో గనుల రంగం కుదేలయింది.

వ్యవసాయరంగ సంక్షోభం తెలిసినదే. నేటికీ 60శాతం జనాభాకు ఉపాధిని కల్పిస్తున్న వ్యవసాయరంగాన్ని నూతన ఆర్థిక విధానాల ప్రారంభం నుండి కునారిల్లచేస్తూ వచ్చిన విధానాల ఫలితాన్నే నేడు చూస్తున్నాము. 2011-12 నుండి 2017-18 మధ్య వ్యవసాయ రంగంలో 2.67 కోట్లమంది ఉపాధి కోల్పోయారు. రైతు సంక్షేమమంటూ ఎన్ని కబుర్లు చెప్పినా, తీసుకున్న చర్యలన్నీ రైతాంగాన్ని సాగునుండి తప్పించే దిశగానే సాగటంతోపాటు, ఈ రంగంనుండి సంపద తరలింపు పెద్దఎత్తున సాగింది. ఫలితంగా "హిందూవృద్ధి రేటు"గా హేళన చేసిన 1970 నాటి దశకే ఈ రంగం చేరింది.

ప్రధాన ఉత్పాదక రంగాలు కునారిల్లటంతో నిరుద్యోగం రికార్డు స్థాయికి చేరింది. 1972-73 తర్వాత, గత 45 ఏళ్ళ రికార్డు స్థాయికి చేరింది. అధికారిక గణాంకాల ప్రకారం, నిరుద్యోగం గ్రామీణ పురుషులలో 5.8%, మహిళలలో 3.8 శాతం, పట్టణ పురుషుల్లో 7.1%, మహిళల్లో 10.8%కి చేరింది.

ప్రభుత్వరంగంలో కేంద్ర, రాష్ట్రాలు కలిపి 98.8 లక్షల ఉద్యోగాలు నింపకుండా వుండిపోయాయని ప్రభాత్ పట్నాయక్ అంచనా వేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలలో కాంట్రాక్టు కార్మికుల శాతం 2011లో 22.4 శాతముండగా 2018లో 84.7 శాతానికి పెరిగింది. నిరుద్యోగ యువతతో పాలకులాడే క్రూర పరిహాసానికి రైల్వే ఒక ఉదాహరణ. ఏనాడూ జరగనట్లుగా మూడేళ్లలో లక్షమందికి రైల్వే ఉద్యోగాలు యిస్తుందని ప్రకటించారు. ఏడాదికి 50వేలకు పైగా రైల్వే ఉద్యోగులు రిటైరవుతున్నారు. లక్షమందికి ఉద్యోగాలిచ్చేలోపు లక్షన్నర ఖాళీ లేర్పడతాయి. ఎన్నికల తర్వాత ఉద్యోగ ప్రకటనలు, నియామకాలు సాగిస్తూనే, రాబోయే నాలుగేళ్లలో 3 లక్షల మేరకు ఉద్యోగుల సంఖ్య తగ్గిస్తామని ప్రకటించింది.

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పత్రిక

సంపాదకుడు

**పి. జస్వంతరావు**

వెబ్‌సైట్ :

**www.janasakthionline.com**

ఈ-మెయిల్ :

**janasakthi1963@gmail.com**

సంపుటి : 52 సంచిక : 19, 20

20-10-2019


**లోపలిపేజీల్లో....**


క్లాసిక్స్ :

పిడివాదం- విమర్శనా స్వేచ్ఛ - లెనిన్ 3

చరిత్ర :

చైనా నూతన ప్రజాస్వామిక విప్లవం 5

రాజకీయార్థికం :

కాశ్మీరు ప్రజలపై భీకర దాడి 10

కుల వివక్షా దురాచారం 14

బిజెపి నిరంకుశ పాలన 15

యురేనియం తవ్వకాలు 16

ఉన్నావో కేసు 18

పెహ్లూఖాన్ కేసు కొట్టివేత 19

ఆదివాసులపై గొడ్డలి వేటు 20

బాలల వెట్టిచాకిరి 21

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కార్మికుల సమ్మె 22

ఫోర్డు కార్మికుల ఆందోళన 23

ప్రకటన :

తెలంగాణా ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు 23

రిపోర్టు :

పశ్చిమబెంగాల్-రాష్ట్రస్థాయి సెమినార్ 24



**వెల :** విడిప్రతి..................రూ.10/-

సంవత్సర చందా....రూ. 100/-

చిరునామా :

**పి. జస్వంతరావు,** సంపాదకుడు

**32-13-26/1, బి.ఎం.ఆర్. రోడ్,**

**ఎం.ఆర్.పురం, విజయవాడ-10.**


సంపదను సృష్టించే రంగాలలో-వ్యవసాయం, గనులు, ఉత్పాదక పరిశ్రమలలో ప్రైవేటు, ప్రభుత్వ పెట్టుబడుల మదుపు లేకపోవటమే ఆర్థిక వ్యవస్థ కుంటినడకకు కారణం. ఈ రంగాలలో పెట్టుబడి మదుపును తగ్గించి వేసిన ప్రభుత్వం అభివృద్ధిపేరిట మౌలిక సదుపాయాలరంగంలో ప్రభుత్వ, ప్రైవేటు మదుపును పెంచింది. రోడ్లు, రేవులు, విమానాశ్రయాలు, విద్యుత్తు ప్లాంటులలో విపరీతంగా పెట్టుబడి మదుపు సాగించింది. సంపద సృష్టి రంగాలు కునారిల్లుతుండగా, వాటిపై ఆధారపడి సాగే రంగాలపై పెట్టుబడి నష్టదాయకంగా మారింది. దీనికి అవినీతి తోడై మోయలేని భారమైంది. ప్రభుత్వరంగ బ్యాంకులలో పేరుకుపోయిన పారుబాకీలలో 60శాతానికి పైగా మౌలికరంగానికిచ్చిన రుణాలే. పారుబాకీలలో ప్రధానభాగం 30 కుటుంబాలవే. దీనితో వ్యవసాయం, చిన్నపరిశ్రమలు, చిన్న వాణిజ్యాలకు బ్యాంకులు తమ సేవలను కుదించివేశాయి. నోట్లరద్దు, జివిఎస్‌టిలతో దెబ్బతిన్న ఈ రంగాలు కోలుకునే అవకాశాలు సన్నగిల్లిపోయాయి. ఇది మొత్తంగా ప్రజల కొనుగోలు శక్తిని క్షీణింపచేసింది. ముఖ్యంగా పైశ్రేణి మధ్యతరగతి వర్గంగా ఖర్చును తగ్గించివేసుకుంది. ఆర్థిక మాంద్యమంటున్న దాని సూచనలు కన్పించటం మొదలైంది. పై శ్రేణి మధ్యతరగతి కొనుగోలు చేసే సరుకుల అమ్మకాలు క్షీణించటంగా కన్పించింది. కార్లు, మోటారు బైకులు శ్వేత సరుకులుగా పిలిచే ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు వగైరా. దేశంలో కార్ల అమ్మకాల్లో 75శాతం 5 లక్షల రూ॥లోపువే. వీటి అమ్మకాలు తరిగిపోగా, విలాసవంతకార్ల అమ్మకాలు తగ్గలేదు.

విదేశీ పెట్టుబడులొస్తాయని ఎన్ని చెప్పుకున్నా, అవి ఉత్పాదకరంగంలోకి రాలేదు. ఉన్న పరిశ్రమలను కొనుగోలు చేయటానికి సేవారంగంలోకి వచ్చాయి. రియల్ ఎస్టేటులో కూలిపనులు తప్ప విదేశీ పెట్టుబడి కల్పించిన ఉపాధి అల్పమే. అదే సమయంలో లాభాలు, రాయల్టీలు, ఫీజులు పేరిట దేశంనుండి విదేశీ పెట్టుబడిదారులు తరలించుకుపోతున్న సంపద అనేక రెట్లు పెరిగింది. వ్యవసాయరంగం సృష్టించిన సంపదలో శ్రమించిన సగం జనాభా వాటా పెరగకుండా, అలా పెరగటానికి దున్నే వానికే భూమి హక్కు ఏర్పడకుండా, విదేశీ దోపిడీ, భారత ధనాఢ్యవర్గాల దోపిడీ ఆపకుండా ఈ సంక్షోభానికి పరిష్కారం దొరకదు.

ఈ పరిష్కారానికి భిన్నంగా ఈ దోపిడీ వర్గాలను బలపరిచే చర్యలనే మోడీ ప్రభుత్వం తీసుకుంది. బడ్జెట్టులో మహాసంపన్నులపై పన్నులను తగ్గించింది. తిరిగి మౌలిక సదుపాయాల కల్పనకై వందలక్షల కోట్ల రూ॥ల పెట్టుబడి మదుపును ప్రోత్సహిస్తానని చెప్పింది. ప్రభుత్వరంగ బ్యాంకులకు 70 వేల కోట్ల రూ॥లు నిధిని అందజేస్తానని చెప్పింది. కంపెనీల చట్టంలో వందసెక్షన్లను ఉల్లంఘించినా శిక్షలేకుండా చట్టాన్ని సవరిస్తానని చెప్పింది.

రియల్ఎస్టేటు వ్యాపారులకు తక్కువ వడ్డీ రుణాలను ప్రకటించింది. కంపెనీలు సామాజిక బాధ్యతగా చేయాల్సిన వ్యయం చెయ్యకపోయినా పట్టించుకోబోనని చెప్పింది. పెట్టుబడి మదుపుపై స్వల్పకాలిక, దీర్ఘకాలిక లాభాలపై సర్‌ఛార్జి పన్నును రద్దుచేసింది. గత పదేళ్లలో 7 లక్షల కోట్ల పారు బాకీలను రద్దుచేసింది. దీనిలో 90శాతం బడా బూర్జువాలదే. మిగిలిన 11 లక్షలకోట్ల పారు బాకీలనూ బ్యాంకులను కలిపివేసి, మిగిలిన బ్యాంకుల రుణాలందజేసే సామర్థ్యాన్ని పెంచి చూపింది. మిగిలిన 12 ప్రభుత్వరంగ బ్యాంకులూ తమ రుణ వితరణను పెంచుతాయని చెప్పింది. ప్రభుత్వం ఎక్కువ కార్లను కొంటుందని చెప్పింది.

ఆర్థికవృద్ధికి విదేశీ పెట్టుబడులే శరణ్యమన్న బానిస భావననుండి భారత పాలకవర్గాలు బయటపడవు. ఇంత జరిగినా, పరిష్కారంగా మళ్ళీ విదేశీ పెట్టుబడుల ఆకర్షణా చర్యలనే తీసుకుంది. బొగ్గు, మీడియా రంగాల్లో నూటికి నూరుశాతం విదేశీ పెట్టుబడికి అనుమతినిచ్చింది. రిటైలు వ్యాపారంలో అనేక నిబంధనలను సడలించింది. 100% విదేశీ పెట్టుబడిని అంగీకరించింది. 30% స్థానికంగా సేకరించాలన్న నిబంధనను సడలించింది. విదేశీ వాణిజ్య రుణాలను తీసుకుంటాననీ, ప్రభుత్వం జారీచేసే బాండ్లలో విదేశీ పెట్టుబడిదారుల మదుపును అనుమతిస్తానని చెప్పింది. ఇతరులకంటే ఎక్కువ వడ్డీ యిస్తేనే వచ్చే ఈ ద్రవ్య మదుపుదారులకు చెల్లించే వడ్డీ భారమంతా ప్రజలపైనే పడుతుంది.

ఈ చర్యలేవీ ఆర్థికవ్యవస్థను సరిచేయ లేవు. ధనాఢ్య వర్గాలకిచ్చిన రాయితీలు, దేశంలో ఆర్థికవ్యత్యాసాలను పెంచుతాయి తప్ప ప్రజలకు ఉపాధిని పెంచదు. రాయితీల నిచ్చినా కార్ల రంగంలో కార్మికులను పనినుండి తొలగించటం ఆగలేదు. **(తరువాయి 9వ పేజీలో)**

# పిడివాదం – “విమర్శనా స్వేచ్ఛ”

**వి.ఐ. లెనిన్**

*లెనిన్ 1902లో రచించిన తన సుప్రసిద్ధ రచన ‘ఏంచేయాలి’ లోని మొదటి ప్రకరణంలోని ఈ భాగాన్ని ప్రచురిస్తున్నాము. అప్పటికి రష్యాలో ఒకవైపు కార్మిక, ప్రజాపోరాటాలు క్రమంగా పెరుగుతున్న పరిస్థితి, మరోవైపు ఈ పోరాటాలకు నాయకత్వం వహించాల్సిన సోషల్ డెమొక్రటిక్ శక్తులు చెల్లాచెదరుగా వివిధ స్థానిక గ్రూపులుగా వున్న స్థితి. ఒక ఏకీకృతమైన పార్టీని క్రిందనుంచి నిర్మించుకొని రావాల్సిన కాలంలో సోషల్ డెమొక్రటిక్ పార్టీలోనే కార్మికవర్గం వర్గ పోరాటాలను సాగించరాదని, రాజకీయ పోరాటాలను లిబరల్ బూర్జువాలకు వదలి కార్మికవర్గం ఆర్థిక పోరాటాలకే పరిమితం కావాలనే ధోరణి బయల్దేరింది. దీనిని ఆర్థికవాద ధోరణి అంటారు. ఇది పార్టీలోపల తలెత్తిన అవకాశవాద ధోరణి. దీనికి అంతర్జాతీయంగా బెర్న్‌స్టైన్ అవకాశవాదం యొక్క మద్దతు వుంది. ఈ ఆర్థికవాద ధోరణిని ఓడించకపోతే, విప్లవ కార్మికవర్గ పార్టీని నిర్మించడం, వర్గ కార్మికోద్యమాన్ని ముందుకు కొనిపోవడం అసాధ్యమైన పరిస్థితిలో లెనిన్ ‘ఏం చేయాలి’ అన్న రచన చేశారు. నాటి అవకాశవాదం రివిజనిజంగా మార్క్సిజంపై ‘విమర్శనా స్వాతంత్ర్యాన్ని’ డిమాండ్ చేస్తున్న తీరును ఖండిస్తూ మొత్తం కమ్యూనిస్టు నిర్మాణ దృక్పథంలోని అవకాశవాద ధోరణులను ఎండగడుతూ లెనిన్ రాసిన ఈ పుస్తకం నేటికీ అధ్యయనం చేయాల్సిన అవసరం వున్నది.*

– సంపాదకుడు



## “విమర్శనా స్వేచ్ఛ” అంటే ఏమిటి?

“విమర్శనా స్వేచ్ఛ” అనేది ఈనాడు నిస్సందేహంగా అన్ని నినాదాలకంటే మోజైనది గానూ, అన్ని దేశాల్లోనూ సోషలిస్టులకూ, ప్రజాస్వామ్యవాదులకూ మధ్య సాగుతున్న వాదోపవాదాల్లో అతి తరచుగా వినియోగింప బడేదిగానూ తయారైంది. స్థూలంగా చూస్తే, యీ వివాదానికి చెందిన రెండు పక్షాల్లో ఒక పక్షానికి చెందినవారు “విమర్శనా స్వేచ్ఛ” కావాలంటూ గంభీరమైన విజ్ఞప్తులు చెయ్యడం చాలా చిత్రంగా కనిపించకమానదు. విజ్ఞాన శాస్త్రానికీ, శాస్త్రీయ పరిశోధనకీ స్వేచ్ఛను కల్పించే అధిక సంఖ్యాక యూరోపియన్ దేశాల రాజ్యాంగబద్ధ చట్టానికి వ్యతిరేకంగా, పురోగామి పార్టీల్లో ఎవరైనా అభ్యంతరాలు లేవదీశారా? మోజుగా తయారైన యీ నినాదం మాటిమాటికి వల్లింపబడటం వింటూ, వాదోపవాదాలు చేసేవారి మధ్య ఏయే అంశాలపై విభేదాలు వచ్చాయో పూర్తిగా తెలుసుకొని తటస్థులు, “యిందులో ఏదో లొసుగు ఉన్నట్లుంది, మారుపేరు మాదిరిగానే, నలుగురి నోళ్లలోనూ నలగడం మూలంగా స్థిరపడిపోయి, దాదాపు నానుడిగా మారే ఆచారసిద్ధ పదబంధాల్లో యీ నినాదం ఒకటి” అంటారు.

వాస్తవానికి, యీనాటి అంతర్జాతీయ **(ఫుట్‌నోట్–1)**సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో రెండు భిన్న ధోరణులు రూపొంది వున్నాయన్నది రహస్యమేం కాదు. ఈ ధోరణుల మధ్య ఘర్షణ ఒక్కొక్కప్పుడు తీవ్రంగా ప్రజ్వలిస్తూ, మరొకప్పుడు చప్పుగా చల్లారి, గంభీరమైన “రాజీ తీర్మానాల”నే బూడిద మరుగున రగులుతూ వుంటుంది. “కాలం చెల్లిపోయిన పిడివాద” మార్క్సిజంపట్ల “విమర్శనాత్మక” వైఖరి వహించే “కొత్త” ధోరణి సారాంశాన్ని బెర్న్‌స్టైన్ సాధ్యమైనంత స్పష్టంగా ప్రతిపాదించగా, మిలెరాన్ దాన్ని నిరూపించాడు.

సోషల్ డెమొక్రటిక్ పార్టీ సామాజిక విప్లవపార్టీగా వుండటం మాని, సామాజిక సంస్కరణలకోసం పనిచేసే ప్రజాస్వామిక పార్టీగా మారాలన్నది వాళ్ల డిమాండు. బెర్న్‌స్టైన్ ఈ రాజకీయ డిమాండు చుట్టూ బోలెడు “కొత్త” వాదనలనూ, తర్కాలనూ అల్లాడు. సోషలిజాన్ని శాస్త్రీయంగా నిరూపించడాన్నీ, చారిత్రక భౌతికవాద దృక్పథం దృష్ట్యా సోషలిజం ఆవశ్యకతనూ, అనివార్యతనూ నిరూపించే అవకాశాన్నీ అతను నిరాకరించాడు. జనంలో పేదతనం నానాటికీ పెరుగుతోంది, జనం శ్రామికులయ్యే క్రమం సాగుతోంది, పెట్టుబడిదారీ వైరుధ్యాలు తీవ్రమవుతున్నాయి –యీ వాస్తవాన్ని బెర్న్‌స్టైన్ ఒప్పుకోలేదు. అతను కమ్యూనిస్టు సమాజ స్థాపన “అంతిమ లక్ష్యం” అన్న భావనే సరైనది కాదని ప్రకటించి, శ్రామికవర్గ నియంతృత్వం అన్న భావాన్నే పూర్తిగా నిరాకరించాడు. సూత్రరీత్యా ఉదార వాదానికీ, సోషలిజానికీ మధ్య వైరుధ్యం వుందన్న విషయాన్ని అతను కాదన్నాడు. అధిక సంఖ్యాక ప్రజల యిచ్ఛకు అనుగుణంగా ఏర్పడిన శుద్ధ ప్రజాస్వామిక సమాజానికి అన్వయింపబడజాలదన్న కుంటి సాకులతో వర్గపోరాట సిద్ధాంతాన్నే అతను తిరస్కరించాడు.

ఈవిధంగా, విప్లవాత్మక సోషల్ డెమొక్రటిక్ ఉద్యమాన్ని బూర్జువా సోషల్ సంస్కరణవాదానికి మళ్లించాలన్న ఖచ్చితమైన డిమాండుకు, మార్క్సిస్టు మూలసూత్రాలపైన ఖచ్చితమైన బూర్జువా విమర్శ జోడింపబడింది. ఈ రకమైన విమర్శ, చిరకాలంగా రాజకీయ వేదిక మీదనుంచీ, విశ్వవిద్యాలయ ఆచార్య పీఠాలనుంచీ, అనేక పుస్తకాల్లోనూ, పాండిత్య ప్రకర్షతో కూడిన గ్రంథ పరంపరలోనూ మార్క్సిజానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడిన దృష్ట్యా, విద్యావంతులైన మొత్తం యువతరం యీ విమర్శ అనే ఉగ్గుపాలతో క్రమబద్ధంగా దశాబ్దాల తరబడి పెరిగిన దృష్ట్యా, సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో యీ “కొత్త విమర్శనాత్మక” ధోరణి, జూపిటర్ శిరస్సునుంచి ఉద్భవించిన మినేర్వా మాదిరిగా, సమగ్ర రూపంలో తలెత్తడం ఆశ్చర్యకర విషయమేమీ కాదు. ఈ కొత్త ధోరణి సారాంశం క్రమంగా పెంపొంది, రూపుదాల్చవలసిన అవసరం లేకపోగా, అది బూర్జువా సాహిత్యం నుంచి యథాతథంగా సోషలిస్టు సాహిత్యంలోకి బదిలీ అయింది.

అంతేకాదు. బెర్న్‌స్టెన్ సైద్ధాంతిక విమర్శా, రాజకీయ ఆరాటాలూ ఏమిటో ఎవరికైనా యింకా స్పష్టం కాకపోతే, యీ "కొత్త విధానం" ఏమిటో ప్రస్ఫుటంగా చూపేందుకు ఫ్రెంచివారు శ్రమ తీసుకున్నారు. "మరి ఏ యితర దేశంలో కన్నా అధికంగా ఫ్రాన్సులోనే, ప్రతి ఒకసారీ చరిత్రాత్మకమైన వర్గపోరాటాలు తుదికంటా సాగాయి..." (మార్క్స్ రచించిన "లూయీ బోనపార్టీ బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ"కి ఎంగెల్స్ "ముందుమాట" నుంచి) అన్న తన పాత ప్రశస్తిని ఫ్రాన్సు, యీ సందర్భంలో కూడా నిలబెట్టు కుంది. ఫ్రెంచి సోషలిస్టులు సిద్ధాంతీకరించడం గాక, ఆచరించడం మొదలెట్టారు. ఫ్రాన్సులోని ప్రజాస్వామికంగా మరింత ఉన్నత స్థాయికి అభివృద్ధిచెందిన రాజకీయ పరిస్థితులు, వాళ్లు వెంటనే దాని పర్యవసానాలన్నింటితోనూ, "బెర్న్‌స్టెన్ నిజాన్ని ఆచరణలో పెట్టడాన్ని" సాధ్యం చేశాయి. ఆచరణలో బెర్న్‌స్టెనిజానికి మిలెరాన్ చక్కటి ఉదాహరణను సమకూర్చాడు. కాగా, మిలెరాన్ని బలపరచేందుకూ, అతన్ని ప్రస్తుతించేందుకూ బెర్న్‌స్టెన్ ఫోల్మర్‌లు మహోత్సాహంగా పూనుకోవడమన్నది ఆకారణంగా జరగలేదు. నిజానికి, సోషల్ డెమోక్రటిక్ పార్టీ సారంలో, కేవలం సంస్కరణల కోసమే పనిచేసే పార్టీ మాత్రమే అయి, యీ విషయాన్ని బాహాటంగా చాటే ధైర్యం దానికి వుంటే బూర్జువా మంత్రివర్గంలో చేరే హక్కును కలిగివుండటమే గాక, సోషలిస్టు సదా అందుకోసం కృషి చెయ్యాలి. వాస్తవానికి ప్రజాస్వామ్యపు అర్థం వర్గ పెత్తనపు రద్దే అయినట్లయితే, అప్పుడిక ఆ సోషలిస్టు మంత్రి, వర్గ సామరస్యంపై గంభీరోపన్యాసాలిచ్చి, యావత్తు బూర్జువా ప్రపంచాన్నీ ఎందుకు సమ్మోహితం చెయ్యకూడదు? కార్మికుల్ని సాయుధ పోలీసులు తుపాకులతో కాల్చి చంపడంద్వారా, ఆ వర్గ సామరస్య సారాంశమేమిటో వందసార్లూ, వెయ్యిసార్లూ రుజువైన తర్వాత సైతం, ఆ సోషలిస్టు మంత్రి, మంత్రివర్గంలో ఎందుకు కొనసాగకూడదు? విప్లవకారుల్ని ఉరికంబాల కెక్కించి, కొరడా దెబ్బలు కొట్టించి, ప్రవాస శిక్షలకు గురిచేసిన వీరుడుగా తప్ప మరోవిధంగా ఫ్రెంచి సోషలిస్టులచేత గుర్తింపబడని రష్యన్ జార్ సన్మానంలో యీ మంత్రి ఖుద్దున ఎందుకు పాల్గోకూడదు? యావత్ప్రపంచపు దృష్టిలో సోషలిస్టు పార్టీ యింతటి తలవంపులకూ, ఆత్మహైన్యానికి ఒడిగట్టి, మన విజయానికి ఏకైక హామీ అయిన కార్మిక జనసామాన్యపు సోషలిస్టు చైతన్యాన్ని కల్తీ చేసినందుకుగాను, దానికి ముట్టిన ప్రతిఫలం ఏమిటి? అల్పమైన సంస్కరణలకు గాను ఘనమైన పథకాలు; వాస్తవానికి ఆ సంస్కరణలైనా కూడా ఎంత అల్పమైనవంటే, బూర్జువా ప్రభుత్వాలు అమలుజరిపినవి సైతం వాటికంటె ఎంతో మేలైనవి!

సోషలిజంలో తలెత్తిన యీ కొత్త "విమర్శనాత్మక" ధోరణి ఓ కొత్త రకం అవకాశవాదం తప్ప మరొకటి కాదని బుద్ధిపూర్వకంగా కళ్లు మూసుకోనివాడు ఎవడైనా చూడకుండా వుండలేడు. మనుషుల్ని, వాళ్లు ధరించే మెరిసే యూనిఫారాలనుబట్టీ, వాళ్లు తమకు పెట్టుకునే పేర్లనిబట్టీగాక, వాళ్ల చేతలనుబట్టీ, వాళ్లు వాస్తవంగా ఏమి ప్రచారం చేస్తున్నారన్నదాన్నిబట్టీ కనుక మనం బేరీజు వేసినట్లయితే, "విమర్శనా స్వేచ్ఛ" అంటే అర్థం, సోషల్ డెమోక్రటిక్ పార్టీలో అవకాశవాద ధోరణికి స్వేచ్ఛ అనీ, సోషల్ డెమోక్రటిక్ పార్టీని సంస్కరణవాద డెమోక్రటిక్ పార్టీగా మార్చేందుకు స్వేచ్ఛ అనీ, సోషలిజంలోకి బూర్జువా భావాలనూ, బూర్జువాశక్తులనూ ప్రవేశపెట్టేందుకు స్వేచ్ఛ అనీ స్పష్టమవుతుంది.

"స్వేచ్ఛ" అనేది గొప్ప మాటే, కాని పరిశ్రమలకు స్వేచ్ఛ అనే నినాదం కింద అత్యంత కొల్లదారీ యుద్ధాలు సాగాయి, శ్రమకు స్వేచ్ఛ అనే నినాదంకింద శ్రామికజనం దోచుకోబడ్డారు. "విమర్శనా స్వేచ్ఛ" అనే ఆధునిక పదబంధంలో కూడా యిదే అంతర్గత బూటకం యిమిడి వుంది. విజ్ఞానశాస్త్రంలో తాము పురోగతిని సాధించామని నిజంగా నమ్మినవాళ్లు కొత్త అభిప్రాయాలు పాతవాటితోబాటు కలిసిమెలిసి కొనసాగే స్వేచ్ఛ కావాలనికాక, పాతవాటి స్థానంలో కొత్తవాటిని ప్రవేశపెట్టాలని డిమాండు చేసివుండేవారు. "విమర్శనా స్వేచ్ఛ వర్థిల్లాలి" అంటూ యీనాడు వినిపిస్తున్న నినాదం, ఖాళీ పీపా కథను గుర్తుకు తెస్తోంది.

గుంపుగా నిట్రంగా వున్న కష్టమైన బాటవెంట, ఒకరి చేతిని మరొకరం దృఢంగా పట్టుకొని, మనం ఘనిష్టమైన గుంపుగా నడుస్తున్నాం. మన చుట్టూ అన్ని పక్కలా శత్రువులు వున్నారు. దాదాపు ఎడతెగకుండా వాళ్లు జరిపే కాల్పుల మధ్య మనం ముందు కెళ్లాలి. స్వచ్ఛందంగా చేసుకున్న నిర్ణయం మేరకు, శత్రువుతో పోరాడేందుకోసం, మనం జత కలిశాం, అంతేగాని, పక్కనే వున్న ఊబిలోకి తిరోగమించేందుకు కాదు. ఆ ఊబిలో ఉన్నవాళ్లు, మొదట్నుంచీ, మనల్ని ఒక ప్రత్యేక గ్రూపుగా విడిపోయినందుకూ, రాజీ పంథాని గాక పోరాట పంథాని చేబట్టినందుకూ దూషిస్తూ వచ్చారు. మరి యిప్పుడు మనలో కొందరు ఊబిలోకి పోదాం పదండి అంటూ అరవడం మొదలెట్టారు. మనం వాళ్ల సిగ్గుమాలినతనాన్ని ఎండగట్టినప్పుడు వాళ్లు, మీరెంత వెనకబడిన మనుషులు! మిమ్మల్ని మరింత మంచి పంథాలోకి ఆహ్వానించే స్వేచ్ఛని మాకు తిరస్కరించడానికి మీకు సిగ్గులేదూ! -అంటూ దెప్పిపొడుస్తున్నారు. లేకపోవడమేమిటి, పెద్ద మనుషుల్లారా,వుంది! మమ్మల్ని ఆహ్వానించేందుకే కాకుండా, ఎక్కడికి వెళ్లేందుకైనా, చివరకు ఊబిలోకి వెళ్లేందుకు సైతం మీకు స్వేచ్ఛ వుంది. నిజానికి, ఊబే మీకు సరైన స్థానం అని మేం అనుకుంటున్నాం. అక్కడికి చేరుకునేందుకు మీకు మా శక్తిమేరకు సహాయం చేసేందుకు మేము సంసిద్ధంగా వున్నాం. అయితే, మా చేతులు మాత్రం వదలండి. మమ్మల్ని పట్టుకు వేళ్లాడకండి, విశిష్టమైన స్వేచ్ఛ అనే మాటను కలుషితం చెయ్యకండి, ఎందుచేతంటే, మా యిష్టం వచ్చిన చోటుకి వెళ్లడానికి మాకూ "స్వేచ్ఛ" వుంది. ఊబిలో వున్న వాళ్లతోనే కాకుండా, ఊబిలోకి పోవాలని తహతహలాడేవారితో కూడా పోరాడే స్వేచ్ఛ మాకుంది!

❖❖❖

**ఫుట్‌నోట్-1:** సందర్భవశాత్తూ యిక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. సోషలిస్టు ఉద్యమం లోపల వివిధ ధోరణుల మధ్య పోరాటం జాతీయ స్థాయినుంచి అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. ఆధునిక సోషలిస్టు ఉద్యమ చరిత్రలో యిది బహుశా సాటిలేని, ఒక విధంగా సంతోషించవలసిన విషయం. పూర్వం, లాసాలియన్లకూ ఐసెనాఖర్లకూ మధ్య, గెడిస్టులకూ పాసిబిలిస్టులకూ మధ్య ఫేబియన్లకూ సోషల్ డెమోక్రట్లకూ మధ్య, "నరోద్నయవోల్యా" అనుచరులకూ సోషల్ డెమోక్రట్లకూ మధ్య వివాదాలు పూర్తిగా జాతీయ పరిధులకు పరిమితమై, పూర్తిగా జాతీయ వైఖరులను ప్రతిబింబిస్తూ, ఒక విధంగా భిన్న భిన్న స్థాయిల్లో సాగుతూ వుండేవి. కాని యీనాడు (యీ విషయం యిప్పుడు స్పష్టమే), ఇంగ్లీషు ఫేబియన్లు, ఫ్రెంచి మినిస్టీరియలిస్టులు, జర్మన్ బెర్న్‌స్టెన్లు, రష్యన్ విమర్శకులు-అందరూ ఒకే మూసలో వాళ్లు. వీళ్లందరూ ఒకళ్లనొకళ్లు పొగుడుకుంటూ, ఒకళ్లనుంచి యింకొకళ్లు నేర్చుకొంటూ, కలిసి కట్టుగా "పిడివాద" మార్క్సిజానికి వ్యతిరేకంగా కత్తిగడుతూ వున్నారు. సోషలిస్టు అవకాశ వాదులతో జరిగే యీ తొలి వాస్తవ అంతర్జాతీయ పోరాటంలో, అంతర్జాతీయ విప్లవాత్మక సోషల్ డెమోక్రట్లు తగినంతగా బలం పుంజుకొని, యూరప్‌లో చాలకాలంగా పాతుకొని వున్న రాజకీయ అభివృద్ధినిరోధక శక్తులను తుద ముట్టించే అవకాశం లేదంటారా? ✶

# ప్రపంచ శ్రామిక విప్లవాల మేలి మలుపు

# చైనా నూతన ప్రజాస్వామిక విప్లవం

**2019** అక్టోబర్ ఒకటవ తేదీ నాటికి చైనా మహా విప్లవం విజయవంతమై 70 సంవత్సరాలు పూర్తయ్యాయి. 102 సంవత్స రాలకు పూర్వం విజయవంతమైన తొలి శ్రామిక విప్లవం రష్యా దేశపు బోల్షివిక్ విప్లవానికి చైనా విప్లవం ఒక మేలి మలుపు. విప్లవం విజయ వంతమయేనాటికి ఎంత బలహీనమైనదైనా రష్యా కూడా ఒక సామ్రాజ్యవాద దేశమే! ఆ నాటికి సామ్రాజ్యవాదమనే గొలుసులో అత్యంత బలహీనమైన లంకె జారు చక్రవర్తుల ఏలికలోని రష్యా సామ్రాజ్యమని లెనిన్ విశ్లేషించాడు. భారతదేశం లాగా వేల సంవత్సరాల నాగరికత, చరిత్రా కలిగిన చైనాలో విప్లవం విజయవంతం కావటానికి 110 సంవత్సరాల ముందువరకూ ఫ్యూడల్ సమాజంగా వుండినది. ఒకదానికొకటి సంబంధం లేని అనేక చెల్లా చెదురు రైతాంగ తిరుగుబాట్లను చవి చూసింది. ప్రపంచ సామాజిక చరిత్ర నడకకున్న గతితర్కమేమంటే భూమి, చేతివృత్తులు కేంద్రంగా వుండిన ఫ్యూడల్ సమాజం తరవాత పెట్టుబడి కేంద్రంగా గల ఆధునిక యంత్ర పరిశ్రమల బూర్జువా సమాజం ఏర్పడగలుగుతుంది. ఫ్యూడల్ రాచరిక వారసత్వ రాజ్యం పోయి ఆధునిక ప్రజాస్వామ్యం పేరుతో బూర్జువా నియంతృత్వం ఏర్పడుతుంది. ఈ ఆధునిక పెట్టుబడిదారీ సమాజం తనతోపాటే రెక్కలుతప్ప వ్యక్తిగత ఆస్తి లేని కార్మిక వర్గాన్ని కూడా పెంచుకుంటూ పోతుంది. (ఇటీవల కాలపు ఉపాధిలేని అభివృద్ధి – పెట్టుబడిదారీ వ్యవస్థ పతన దశకు చిహ్నం) శ్రమకూ పెట్టుబడికీ నడుమ గల వైరుధ్యాన్ని తీవ్రతరం కావించటం పెట్టుబడిదారీ సమాజపు మరొక ముఖ్య లక్షణం. ఆ కారణంగా కార్మికవర్గ నాయకత్వాన విప్లవాలు చెలరేగుతాయని మార్క్స్ ఏంగెల్సులు 170 సంవత్సరాల క్రితం కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పారు. అదే సమయంలో పెట్టుబడికి వున్నట్లే శ్రమకు కూడా అంతర్జాతీయ స్వభావం ఏర్పడుతుందని ప్రపంచ కార్మికవర్గ సిద్ధాంతానికి రూప కల్పన చేశారు. అలాంటి మార్క్సిస్టు సిద్ధాంతపు వెలుగులో లెనిన్ స్టాలిన్ల నాయకత్వాన నడిచిన బోల్షివిక్ పార్టీ రష్యాదేశంలో శ్రామిక విప్లవాన్ని విజయవంతం చేసింది. దీనినే అక్టోబర్ మహా విప్లవం అంటున్నారు.

అలాగే పెట్టుబడిదారీ వ్యవస్థ తన మార్కెట్ల విస్తరణకు, వనరుల దోపిడీకి వెనుక బడిన రాజ్యాలను, ప్రాంతాలను దురాక్రమించి భారతదేశం లాంటి వాటిని వలసలు గాను, చైనాలాంటి దానిని అర్ధ వలసగాను మార్చు కున్నారు. ఈ దశలోనే బ్రిటిష్ వలసవాదుల ప్రత్యక్ష దురాక్రమణలో ఉన్నందున భారతదేశం వలస–అర్ధ ఫ్యూడల్ సమాజంగాను, ఆధిపత్యానికై పలు సామ్రాజ్యవాద శక్తులు సంఘర్షణ పడుతున్న కారణంగా చైనా అర్ధవలస–అర్ధఫ్యూడల్ సమాజంగానూ మార్పులు పొందాయి.

పెట్టుబడిదారీవిధానం గుత్త పెట్టుబడి దారి వ్యవస్థగాను సామ్రాజ్యవాదంగానూ పరిణమించే క్రమంలో ద్రవ్య పెట్టుబడి కూడా ఈ పరాధీన దేశాలలోకి ప్రవహించటం మొదలయ్యింది.

## చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుకు ముందు :

ఆసియాలో తొలి అభివృద్ధి చెందిన దేశమైన జపాను, చైనా దేశపు ఫ్యూడల్ ప్రభువులతో వ్యాపార రాజకీయ అసమాన ఒప్పందాలు చేసుకుంటూ ఆర్థిక రాజకీయ దోపిడీ విస్తరణ సాగించింది. 19వ శతాబ్దం నడిమధ్యలో చైనాలో జరిగిన అనేక తిరుగుబాట్లలో పేర్కొనదగినది నల్లమందు యుద్ధం. భారతదేశంపై వలస పెత్తనం సాగిస్తున్న బ్రిటిష్ వ్యాపారులు ఇక్కడ నుండి నల్ల మందుని చైనాకు ఎగుమతి చేసి వారిని నల్లమందు భాయీలుగా మార్చి విపరీత లాభాలు గడించారు. ఈ లూటీని ఎదిరించిన వారిని తమ వ్యాపార సంరక్షణ పేరుతో బ్రిటిష్ వలసవ్యాపారులు చైనా ప్రజల ప్రతిఘటనను అణచి వేశారు. అలా 1840లో జరిగిన తిరుగుబాటు యుద్ధాన్ని నల్లమందు యుద్ధం అంటారు. దీని తదనంతరం చైనాలోని అనేక రేవు పట్టణాలు బ్రిటిష్ ప్రభుత్వ అజమాయిషీలోకి వచ్చాయి. హాంగ్ కాంగ్ పై బ్రిటిష్ ప్రభుత్వం పూర్తి అధికారాలను పొందింది.

1851 – 1864ల నడుమ 14 సంవత్సరాలు పాటు 17 రాష్ట్రాలలో సాగిన తైపింగ్ రైతాంగ తిరుగుబాటు ఫలితంగా నాన్ కింగ్‌లో విప్లవ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ దానిని నిలుపుకోలేక పోయారు. విప్లవ ప్రతీఘాతుక చింగ్ సామ్రాజ్య ఫ్యూడల్ సైన్యాలూ, వారికి బాసటగా నిలిచిన అమెరికన్ బ్రిటిష్ ఫ్రెంచ్ దురాక్రమణ దారులూ ఉమ్మడిగా చేసిన సైనిక దాడిని తైపింగ్ తిరుగుబాటు ప్రభుత్వం ఎదుర్కోలేక పోయింది. వారు గొప్ప విప్లవకారులే కానీ ఆధునిక దృక్పథం లేనందువల్ల ఓటమికి బలయ్యారు.

అప్పటినుండి చైనా ప్రజలలో నూతన భావాలు అంకురించటం మొదలయింది. విద్యార్థులు యువజనులు మేధావులలో జాతీయ ప్రజాస్వామిక చైతన్యం క్రమంగా నెలకొంటున్న కాలం ఇది. విదేశీ పెట్టుబడులతో పాటు స్వదేశీ పరిశ్రమలు కూడా విస్తరించ సాగాయి. జాతీయ బూర్జువా వర్గం, కార్మిక వర్గం నిదానంగానే అయినా పుట్టి పెరుగుతున్న క్రమం ఆరంభమైంది. చెప్పుకోదగిన ముఖ్య అంశం ఏమంటే విదేశీ దోపిడీ శక్తులు చైనా ఫ్యూడల్ శక్తులతో మిలాఖత్ అవటమే కాకుండా వారిపై ఆధారపడి ప్రజల ఆందోళనలను తిరుగుబాట్లను అణచివేతలకు గురిచేశారు. భారతదేశంలో లాగానే సామ్రాజ్యవాద శక్తులకు చైనాలో కూడా ఫ్యూడలిజం సాంఘిక పునాదిగా నిలిచింది.

1900వ సంవత్సరంలో బక్సార్ ఉద్యమంగా పేరుపొందిన రైతుల తిరుగుబాటును అమెరికా, ఆస్ట్రియా, జపాన్, జర్మనీ, జారిస్టు రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్ ఇటలీ – మొత్తం ఎనిమిది సామ్రాజ్యవాద దేశాల సైన్యాలు ఆ రైతాంగ తిరుగుబాటుని అణచి వేశాయి. ఫలితంగా నాటి 'మంచూ' ప్రభుత్వం అవమానకరమైన షరతులకు తలవొగ్గవలసి వచ్చింది.

1911లో సన్ యెట్ సేన్ నాయకత్వాన విప్లవం వచ్చింది . ఇది 'మంచూ' ప్రభువుల పాలనను కూలదోసింది. కానీ జాతీయ పెట్టుబడిదారి వర్గాన్ని అధికారంలోకి తీసుకు రాలేక పోయింది. అందుకు ఒక ముఖ్య కారణం పశ్చిమ రాజ్యాలు చైనాలోని ఫ్యూడల్ శక్తులకు

ఆయుధాలు, డబ్బులు ఇచ్చి బాగా ప్రోత్సహించి నందువల్లే జాతీయ పెట్టుబడిదారీ వర్గ శక్తులు వారిని ఓడించలేక పోయాయి.

కామ్రేడ్ మావో మాటలతో తర్వాత అంశంలోకి వెళ్దాం. "చైనాలో బూర్జువా వర్గపు నిరంకుశత్వం కింద పెట్టుబడిదారి ప్రభుత్వం ఏర్పడటాన్ని మొట్టమొదటగా అడ్డుకున్నది అంతర్జాతీయ పెట్టుబడిదారి విధానం. అదే సామ్రాజ్యవాదం. మొత్తం ఆధునిక చైనా చరిత్ర-సామ్రాజ్యవాదులు చైనాపై సాగించిన దురాక్రమణ చరిత్రే; చైనా స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకించిన సామ్రాజ్యవాదం చరిత్రే; చైనాలో పెట్టుబడిదారి విధానం అభివృద్ధికి ఆటంకంగా నిలిచిన సామ్రాజ్యవాదం చరిత్రే అది"

## 1919 మే 4 ఉద్యమం ప్రాముఖ్యత

అదే సంవత్సరం భారతదేశ చరిత్రలో కూడా సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం కొత్త ఊపుని సంతరించుకున్నప్పటికీ నాటికి ఒకటిన్నర సంవత్సరాల క్రితం విజయవంతమైన సోవియట్ విప్లవం అలాగే మార్క్సిజం-లెనినిజం యొక్క ప్రభావం చైనాపైన చెప్పుకోదగినంత పడింది. లెనిన్ నాయకత్వాన కొత్తగా అధికారం లోకి వచ్చిన బోల్షివిక్ ప్రభుత్వం , చైనా విషయంలో జారు చక్రవర్తులు చేసుకున్న కొన్ని అసమాన ఒప్పందాలని స్వచ్ఛందంగా రద్దు చేసుకుంది. మరోవైపు మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత అందులో విజేతలైన అగ్రరాజ్యాల నడుమ వర్సైయిల్స్‌లో శాంతి పేరిట జరిగిన ఒప్పందాలను దోపిడి దొంగల వాటాల పంపిణీగా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం , లెనిన్ ఖండిస్తూ వచ్చారు. ఆ సంధిలో అగ్రరాజ్యాలు చైనాకు అన్యాయం చేశాయి. జర్మనీ ఆధిపత్యంలో ఉండిన చైనా భూభాగాలను అగ్ర రాజ్యాలు జపానుకు అప్పగించాయి. ఇది నాటి చైనా యువతలో అగ్రరాజ్యాలపట్ల వ్యతిరేకతను, బోల్షివిక్ రష్యా పట్ల మరింత ఆకర్షణను పెంచాయి. జపాన్ దేశపు జాతీయవాదంతో ప్రభావితులైన చైనా మేధావి వర్గం పాశ్చాత్య దేశాల బూర్జువా ప్రజాస్వామ్యానికి ఆకర్షితులైనప్పటికీ , వర్సైల్స్‌లో జరిగిన ఒప్పందాల 'శాంతి' సభ చైనాకు విద్రోహం తలపెట్టడంతో ఆ భ్రమలు కూడా వీడాయి. చైనా జాతీయోద్యమ నాయకుడు డాక్టర్ సన్ యట్ సేన్ మాటలలో చెప్పాలంటే "చైనా కోసమని ఏ సూర్యుడూ పశ్చిమాన ఉదయించడు కదా!"

మార్క్సిజం పట్ల ప్రభావితుడైన మొదటి చైనా వ్యక్తిగా లీ టా - చావో పేరు చెప్పుకుంటారు. ఈయన అక్టోబర్ సోషలిస్టు విప్లవాన్ని 1918 చివరి నుండి ప్రచారం చేయటం మొదలు పెట్టాడు. కార్మికవర్గ విప్లవ విజయానికి కారణం బోల్షివిజం అంటే మార్క్సిజం - లెనినిజం అనే సిద్ధాంతమేనని ప్రకటించాడు. ఆ సిద్ధాంతానికి ఉండిన సరికొత్త ప్రాపంచిక దృక్పథాన్ని విస్తృతపరిచే విధంగా వివరించి నూతన యువతరాలను ఆకట్టుకున్నాడు. మావో కూడా 1919 మే 4 ఉద్యమానికి ముందే మార్క్సిస్టు సిద్ధాంతం తెలుసుకుని యువకులను చైతన్యవంతం కావించే కృషిలో నిమగ్నుడై ఉన్నాడు. కామ్రేడ్ మావో ఇలా చెప్పారు: "అక్టోబర్ విప్లవ దుందుభి మార్మోగడంతో మార్క్సిస్టు లెనినిస్టు శంఖారావం మా చెవుల్లో ప్రతిధ్వనించింది. చైనాలోనూ మిగతా ప్రపంచంలోనూ గల ప్రగతిశీల శక్తులు కార్మికవర్గ ప్రపంచ దృక్పథాన్ని స్వీకరించి ఆ దృక్పథంలో తమ తమ దేశాల భవిష్యత్తును నిర్ధారించుకోవడానికి, తమ సమస్యలను పరిష్కరించుకునేందుకూ మార్గాలు కనుగొన డానికి అక్టోబర్ విప్లవం దోహదం చేసింది"

అక్టోబరు విప్లవం నుండి ఉత్తేజం పొందిన చైనా ప్రజలు 1919లో మే 4 ఉద్యమాన్ని ప్రారంభించారు. చైనాలో అప్పటి వరకు జర్మనీ అనుభవిస్తున్న సౌకర్యాలను జపాన్‌కు బదిలీ చేయడానికి వ్యతిరేకంగా ఆ ఉద్యమం బయలుదేరినా సామ్రాజ్యవాదులకు లొంగిపోయిన ఫ్యూడల్ సైనిక వాదులకు వ్యతిరేకంగా కూడా సాగిన ఉద్యమమది. అందువల్ల మే నాలుగు ఉద్యమం గత ఉద్యమాలన్నిటికంటే పూర్తిగా భిన్నమైనది, అతి నవీనమైనది కూడా! దీనిని చైనా జాతీయ విప్లవంలో నూతన ప్రజాస్వామిక దశగా మావో పేర్కొన్నాడు.

బీజింగ్‌లో మే 4న 3000 మందితో ప్రారంభమైన ఉద్యమం చైనా నలుమూలలకు ప్రాకింది. 18 నెలలలో సుమారు 200 నగరాలు పట్టణాలలో ప్రదర్శనలు, సమ్మెలు, హర్తాళ్ళు జరిగాయి. వీటిలో మొత్తం రెండు కోట్లమంది విద్యార్థులు, ప్రొఫెసర్లు, కార్మికులు, దుకాణదారులు, వర్తకులు పాల్గొన్నారు. మావో జడాంగ్‌తో సహా లక్షలాదిమంది చైనీస్ యువకులలో సమున్నతమైన రాజకీయ చైతన్యపు బీజాలను ఈ ఉద్యమం నాటింది .

ఈ ఉద్యమానికి సాంస్కృతిక కోణాలు కూడా ఉన్నాయి. చైనీస్ గ్రాంథిక భాషను, దాని సంక్లిష్టమైన లిపినీ అందరికీ అర్థమయ్యే వ్యవహారిక శైలిలో రాసే మలుపుకు ఇది కారణమైంది. స్త్రీ పురుష సమానత్వం కోసం భావజాల రంగంలో, ఆచరణ రంగంలో సంఘర్షణ కృషికి ఇది ప్రేరణ అయింది. పసిపిల్లల వయసులో ఉండగానే స్త్రీల పాదాలను ఎదగ నివ్వకుండా కట్టివేసే దురాచారానికి వ్యతిరేకంగా ఈ ఉద్యమం నిలిచింది. ఇది చైనా ప్రజల ఉన్నతమైన రాజకీయ చైతన్యపు స్థాయికి నిదర్శనమనీ, ప్రజాబాహుళ్యపు మహాద్భుతమైన కార్యాచరణ శక్తిని నిరూపించిన ఉద్యమమని మావో పేర్కొన్నాడు. అంతేకాక చైనా విప్లవంలో తర్వాత కాలంలో నిర్మించిన ఐక్య సంఘటన ఎత్తుగడలకు, చైనా విప్లవ తక్షణ లక్ష్యం సోషలిజం కాదనీ నూతన ప్రజాస్వామిక విప్లవమనే అవగాహనకు ఈ ఉద్యమం బీజాలు వేసింది. చైనాలో మార్క్సిజం-లెనినిజం సిద్ధాంత ప్రాతిపదికపై కమ్యూనిస్టు పార్టీ ఏర్పడటానికి దోహదం చేసింది.

అప్పటికే అదే సంవత్సరం కామ్రేడ్ లెనిన్ మార్గదర్శకత్వంలో మూడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏర్పడింది. అది వలసలు, అర్ధ వలసలుగా ఉంటున్న దేశాలలో సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక పోరాట లక్ష్యాలను ముందుకు తెచ్చింది.

## చైనా కమ్యూనిస్టు పార్టీ స్థాపన- 1921 నుండి విప్లవ ఐక్య సంఘటన 1924 దాకా...

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో చైనా జాతీయ పరిశ్రమలు వేగంగా పెరగడంతో చైనా కార్మిక వర్గం కూడా పెరిగింది. వాళ్ళ పోరాటాల పరిధి, ఉద్ధృతి విస్తరించింది. అక్టోబర్ సోషలిస్టు విప్లవానంతరం చైనాలో మార్క్సిజం-లెనినిజం ప్రవేశించింది. మే 4 ఉద్యమం చైనా కార్మికవర్గ ఉద్యమాన్ని మార్క్సిజం-లెనినిజంతో సమైక్యం కావడాన్ని త్వరితం చేసింది.

వీటన్నిటి ఫలితంగా 1921 జూలైలో కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ ప్రతినిధి సమక్షంలో చైనా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. అప్పటికి వివిధ అధ్యయన బృందాలుగా విడి విడి కార్యాచరణ సాగించే సంస్థలుగా ఉండిన వారి నుండి 12 మంది ప్రతినిధులుగా

హాజరైన తొట్టతొలి పార్టీ మహాసభ అది. మొత్తం 57 మంది సభ్యులకుపై వారు ప్రాతినిధ్యం వహిస్తూ జరుపుకున్న సభ అది. మావో జెడాంగ్ హాజరైన వారిలో ఉన్నారు. ప్రొఫెసర్ చెన్ టు షీ హాజరు కాలేదు కానీ ఆయననే మొదటి సెంట్రల్ కమిటీ నాయకునిగా ఎన్నుకున్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ మొదటి జాతీయ మహాసభ బోల్షివిక్ పార్టీ నిర్మాణ సూత్రాలను రూపొందించుకుంది. చైనా విప్లవం కూడా రష్యా సోషలిస్ట్ విప్లవం లాగే ఉంటుందనే భావనే అప్పటికి ఉండేది. అదే సమయంలో రెండు పొరపాటు దృక్పధాలను మొదటి మహాసభ తిరస్కరించింది. 1. పార్టీని ఒక ఎకడమిక్ సంస్థలా ఉంచాలకునేనే 'చట్టబద్ధ మార్క్సిజం' అను మితవాద దృక్పధాన్ని; 2. శ్రామిక వర్గ నియంతృత్వమే పార్టీ తక్షణ లక్ష్యం కావాలి అంటూ చట్టబద్ధ కార్యక్రమాలు నడపటాన్ని, మేధావులను పార్టీలో చేసుకోవడాన్ని, ఇంకా బూర్జువా ప్రజాతంత్ర ఉద్యమాల్లో పార్టీ పాల్గొనరాదంటూ వాదించిన 'అతివాద దృక్పధా'న్ని' తిరస్కరించింది.

1922 జూలైలో జరిగిన పార్టీ రెండవ మహాసభ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ మార్గ దర్శకత్వంలో ఒక కనీస, గరిష్ఠ కార్యక్రమాలను రూపొందించుకుంది. దూర ప్రాచ్య దేశాల అనగా వలస, అర్ధవలస దేశాలలో విప్లవాల గురించిన ప్రత్యేక సదస్సు ఆమోదించిన లెనిన్ కలోనియల్ థీసిస్ నిర్ణయాల ప్రకారం చైనాను ఈ మహాసభ అర్ధవలస అర్ధ ఫ్యూడల్ దేశంగా పేర్కొంది. ఆనాటికి కార్మికవర్గ పోరాటాలు ఉవ్వెత్తున చెలరేగాయి. సామ్రాజ్యవాద శక్తుల సూచనలతో ఫ్యూడల్ యుద్ధ ప్రభువుల అణచివేతకి అవి గురయ్యాయి. అయితే చైనా రాజకీయ ఆర్థిక జీవనంలో కార్మికవర్గం నిర్వహించగలిగే ముఖ్యమైన పాత్రను గ్రహించ గలిగేట్లు అవి చేశాయి. అదే సమయంలో ఇతర ప్రజాతంత్ర శక్తులతో ఐక్యంగా నిలిచి పోరాడ వలసిన ఆవశ్యకతను ఎరుకలోకి తెచ్చాయి. ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా జాతీయ ప్రజాతంత్ర విప్లవం కనీస కార్యక్రమంగా తక్షణ లక్ష్యంగా ప్రకటించినప్పటికీ దానికి నాయకత్వం వహించవలసినది ఎవరు? అనే కీలకాన్ని గుర్తించడంలో ఈ సభ విఫలమయింది. కొమిన్‌టర్న్ సూచనల ప్రకారం కొమింగ్ టాంగ్ పార్టీతో ఐక్య సంఘటనను ఆమోదించి నప్పటికీ అది అమలులోకి రాలేదు.

1923లో జరిగిన మూడవ జాతీయ కాంగ్రెస్ డాక్టర్ సన్ యట్ సేన్ నాయకత్వం లోని కొమింటాంగ్ పార్టీతో ఐక్య సంఘటనను నిర్మించాలని నిర్ణయించింది. డాక్టర్ సన్ యెట్ సేన్ రష్యన్ బోల్షివిక్‌ల సహకారంతో చైనా కమ్యూనిస్టు పార్టీతో కలసి జాతీయ ప్రజాతంత్ర విప్లవం సాగించడానికి సానుకూల భావన కలిగి ఉండేవాడు. అయితే కమ్యూనిస్టు పార్టీ నాయకుడైన చెన్ టు షీ బూర్జువా ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం బూర్జువావర్గమే వహించాలని, కార్మికవర్గం దాని అగ్రగామి దళమైన కమ్యూనిస్టు పార్టీ అందుకు కేవలం సహాయపడాలని చేసిన మితవాదాన్ని ఆ మహాసభ తిరస్కరించిది. ప్రజాతంత్ర విప్లవ దశ అయినప్పటికీ బూర్జువావర్గంతో ఎలాంటి సంఘటన నిర్మించకూడదనే ఒక అతివాద ధోరణి కూడా ఆ సభలో వ్యక్తమయింది.

మితవాద అతివాద పెడ ధోరణులను రెండింటినీ మూడవ కాంగ్రెస్ విమర్శించింది. కొమింగ్ టాంగ్ పార్టీకి కమ్యూనిస్టు పార్టీ అన్నివిధాలా సహకరించటానికి కమ్యూనిస్టు పార్టీ సభ్యులు కొందరు తమ తమ వ్యక్తిగత హోదాలో కొమింగ్ టాంగ్ పార్టీలో చేరాలని కాంగ్రెస్ నిర్ణయించింది. అయితే బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో కార్మికవర్గ నాయకత్వ పాత్ర గురించి, రైతాంగ సమస్య పైన, విప్లవ సైనిక నిర్మాణం పైన మహాసభ తగినంత దృష్టిని పెట్టలేదు. ఇది మూడు పంథాల మధ్య అనగా మితవాద చెన్ టు షీ , అతివాద చాంగ్ కువో తావోలతో బోల్షివిక్కు మావో పంథాల నడుమ పోరాటంగా వ్యక్తమైంది. మూడవ మహాసభ నాటికి చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం కేవలం 342 మంది.

1923లో కమ్యూనిస్టు పార్టీ సహకారంతో డాక్టర్ సన్ యెట్ సేన్ కాంటన్ నగరం కేంద్రంగా కాంగ్ టుంగ్ విప్లవ ప్రభుత్వాన్ని స్థాపించారు. దీని ఫలితంగా కార్మిక – కర్షక ఉద్యమాలు మరింత ఊపందుకున్నాయి.

కొమింగ్ టాంగ్ పార్టీ తొలి మహాసభ (1924) నిర్ణయం మేరకు వారి కేంద్ర కమిటీలోకి ముగ్గురు కమ్యూనిస్టులను తీసుకున్నారు. మరొక ఆరుగురు ప్రత్యామ్నాయ కేంద్ర కమిటీ సభ్యులలో మావో కూడా ఒకరు. కొంతకాలం కొమింగ్ టాంగ్ పార్టీ షాంఘై శాఖకు మావో ప్రచార విభాగ కార్యదర్శిగా ఉన్నాడు. ఆ పార్టీ నిబంధనావళి తయారు చేయడంలో మావో పాల్గొన్నాడు. రైతాంగంలో పనిచేయుటకు శిక్షణ పొందిన కార్యకర్తల అవసరాన్ని మావో వివరించాడు. ఈ మహాసభ మూడు ప్రజా సూత్రాలను, 3 జీవన సూత్రాలను ప్రకటించింది. సామ్రాజ్యవాదం నుండి చైనా జాతి స్వీయ విముక్తిని , అన్ని జాతుల సమానత్వాన్ని, నూతన ప్రజాతంత్ర హక్కులను అందించే లక్ష్య ప్రకటన అది. అంతేకాక భూ యాజమాన్య సమీకరణ, దున్నేవారికే భూమి, పెట్టుబడిపై అదుపు ఉంచుతామని చెప్పింది.

సోవియట్ యూనియన్ – చైనాల నడుమ కుదిరిన స్నేహ ఒడంబడిక, అలాగే జాతీయ విప్లవ సైన్య నిర్మాణం, విప్లవ క్రమాన్ని వేగవంతం చేశాయి.

సన్ యెట్ సేన్ అనుచరుడైన ఛాంగ్ కై షేక్‌ను మిలిటరీ శిక్షణకై ఐదు నెలల పాటు రష్యా పంపించారు. కాంటన్‌లో సోవియట్ యూనియన్ ప్రభుత్వ సహకారంతో వాం పోవా మిలటరీ అకాడమీని స్థాపించారు. కమ్యూనిస్టులతో సహా ఇందులో శిక్షణ పొందిన వారే కొత్తగా నెలకొల్పిన జాతీయ విప్లవ సైన్యానికి వెన్నెముక. కాంగ్ టుంగ్ ప్రాంతాన్ని అంతటినీ విప్లవ ప్రభుత్వం కిందకు ఈ సైన్యమే తీసుకురాగలిగింది. ఉత్తర ప్రాంతపు యుద్ధ ప్రభువులతో అది తలపడ గలిగింది . ఈ కాలంలోనే దక్షిణాన రైతు ఉద్యమం నిలకడగా పెరిగింది. 1921 నుండి కమ్యూనిస్టు పార్టీ కృషితో సాగుతున్న రైతాంగ ఉద్యమం ఫలితంగా అక్కడ పెంగ్ పాయ్ అనే రైతు ఉద్యమ కమ్యూనిస్టు నాయకుడు గ్రామీణ విప్లవ ప్రభుత్వాన్ని నెలకొల్పాడు. కామ్రేడ్ మావో నాయకత్వాన హూనాన్ రాష్ట్రకమిటీ నిలకడైన రైతాంగ ఉద్యమాన్ని నిర్మించే కృషి సాగించింది.

ప్రజా ఉద్యమాల ఉధృతి పెరుగుతున్న కాలంలో 1925 జనవరిలో 980 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహించే 20 మంది ప్రతినిధులతో కూడిన చైనా కమ్యూనిస్టు పార్టీ నాలుగవ మహాసభ షాంఘైలో జరిగింది. శ్రామికవర్గం బూర్జువా వర్గానికి తోకగా మారరాదని, తన స్వతంత్రతను కాపాడుకుంటూ ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం వహించాలని మహాసభ స్పష్టం చేసింది. అదే సమయంలో ఐక్య సంఘటనలోని విప్లవ శక్తులతో ఐక్యం కావాలని, అతివాద మితవాద అవకాశవాదులను ఎండగట్టాలని నిర్ణయించింది. 1925 మార్చి

12న డాక్టర్ సన్ యెట్ సేన్ ఆకస్మిక మరణంతో చైనా విప్లవానికి సరికొత్త ఆటంకాలు మొదలైనా, ఆయన మూడు విప్లవ సూత్రాలైన 1. సోవియట్ యూనియన్‌తో మైత్రి 2. చైనా కమ్యూనిస్టు పార్టీతో మైత్రి 3. కార్మిక కర్షకులతో మైత్రి అనే ముఖ్య సూత్రాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకు వెళ్లగలిగారు.

సన్ యెట్ సేన్ జీవించి ఉండగానే మొదలైన షాంఘై జౌళి కార్మికుల పోరాటాలు స్వల్ప వ్యవధిలోనే అఖిల చైనా కార్మిక మహాసభ ఏర్పడటానికి, పోరాటాన్ని అనేక పట్టణాలకు విస్తరించడానికి దారి తీసింది. కమ్యూనిస్టు పార్టీ మార్గదర్శకత్వంలో అంతే వేగంగా జపాన్ వ్యతిరేక రాజకీయ పోరాటంగా అవి మలుపు తీసుకున్నాయి. షాంఘైలో రెండు లక్షల మందికి పైగా కార్మికులు తమ పనిముట్లను కింద పడ వేశారు. 50 వేల మందికి పైగా విద్యార్థులు చదువుని వదిలేశారు. అనేక మంది వ్యాపారులు తమ దుకాణాలను మూసేశారు. చివరకు జపాన్ సామ్రాజ్యవాదుల నిరంకుశ విధానాలకు పరిష్కారం చట్టంలో లేదని రాజకీయాలతో ముడిపడిఉందని కనుక పోరాట లక్ష్యం చైనాలో ఉన్న అన్ని సామ్రాజ్యవాద సౌకర్యాలను రద్దు చేయటంగా ఉండాలని చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రజలకు ఒక విజ్ఞప్తి చేసింది. కార్మికుల సమ్మె పోరాటాలు హాంగ్‌కాంగ్‌కు కాంటన్ తదితర నగరాలకు విస్తరించాయి.

1925 మే నుంచి 1926 జూలై వరకు రైతాంగ ఉద్యమం కూడా వేగంగా అభివృద్ధి చెందింది. కామ్రేడ్ మావో బాధ్యతపై నడుస్తున్న కాంటన్ నగరంలోని రైతాంగ ఉద్యమ జాతీయ శిక్షణా.... సంస్థనుండి చాలా మందిని వివిధ రాష్ట్రాలలో రైతాంగంలో పనిచేయడానికి అప్పటికే పంపించారు. చైనా కమ్యూనిస్టు పార్టీ కృషి ఫలితంగా 1926 ఏప్రిల్‌లో హూనాన్లో రాష్ట్ర రైతుసంఘం ఏర్పడింది. దానిలో 2 లక్షల 70 వేల మంది సభ్యులు చేరారు. లక్షమంది రైతు ఆత్మ రక్షణ దళాల్లో ఉండేవారు.

1924 నుంచి 1926 తొలి రోజుల వరకు చైనా విప్లవం వేగంగా అభివృద్ధి చెందింది. దేశవ్యాప్తంగా కార్మిక, రైతు ఉద్యమాలు పెరగడంతో విప్లవానికి, ప్రతీఘాత విప్లవానికి నడుమ పోరాటం తీవ్ర స్థాయికి చేరింది.

అయితే ఈ కీలక సమయంలో విప్లవ విజయానికి ఎవరు నాయకత్వం వహించాలి? అనే మౌలిక సమస్యపై పార్టీలో తీవ్ర విభేదాలు వచ్చాయి. ఇంకాస్త సూటిగా చెప్పాలంటే విప్లవానికి కార్మిక వర్గం నాయకత్వం వహించాలా? లేక బూర్జువా వర్గం నాయకత్వం వహించాలా? అట్లాగే... కార్మిక వర్గానికి ప్రాథమిక నేస్తం రైతాంగమా? లేక బూర్జువా వర్గమా?

అనేకమంది కమ్యూనిస్టుల్లో ఈ సమస్య ఇంకా పరిష్కారం కాని స్థితి! చెన్ టు షీతో పాటు ఉన్న మితవాద అవకాశవాద ముఠా బూర్జువా ప్రజాతంత్ర విప్లవానికి బూర్జువా వర్గమే నాయకత్వం వహించాలని విప్లవ లక్ష్యం బూర్జువా రిపబ్లిక్‌ను స్థాపించడమే నని బూర్జువా వర్గం ఒక్కటే ప్రజాతంత్ర శక్తి అని వాదించారు.

మరొకవైపున అతివాద అవకాశవాదులు చాంగ్ కువో టావో నాయకత్వాన కేవలం కార్మికవర్గ ఉద్యమం మాత్రమే సాగాలని వాదించారు. ఈ అతివాద, మితవాదులు ఇరువురి నడుమ ఉన్న సామ్యం ఏమిటంటే ఇరువురు రైతాంగాన్ని వారి ఉద్యమాన్ని విస్మరించారు.

పార్టీలోని పై రెండు తప్పుడు ధోరణులను వ్యతిరేకించేందుకు కామ్రేడ్ మావో 1926 మార్చిలో "చైనా సమాజంలో వర్గ విశ్లేషణ" అనే వ్యాసం రాశారు. వలస-అర్ధ వలస దేశాలలోని జాతీయ విప్లవానికి సంబంధించిన లెనిన్ కలోనియల్ థీసిస్‌ను ప్రమాణంగా తీసుకుని ఈ విశ్లేషణ సాగుతుంది.

## చైనా సమాజంలో వర్గ విశ్లేషణ

సమాజంలోని వివిధ వర్గాల ఆర్థిక హోదాలను, రాజకీయ వైఖరులను విశ్లేషిస్తూ మొట్ట మొదటిసారిగా వెలువడిన శాస్త్రీయ పత్రమిది.

సామ్రాజ్యవాదంతో సంబంధం ఉన్న అందరూ యుద్ధ ప్రభువులు, ఉన్నతాధికారులు, దళారీలు, పెద్ద భూస్వాములు, వారందరిపై ఆధారపడిన ప్రగతి నిరోధక మేధావులు అందరూ చైనా ప్రజలకు శత్రువులు.

చైనాలో కార్మిక వర్గము, రైతాంగము, పెటీ బూర్జువా వర్గము, జాతీయ బూర్జువా వర్గమూ - వీరంతా విప్లవ వర్గాలు. కార్మిక వర్గానికి ఉన్న మహత్తర శక్తి వల్లను, బూర్జువా వర్గానికి ఉన్న తీవ్ర బలహీనత వల్లనూ, చైనా విప్లవ నాయకత్వం సహజంగానే కార్మిక వర్గం భుజాలపై పడింది. తక్కువ ఆర్థిక హోదా కలిగి ఉన్న ఫలితంగా విప్లవ పోరాటంలో అత్యంత సమరశీల శక్తిగా ఇటీవల కాలంలో జరిగిన అనేక పోరాటాలలో కార్మిక వర్గం నిరూపించుకుంది.,

గ్రామీణ జనాభాలో అత్యధికంగా ఉండేది పేద రైతులు, కౌలుదార్లు . "రైతు సమస్య అంటే సారాంశంలో వీరి సమస్యే"నని ఈ పత్రంలో మావో చెప్పాడు. విప్లవంలో రైతాంగం ముఖ్యపాత్ర నిర్వహించగల దని చెప్పడమేకాక కార్మిక వర్గానికి ఆధారపడదగిన మిత్ర వర్గంగా రైతాంగం ఉంటుందని మావో స్పష్టం చేశాడు. ఇంకొక మాటలో విప్లవానికి పునాది కార్మిక- కర్షక ఐక్యత అని చెప్పాడు.

పెటీ బూర్జువా వర్గం విప్లవోద్యమ ఉధృతిని బట్టి విప్లవ అనుకూలంగా వస్తుంది. అయితే జాతీయ బూర్జువా వర్గానికి విప్లవ లక్షణం ఉంది కానీ రాజీపడే లక్షణం కూడా ఉంది. ఈ ద్వంద్వ స్వభావానికి కారణం దానికి గల ఆర్థిక స్థితి! "విదేశీ పెట్టుబడి నుండి దెబ్బలు తిన్నప్పుడు, యుద్ధ ప్రభువుల అణచివేతకు గురైన ప్పుడు ... జాతీయ బూర్జువా వర్గం "విప్లవం అవసరం" అని భావిస్తుంది. సామ్రాజ్యవాదానికి యుద్ధ ప్రభువులకు వ్యతిరేకంగా విప్లవోద్యమానికి అనుకూలంగా ఉంటుంది" .

"దేశంలో కార్మిక వర్గం సమరశీలంగా విప్లవంలో పాల్గొంటున్నప్పుడు, అంతర్జాతీయ కార్మికవర్గం దేశీయ కార్మికవర్గానికి చురుకైన మద్దతు ఇస్తున్నప్పుడు, బడా బూర్జువా హోదా సంపాదించుకునేలా జాతీయ బూర్జువా వర్గం పెరుగుదామనే కోరికకు ప్రమాదం వాటిల్లినట్టుగా గుర్తిస్తుంది. అప్పుడు విప్లవం పట్ల సంశయాత్మకంగా తయారవుతుంది" అందువల్ల ఈ వర్గం గురించి పార్టీ అత్యంత జాగరూకతతో ఉండాలి.

జాతీయ బూర్జువా వర్గం అనివార్యంగా రెండు ధృవాలుగా చీలుతుందని అందులో ఒకటి విప్లవంలో చేరటంద్వారా వామపక్షంగా మారుతుందని, కార్మిక వర్గ నాయకత్వాన్ని గుర్తిస్తుందని, మరో పక్షం మితవాదులుగా మారి దళారి బూర్జువా వర్గాన్ని అనుసరిస్తూ ప్రతీఘాత విప్లవంలో చేరుతుందని కామ్రేడ్ మావో పై పత్రంలో స్పష్టం చేశారు.

అంతర్జాతీయ పరిస్థితులలో పెట్టుబడిదారి శక్తులకు విరుద్ధంగా సోషలిస్టు శక్తి ఆవిర్భవించి నప్పుడు లెనినిజం పతాకం కింద సామ్రాజ్యవాద వ్యతిరేక శిబిరంలో భాగం కావడం ద్వారా మాత్రమే చైనా విప్లవం విజయవంతం అవుతుందని కూడా చెప్పాడు. ఎందుకంటే నల్లమందు యుద్ధం మొదలుకొని చైనాలో జరిగిన విప్లవోద్యమాలన్నిటిని సామ్రాజ్యవాదులు అణచి వేశారు. వాటికి భిన్నంగా సోవియట్ యూనియన్ పీడిత ప్రజల పోరాటాలను ప్రోత్సహించింది. వాటికి మద్దతు తెలిపింది.

"చైనా సమాజంలో వర్గాల విశ్లేషణ" అనే వ్యాసం చైనాలో తొట్టతొలి స్పష్టమైన మార్క్సిస్టు-లెనినిస్టు డాక్యుమెంట్. అప్పటికి చైనా కమ్యూనిస్టు పార్టీలో ఉన్న అతివాద, మితవాద అవకాశవాద అభిప్రాయాలను ఈ వ్యాసం దృఢంగా వ్యతిరేకించింది. ప్రజాతంత్ర విప్లవ కాలంలో పార్టీ అనుసరించాల్సిన సాధారణ పంథాను , ప్రధాన కర్తవ్యాలను ఈ వ్యాసం వివరించింది.

కొమింటాంగ్ పార్టీలో మితవాద అభివృద్ధినిరోధక సిద్ధాంతవేత్తలు తయారయారు. వీరిలో టాయ్-చి-టావో ముఖ్యుడు. క్లుప్తంగానైనా ఈయన సిద్ధాంతాన్ని తెలుసుకోవడం భారత కమ్యూనిస్టులకు మంచిది.

1. వర్గ పోరాటాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించాడు. కార్మికుల ప్రయోజనాలను గౌరవించేలా చేయడానికి యజమానులలో దయ ప్రేమించే హృదయం ఉంటే చాలు. కార్మికులు వర్గ పోరాటం చెయ్యాల్సిన అవసరం లేదు. పెట్టుబడిదారుల ధార్మికత మీద ఆధారపడి ఉండొచ్చు.

2. రాజ్యము జాతి అనేవి అత్యున్నత రాజకీయ ప్రమాణాలు. యావత్ ప్రజానీకం దానికి లోబడి ఉండాలి.

3. కమ్యూనిస్టులు (1911 విప్లవం నాటి)మూడు ప్రజా సూత్రాలను మాత్రమే తమ రాజకీయ సిద్ధాంతంగా నమ్మాలి. కమ్యూనిజాన్ని కాదు. వారిని కొమింటాంగ్ పార్టీలో చేర్చుకోవడం తప్పు.

కొమింటాంగ్ పార్టీలోని మితవాదులను విప్లవ ప్రతీఘాతుక తిరుగుబాటుకు రెచ్చగొట్టే ఉద్దేశ్యంతో చేసిన స్పష్టమైన నిరంకుశత్వ పోకడలివి.

మన దేశంలోకి పాశ్చాత్య వలస వ్యాపార సైన్యాలు ప్రవేశించే నాటికి ఎన్ని విడి విడి రాజ్యాలుగా ఉండేదో చైనాలో కూడా అనేకమంది ఫ్యూడల్ యుద్ధ ప్రభువులతో నిండి ఉండేది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారి దేశమైన జపాను సమీపంలో ఉంటుంది కనుక చైనాలో జపాన్ జోక్యం బాగా ఎక్కువగా ఉండేది. ఇంకా బ్రిటిషు ఫ్రెంచి జర్మన్ ఇటాలియన్ రష్యాలేకాక అమెరికా వారి జోక్యం కూడా ఉండేది. వీరంతా యుద్ధ ప్రభువుల అండదండలతో తమ దోపిడీ పెత్తనం అధిపత్యంకై కలహించుకుంటూ, సహక రించుకుంటూ ఉండేవారు. వారికి వ్యతిరేకంగా పెల్లుబికినదే సన్ యెట్ సేన్ నాయకత్వాన జరిగిన 1911 నాటి జాతీయ విప్లవం. బోల్షివిక్ విప్లవ విజయానంతరం 1919లో జరిగిన మే 4 ఉద్యమంలో వామపక్ష శ్రేణులు కూడా చురుకుగా పాల్గొనడంతో దానికి నూతన ప్రజాస్వామిక విప్లస్వభావం ఏర్పడింది.

కమ్యూనిస్టుల సహకారంతో ఒక జాతీయ ప్రభుత్వం ఏర్పడి నిలదొక్కు గలిగింది. అందుకు కమ్యూనిస్టుల నాయకత్వాన సాగిన కార్మిక, రైతాంగ ఉద్యమాల వల్లనే ఒక మేరకైనా తొలినాటి జాతీయ ప్రభుత్వం రెండు రాష్ట్రాలలోనైనా నిలదొక్కుకో గలిగింది.

జపాను సహకారంతో ఉత్తర ప్రాంత యుద్ధ ప్రభువుల దురాగతాలను నిలువ రించడానికి కొమింగ్‌టాంగ్ జాతీయ ప్రభుత్వం ఉత్తర దండయాత్రలు నిర్వహించడంలో కూడా కమ్యూనిస్టులు చురుకైన పాత్ర నిర్వహించారు. అయితే జాతీయ విప్లవ నాయకత్వాన్ని చేబూనటానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం (చెన్ టు షీ) సిద్ధపడక పోవడంతో కొమింగ్ టాంగ్ పార్టీలోని మితవాద నాయకత్వం పైచేయి సాధించి కమ్యూనిస్టులపై దాడులకు పూనుకుంది. వాటిని తిప్పికొట్టి పైచేయి సాధించగలిగిన అవకాశం ఉండినప్పటికీ మితవాద నాయకత్వపు అవకాశవాద లొంగుబాటు విధానాలవల్ల ఘోరంగా నష్ట పోయింది. కొమింటాంగ్ పార్టీ నాయకత్వాన్ని చేజిక్కించుకున్న ఛాంగ్ కై షేక్ విప్లవ ప్రతీ ఘాతుక ముఠాల దాడులకు వేలాది కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రజలు హతులయి పోయారు. తమను తాము రక్షించుకోవడానికి నగరాలు, పట్టణాలు వీడి రైతాంగ ఉద్యమ ప్రాంతాలైన గ్రామాలకు చేరుకున్నారు.

*(ఇంకావుంది)* ✸

---

**(2వ పేజీ తరువాయి)**

ఉద్దీపనా చర్యలు పెట్టుబడిదారుల లాభాలకు ఉద్దీపనే తప్ప, ఉపాధి కల్పనకు ఉద్దీపన కాదు. చెడ్డ- మంచి బ్యాంకులను కలిపినా, వ్యవసాయం, చిన్నపరిశ్రమలు, చిన్న వ్యాపారాలకు రుణాలిచ్చే శక్తి వాటికి రాదు. ప్రజల కొనుగోలు శక్తి పెరగదు. సంక్షోభం పెరుగుతుంది.

పెట్టుబడి మదుపు క్షీణత-తత్పర్య వసానంగా తరిగిన ఉపాధి కల్పన ప్రజల కొనుగోలు శక్తిని క్షీణింపచేసాయి గనుక ప్రభుత్వ పెట్టుబడి వ్యయం పెంచటంద్వారా సరుకులను కొనుగోలు చేసే ప్రజల శక్తిని పెంచాలని కొందరు ఆర్థికవేత్తలు కోరు తున్నారు. ప్రభుత్వ పెట్టుబడి మదుపు ప్రజల కొనుగోలుశక్తిని పెంచబోదని గత పాతికేళ్ల అనుభవం తెలుపుతున్నది.

ప్రజల కొనుగోలు శక్తి పెరగాలంటే, ప్రజల విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రభుత్వ వ్యయం రెట్టింపు కావాలనీ, చౌకధరల దుకాణాలను దేశమంతటా విస్తరించాలనీ, పంటల ధరల నిర్ధారణా, సేకరణ సాగాలనీ ప్రముఖ ఆర్థికవేత్త అమియకుమార్ బాగ్చీ సూచించారు. ధనిక వర్గాలపై, కంపెనీలపై పన్నురేటును 25 నుండి 30 శాతానికి పెంచటం ద్వారా తగిన నిధులు చేకూరతాయని చెప్పారు. (జనతా 22-9-2019)

ఈ తక్షణ చర్యలు ప్రజలకు నిజమైన ఉపశమనాన్ని యిస్తాయి. ప్రభుత్వ పెట్టుబడి వ్యయం సరైన రంగాలలో జరిగితే మంచి ఫలితాలిస్తాయనే బాగ్చీగారి సూచన సరైనదే. అయితే ఇది శాశ్వత పరిష్కారం కాదు.

విదేశీ పెట్టుబడి, దోపిడీ, సామ్రాజ్యవాద ఆధిపత్యం తొలగినప్పుడే దేశ సంపద దేశ ప్రజలకు దక్కుతుంది. భూమిపై శ్రమించే వారికే భూమి హక్కు దఖలు పడినప్పుడే వారి ఆదాయం పెరిగి పారిశ్రామికాభివృద్ధికి దారితీస్తుంది. ఈ రెండు కర్తవ్యాలను నెరవేర్చ టానికి భారత పాలక వర్గాలు నిరాకరించాయి. పైగా ఆ ప్రతీపశక్తులకే సేవ చేస్తున్నాయి. కనుక వీరు సంక్షోభాన్ని కొనసాగించటమూ, భారాన్ని ప్రజలపై మోపటమే చేస్తారు తప్ప, పరిష్కరించలేరు. ✸

# కాశ్మీర్ ప్రజలపై జరుగుతున్న భీకరదాడిని వ్యతిరేకించండి, ఖండించండి!

**కాశ్మీరు** ప్రజలకు ఒకరితో ఒకరికి అలాగే మిగిలిన భారతదేశంతో సంబంధాలు తెగిపోయి నెలలు గడిచిపోతున్నాయి. భారత ప్రభుత్వం కాశ్మీరులో తాను తీసుకున్న చర్యల పర్యవసానాల వాస్తవ పరిస్థితులు బయటకు పొక్కకుండా వుండడానికి కావలసిన అన్ని చర్యలను తీసుకుంది. అయినా అడపాదడపా బయట ప్రపంచ దృష్టిలో పడ్తున్న సంఘటనల ఫలితంగా భారతప్రభుత్వం కాశ్మీర్ ప్రజల గొంతునులిమే విధంగా తీసుకుంటున్న అణచివేత చర్యలు వెలుగులోకి వస్తున్నాయి.

అన్నిరకాల సమాచార వ్యవస్థలు నిలిచిపోయాయి. కాశ్మీరు ప్రజల సాధారణ జీవితం నిషేధింపబడింది. 10 లక్షలకు పైగా సైనిక మరియు పారాసైనిక బలగాలు తమ ఆయుధాలను ప్రజల పైకి ఎక్కుపెట్టి అడుగడుగునా పహారా కాస్తున్నాయి. ప్రజలతో, రాజకీయ నాయకులతో, కార్యకర్తలతో జైళ్లు నిండాయి. రాజకీయ పార్టీల నాయకులకు, ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులకు, మీడియాకు కాశ్మీరు సందర్శించుటకు, అక్కడి ప్రజలతో మాట్లాడేందుకు అనుమతి లేదు. చివరకు కాశ్మీరుకు వెలుపల భారతదేశంలో నివసిస్తున్న కాశ్మీరీలు కాశ్మీరులోవున్న తమ బంధువుల, స్నేహితుల క్షేమ సమాచారాలను తెలుసుకునేందుకు కూడా వీలులేకుండా చేసింది. కాశ్మీరు ఒక యుద్ధభూమిగా, ఒక పెద్ద జైలుగా మార్చబడింది. ఇక్కడ నిరాయుధులైన అమాయక ప్రజలు పూర్తి సాయుధమైన రాజ్యాన్ని ఎదుర్కొంటున్నారు. భారత ప్రభుత్వం తమను ఎందుకు లక్ష్యంగా చేసుకుందో, దీనికి ముగింపు ఎప్పుడో కూడా తెలియని స్థితిలో ఇక్కడి ప్రజలు వున్నారు.

ఇది ఒక కుట్రపూరితమైన నిరంకుశ దాడి. 2019 ఆగస్టు 5వ తేదీన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంటులోని ఉభయసభల్లో కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు-2019ని, మరో రెండు తీర్మానాలను ప్రవేశపెట్టారు. వీటిద్వారా భారత రాజ్యాంగంలోని 370 మరియు 35-ఎ ఆర్టికల్ ద్వారా జమ్ముకాశ్మీర్‌కు లభించిన ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేయుటకు ప్రతిపాదించారు. 370 ఆర్టికల్‌నే ఉపయోగించి దానిని రద్దుచేశారు. జమ్ముకాశ్మీర్ రాష్ట్రాన్ని జమ్ముకాశ్మీర్ మరియు లడాఖ్‌లను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా స్థాయిని తగ్గించారు. తమ నిరసనను కొద్దిస్థాయిలో తెలియజేయడం తప్ప ప్రతిపక్షాలకు వేరే దారిలేకుండా చేశారు. పార్లమెంటులో ప్రభుత్వానికున్న సంఖ్యాబలంతో తన ప్రతిపాదనలకు ఎదురు లేకుండా నెగ్గించుకుంది.

కేంద్ర హోంశాఖ మంత్రితోబాటు ప్రభుత్వ ప్రతిపాదనల సమర్థకులు తమ చర్యలను సమర్థించుకుంటూ తమ తమ వాదనలు చేశారు. జమ్ముకాశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తిని యివ్వడమే జవహర్‌లాల్ నెహ్రూ, అతని ప్రభుత్వము చేసిన తప్పిదమని ఇంతకాలం ఆ స్వతంత్ర ప్రతిపత్తిని కొనసాగించడం మరింత పెద్దతప్పిదమనే వాదనలు ముందుకు తెచ్చారు. జమ్ముకాశ్మీర్ భారత యూనియన్‌లో అంతర్భాగం కావడానికి, దాని అభివృద్ధికి 370 ఆర్టికల్ మరియు 35-ఎ ఆర్టికల్ పెద్ద అవరోధాలుగా నిలిచాయని వాదించారు. కాశ్మీరులోని కొంతభాగం పాకిస్థాన్‌కు పోగొట్టుకొవడంలోగానీ, బేషరతుగా ఆనాడే జమ్ము కాశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేసుకోలేకపోవడంగానీ, జవహర్‌లాల్ నెహ్రూ యొక్క ఉదారవాద ఊగిసలాట విధానాల ఫలితమని వారు ఆరోపించారు. ఆ తర్వాతి కాలంలో భారతదేశం యిన్ని ఆటంకాలను ఎదుర్కోవాల్సి రావడానికి ఆనాడు జరిగిన ఘోరతప్పిదమే కారణమని, దానినే ప్రస్తుత ప్రభుత్వం సరిజేస్తుందనేది వారి వాదన. ఇదంతా కాశ్మీరు ప్రజల బాగుకోసమే చేస్తున్నామని భరోసా యిస్తున్నారు.

## దురహంకార జాతీయోన్మాద వైపరీత్యము

బిజెపి నాయకత్వం నిరసనకారుల, తమ వ్యతిరేకుల నోళ్ళు మూయించడానికి దురహంకార జాతీయోన్మాదాన్ని జనంపై విసిరింది. చాలామంది దీనికి లొంగిపోయారు. జాతీయ ప్రయోజనాలను రక్షించాల్సిన సందర్భంలో ధైర్యంగా నిర్ణయాత్మకంగా వ్యవహరించగల సత్తావున్న రాజకీయ నాయకత్వంగా బిజెపి మరియు దాని నాయకత్వం తనను తాను ప్రదర్శించుకుంది. పార్లమెంటులో బిల్లును, తీర్మానాలను ప్రవేశపెట్టే క్రమంలో పార్లమెంటు విధానాలను, ప్రజాస్వామిక ప్రమాణాలను ఉల్లంఘించడం, కాశ్మీరు ప్రజలను, రాజకీయ పార్టీలను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయకపోవడంలాంటి వైఫల్యాలను చాలా అప్రధాన విషయాలుగా కొట్టిపారేసింది. అంతేగాదు, చివరకు తన విమర్శకులను దేశద్రోహులుగా, పాకిస్థాన్ సమర్థకులుగా, మన శత్రువులకు, వ్యతిరేకులకు ఆనందం కలిగే విధంగా మనదేశ ఐక్యతను, మనదేశ నాయకత్వాన్ని వారు బలహీనపరుస్తూ ప్రమాదకరంగా వ్యవహరిస్తున్నారని చిత్రీకరించింది. ఇది ప్రపంచంలోని దోపిడీ పాలకవర్గాలు, వాటి ప్రభుత్వాలు విస్తృతంగా ప్రోత్సహిస్తున్న వికృత జాతీయవాదం. బిజెపి పాలకవర్గం ఈ వికృత జాతీయవాదాన్ని తన విమర్శకులపై, ప్రజలపై చాలా దూకుడుగా ఉపయోగిస్తుంది.

## అన్ని వాగ్దానాలను గాలికొదిలేసింది

భారత ప్రభుత్వం కాశ్మీరు ప్రజలకిచ్చిన వాగ్దానాలు, ఆ ప్రజల జాతీయ ఆకాంక్షలు, ఆశల కనుగుణంగా వారి భవిష్యత్తును అంతిమంగా నిర్ణయించే విషయంలో యిచ్చిన హామీలు, ప్రస్తుత భారత ప్రభుత్వం, బిజెపి నాయకుల దృష్టిలో పట్టించుకోదగ్గ విషయాలే కాకుండాపోయాయి. భారత పాలకవర్గాలకు తమ ప్రయోజనాలే అత్యంత ముఖ్యమైనవి కాబట్టి వీటిని పక్కన పెడుతూ పట్టించుకోకుండా వదిలేయగలుగుతున్నారు. హేతుబద్ధతను వదిలేసి సంఖ్యాబలం ఆధారంగా మాత్రమే ఒక బాధ్యతారహిత ప్రభుత్వం ఇలాంటి రాజకీయ వైఖరితో, తర్కాన్ని చేస్తూ తన మాటే శాసనం లాగా వ్యవహరించగలదు. ఒక దేశ పాలకుల పట్ల వుండాల్సిన విశ్వసనీయత కొరవడుతుంది. అంతేకాకుండా కాశ్మీరు ప్రజలను మరింత ఒంటరివాళ్ళను చేస్తూ ఆ సమస్య తీవ్రతను పెంచుతోంది.

## కాంగ్రెస్ పార్టీ వాదన

కాశ్మీర్‌పై పార్లమెంటులోని చాలా రాజకీయపార్టీలు జమ్ముకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ

బిల్లును మరియు తీర్మానాలను పార్లమెంటులో ప్రవేశపెట్టిన తీరును, తనకున్న మొరటు సంఖ్యాబలంతో వాటిని పార్లమెంటులో ఆమోదింపజేసుకున్న విధానాన్ని విమర్శించాయి. ఈ రాజకీయ పార్టీలన్నీ జమ్ముకాశ్మీర్‌ను విభజించడాన్ని, దాని స్థాయిని కేంద్రపాలిత ప్రాంతంగా దిగజార్చడాన్ని వ్యతిరేకించాయి.

అదే సందర్భంలో కాంగ్రెస్ పార్టీయొక్క రాజకీయ స్థితి, కాశ్మీర్ విషయంలో కాంగ్రెస్ విధానాలను అది సమర్ధించుకున్న తీరు ప్రత్యేకంగా గమనించదగ్గవి.

దశాబ్దాల పాటు సాగిన కాంగ్రెస్ పరిపాలనలో నాటి కాంగ్రెస్ నాయకుల పాత్ర గురించి కాశ్మీరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గులాంనబీ ఆజాద్ ఉద్వేగంతో, కోపంతో తన వివరణను వెళ్ళగక్కాడు. ఆయన వివరణల సారాంశం ఇలా వుంది: ఆనాడు కాశ్మీర్‌లో నెలకొన్న తీవ్ర సంక్లిష్ట చారిత్రక పరిస్థితులలో కాశ్మీరు సమస్యను జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ వివేకవంతంగా, ఆచరణాత్మకంగా, సమర్ధ వంతంగా పరిష్కారానికి కృషి చెయ్యడంవల్లనే భారతప్రభుత్వం మరియు కాశ్మీరు మహారాజు హరిసింగ్‌ల మధ్య విలీన ప్రకటన ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం భారత ప్రభుత్వ అధికారాలను రక్షణ, విదేశీ వ్యవహారాలు, కరెన్సీ మరియు కమ్యూనికేషన్ అంశాలకే పరిమితం చేస్తూ భారతదేశంలో జమ్ముకాశ్మీర్ విలీనం జరిగింది. ఆనాటి చారిత్రక పరిస్థితుల మధ్య అది మాత్రమే సాధ్యపడే చర్య. ఇది భారతదేశం సాధించిన గొప్ప విజయంగా ఆనాడు చెప్పబడింది. రాజ్యాంగంలో 370 మరియు 35-ఎ ఆర్టికళ్ళను పొందుపరచడం, భారత ప్రభుత్వం యిచ్చిన యితర హామీలు విలీన ప్రకటన అనంతరం ఒప్పందం అమలు దిశగా జరిగిన చర్యలే. అంతేకాదు ఆ తర్వాత కాంగ్రెస్ పాలనలో తీసుకున్న చర్యలు కాశ్మీరును భారతదేశంలో మరింత విలీనం చేసే దిశగా జరిగినవే. ఈ గొప్పతనం అంతా కాంగ్రెసుకు, షేక్ అబ్దుల్లాకు, కాశ్మీరు ప్రజలకే చెందుతుంది. ఎందుకంటే వారంతా ఆనాటి చర్యలకు తమ మద్దతును, అంగీకారాన్ని తెలిపారు.

## బయటకు రాని విషయాలు

ఇక్కడ ఈ కాంగ్రెస్ నాయకుడు కొన్ని చారిత్రక వాస్తవాలను మాత్రమే ప్రస్తావిస్తూ విలీన ప్రకటన స్ఫూర్తికి విఘాతం కలిగించేవిధంగా కేంద్రంలో కాంగ్రెస్ పాలనలో జరిగిన కీలక విషయాలను తెలివిగా దాటవేస్తూ మాట్లాడాడు. కాశ్మీరు ప్రజలకు కాంగ్రెస్ స్వయంగా చేసిన వాగ్దానాలు, యిచ్చిన హామీలను గురించి ప్రస్తావించలేదు. కాశ్మీరు స్వతంత్ర ప్రతిపత్తిని నిర్వీర్యం చేయడానికి అనుసరించిన తప్పుడు పద్ధతులను, భారత పాలకవర్గాల ప్రయోజనాల కత్యంత అనుగుణంగా కాశ్మీరు ప్రజల మెడలు వంచి ఒప్పందాలను అంగీకరింపచేసు కోవడంలో అనుసరించిన మోసపూరిత విధానాలు, ఒత్తిళ్ళు, అణచివేతల గురించి ఈయన మాట్లాడలేదు.

ఈ కాలానికి సంబంధించిన కొన్ని వాస్తవాలకి విలీన ప్రకటనపై సంతకాలు జరిగే నాటికి వున్న చారిత్రక పరిస్థితులు ప్రత్యేకమైనవి. మొదట్లో మహారాజు హరిసింగ్‌కు కాశ్మీరును ఇండియాలోగానీ, పాకిస్తాన్‌లోగానీ విలీనం చెయ్యాలనే ఉద్దేశ్యం లేదు. కాని ఆనాడు హరిసింగ్ తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నాడు. ఒకవైపు షేక్ అబ్దుల్లా నాయకత్వంలో మౌలిక భూసంస్కరణలను, ప్రజాస్వామిక మార్పులను కోరుతూ భూస్వామ్య వ్యతిరేక రైతాంగ పోరాటం జరిగింది. ఆ ఉద్యమం ముందుకు సాగివుంటే జమ్ముకాశ్మీర్ భూస్వామ్య పాలన బంధనాల నుండి స్వేచ్ఛను పొంది, స్వతంత్ర, ప్రజాస్వామిక కాశ్మీరుగా అవతరించి వుండేది. మరోవైపు పాకిస్థాన్ పాలకులకు జమ్ముకాశ్మీర్‌ను పాకిస్థాన్‌లో విలీనం చేసుకోవాలని వుండేది. అందుకోసం పాకిస్థాన్ కాశ్మీరులోకి తన సాయుధ దళాలను పంపి కాశ్మీరులోని కొన్ని ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటూ వుంది. ఈ పరిస్థితుల మధ్య మహారాజు హరిసింగ్ నిలబడగలిగే పరిస్థితి లేదు. బయట సహాయంయొక్క అవసరం వుంది. ఈ పరిస్థితులను భారత ప్రభుత్వం పూర్తిగా వినియోగించుకొని భారత దేశంలో విలీన ప్రకటనపై సంతకం చెయ్యాల్సిన పరిస్థితులను మహారాజు హరిసింగ్ చుట్టూ కల్పించింది. 1947 సం॥ అక్టోబర్ 27వ తేదీన పాకిస్థాన్ చొరబాటులపై భారత సాయుధ దళాల చర్య ప్రారంభమైంది. ఈ చర్యలు పాకిస్థాన్ దాడిచేసి ఆక్రమించుకున్న జమ్ముకాశ్మీర్‌లోని ప్రాంతాలలో జరిగాయి. ఈ సాయుధచర్యలు ఇండియా పాకిస్థాన్‌ల మధ్య చిన్న యుద్ధంగా మారి 1948 జనవరిలో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంతో ముగిశాయి. పాకిస్థాన్ ఇండియాల మధ్య సాయుధ ఘర్షణలు ప్రారంభమైనప్పుడు సైన్యాన్ని నడిపిన వారు బ్రిటీషు సైనికాధికారులే అన్న విషయం గమనార్హం, ఆసక్తిదాయకం. వలసదేశాల మధ్య వివాదాలు రాజేసి వాటిని ఆరనీయకుండా కొనసాగేట్లు చేసే సామ్రాజ్యవాద విధానానికి యిదొక మచ్చుతునక. ఆవిధంగా జమ్ముకాశ్మీర్ మొదటి విభజన, ప్రజల అంగీకారం లేకుండా పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ మరియు షరతులతో భారతదేశంలో విలీనం సంభవించింది.

## కాశ్మీర్‌కిచ్చిన స్వతంత్ర ప్రతిపత్తి మరియు హామీలు

భారత ప్రభుత్వం, అలాగే జవహర్‌లాల్ నెహ్రూ ఐక్యరాజ్యసమితిలోనూ, భారతదేశంలో బహిరంగంగానూ విలీన ప్రకటనయొక్క స్ఫూర్తిని పూర్తిగా గౌరవిస్తామని, జమ్ముకాశ్మీర్ భవిష్యత్తును ప్రజాస్వామ్యయుతంగా ప్లెబిసైట్ ద్వారా కాశ్మీరు ప్రజల అభీష్టాని కనుగుణంగా నిర్ణయిస్తామని హామీ యిచ్చారు. భారత ప్రభుత్వం యిచ్చిన హామీ మేరకు 1949 అక్టోబర్ 17న ఆర్టికల్ 370ను ఆనాటి భారత రాజ్యాంగ ముసాయిదాలో జేర్చారు. దీనిప్రకారం కాశ్మీరుకు ప్రత్యేక హోదా, రాజ్యాంగ నిర్మాణ సభ, స్వంత జెండా మొదలైనవి లభించాయి. అలాగే షేక్ అబ్దుల్లా కాశ్మీరు ప్రధానమంత్రి అయ్యారు. ఇది జమ్ముకాశ్మీర్ తొలి చరిత్రలోని ఒక అంకం.

## ఒప్పంద స్ఫూర్తికి విరుద్ధమైన ఆచరణ

కాని 1953లో కాశ్మీర్ చరిత్రలో మరో అంకం మొదలైంది. కాశ్మీర్‌ను భారత్‌లో మరింతగా విలీనం చేయడానికి ప్రతిపాదించిన చర్యలు తీసుకోవడానికి అడ్డంకిగా వున్నాడని 1953 ఆగస్టులో షేక్ అబ్దుల్లాను ప్రధానమంత్రి పదవినుండి భారతప్రభుత్వం ఆకారణంగా తొలగించింది. అతని స్థానంలో భారతీయ పాలకవర్గాలకు విధేయుడిగా వుండే నేషనల్ కాన్ఫరెన్స్‌ను విడిచివెళ్ళిన బక్షి గులాంను వుంచింది. ఆ తర్వాత ప్రత్యేక రాజ్యాంగ నిర్మాణ సభ, ప్రత్యేక రాజ్యాంగం, ప్రత్యేక ప్రధానమంత్రి వాటికి వరుసగా ముగింపు పలకడానికి చర్యలు ప్రారంభమయ్యాయి. ప్లెబిసైట్ దళాన్ని కాశ్మీర్‌లో నిషేధించారు. షేక్ అబ్దుల్లాను అరెస్టుచేసి కుట్రకేసులో యిరికించారు. ఆరేళ్ళ తర్వాత ఆయనపై కేసు ఎత్తివేసినా 1964 వరకు నిర్బంధంలోనే వుంచారు. తిరిగి 1965 నుండి 1974 వరకు గృహనిర్బంధంలో వుంచారు. ఈ సమయాన్ని భారత ప్రభుత్వం వినియోగించుకొని కాశ్మీరులో తాను కోరుకున్న మార్పులను తెస్తూ తద్వారా షేక్ అబ్దుల్లాపై ఒత్తిడి తెచ్చి, చర్చలు జరిపి భారతప్రభుత్వంతో సయోధ్య వచ్చేట్లు చేసింది. జమ్ముకాశ్మీర్ ప్రత్యేక హోదాను బలహీనపరచడానికి ఉద్దేశించిన కొన్ని అంశాలపై రాజీకి వచ్చిన తర్వాతనే షేక్ అబ్దుల్లా

విడుదల సాధ్యమైంది. 1975లో షేక్ అబ్దుల్లా అధికారంలోకి తిరిగి వచ్చిన తర్వాత కూడా ఆర్టికల్ 370ని నిర్వీర్యం చేసే ప్రక్రియ కొనసాగింది. కాశ్మీరుయొక్క చరిత్రలోని ఈ విచారకరమైన విషాదాంత భాగాన్ని కాశ్మీరులో కాంగ్రెస్ పాత్ర గురించి పార్లమెంటులో గొప్పగా ప్రసంగించినప్పుడు గులాంనబీ ఆజాద్ దాచి పెట్టాడు.

కథ యింతటితో ముగియలేదు. 1953 నుండి 2014 మధ్యకాలం కాశ్మీరు ప్రజలకు రక్తసిక్తంగా, మొత్తం కాశ్మీరులోయను ప్రత్యేక అధికారాలు(ఎఎఫ్ఎస్‌పిఎ) యిచ్చిన మిలటరీ, పారామిలటరీ దళాలతో నింపింది. 144 సెక్షన్ విధింపు, కర్ఫ్యూలు, నిషేధాలు, దిగ్బంధాలు, నిరసన ప్రదర్శనలు జరిగినపుడు రోజులతరబడి జైళ్ళలో నిర్బంధించడం, విస్తృత ప్రాంతాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించడం, అపరిమిత కాలంపాటు కల్లోలిత ప్రాంతాలుగా కొన సాగించడం, అమాయక యువతను తీవ్ర వాదులుగానో, అనుమానిత తీవ్రవాదులుగానో ముద్రవేయడం, వారిని అదృశ్యంచెయ్యడం, ప్రజలను ఎన్‌కౌంటర్ చేయడం, పోలీసుల అకృత్యాలకు, అన్యాయాలకు వ్యతిరేకంగా చివరకు పోలీసు కాల్పుల్లో మరణించిన తమదగ్గరి బంధువుల మృతదేహాల అప్పగింతకు వీధుల్లోకొచ్చి నిరసనలు తెలిపే ప్రజలు, దీర్ఘకాలికంగా జరిగే జనసమూహాల నిరసనలు, వీటిలో ధైర్యంగా, ధిక్కారస్వరంతో ఈ నిరసనల్లో పాల్గొనడమనేది కాశ్మీరు ప్రజల సాధారణ లక్షణంగా మారింది.

కాశ్మీరు ప్రజలు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వ పాలనలో వున్నారనీ, కాశ్మీరులో సాధారణ, ప్రజాస్వామిక, శాంతియుత జీవన పరిస్థితులు నెలకొన్నాయని ప్రపంచానికి చాటిచెప్పడానికి భారతప్రభుత్వం ప్రజాస్వామ్య ఎన్నికలు అనే నాటకాన్ని రచించింది. రిగ్గింగులు, ప్రభుత్వాలను పడగొట్టడం, రాష్ట్రపతి పాలన, సంకీర్ణ ప్రభుత్వాలు లాంటి అన్నిటినీ ఉపయోగించుకొని కాశ్మీరుకు ప్రజాస్వామిక పరిపాలనా వ్యవస్థను యివ్వడానికి భారత ప్రభుత్వం యత్నించింది.

ఒకవైపు కాంగ్రెస్ పాలన ఆర్టికల్ 370ను నిర్వీర్యంచేసి దానిని ఖాళీ గుల్లలా మార్చాలనే ఉద్దేశ్యంతో సాగింది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగంలో ఆర్టికల్ 370ను ఆర్టికల్ 35-ఎలను కొనసాగించడానికి నిబద్ధతతో వుందని కాశ్మీరు ప్రజలను భ్రమల్లో వుంచింది. అలాగే అది ప్రజలతో చర్చల నాటకాన్ని ముందుకు తెచ్చింది. ఏమైతేనేం, ఈ చర్చలు యితర వ్యూహాలద్వారా కాశ్మీరు ప్రజలకు బేషరతుగా భారతదేశంలో విలీన మవడం, తమ జాతీయ ఆకాంక్షలు, హక్కులు గురించి పూర్తిగా మర్చిపోవడంతప్ప వేరే ప్రత్యామ్నాయం లేదనే సందేశాన్ని పంపింది.

పాకిస్థాన్ పాలకులు వారివైపు నుండి కాశ్మీరు అంశం భారత పాకిస్థాన్‌ల మధ్య వివాదంగా బహిరంగపరచడానికి తమ శాయశక్తులా కృషిచేస్తున్నారు. కాశ్మీరు ప్రజల కొరకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకునే కాశ్మీరులోని కొన్ని రాజకీయశక్తులు కూడా ఈ అభిప్రాయంలోనే వున్నాయి. పాకిస్థాన్ పాలకులు కాశ్మీరు ప్రజలపట్ల సానుభూతిని చూపేందుకు మిలిటెంట్లను పెంచిపోషించడం, కాశ్మీరు సమస్యను వివిధ సందర్భాలలో అజెండాలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. వీటిద్వారా పాకిస్థాన్ కాశ్మీరు సమస్యతో పాకిస్థాన్‌కు కూడా సంబంధముందనీ, దాని సహకారం, అంగీకారం లేకుండా అది పరిష్కారంకాలేదని భారత ప్రభుత్వానికి గుర్తుచేస్తుంది. దీనివల్ల భారత పాలకులకు కూడా తమ అవసరార్థం పాకిస్థాన్ బూచిని ఒక సాధనంగా మలుచుకుంది. కాశ్మీరు ప్రజల న్యాయమైన జాతీయ ప్రజాస్వామిక ఆకాంక్షలను తిరస్కరిస్తూ కాశ్మీరు సమస్యను పాకిస్థాన్ సృష్టించింది అనే రంగును అద్ది భారత పాలకులు చూపిస్తున్నారు.

సామ్రాజ్యవాదులు ఏనాడూ కాశ్మీరు ప్రజల ఆకాంక్షలను, హక్కులను గౌరవించలేదు. అయినా కాశ్మీరు ప్రజల కొరకు కన్నీరు కారుస్తారు. ఇది కూడా కాశ్మీరు సమస్యను భారత, పాకిస్థాన్‌ల మధ్య వివాదంగా చూపెడతారు. ఇద్దరిమధ్య వున్న ఈ సంక్షోభాన్ని కూడా సొమ్ము చేసుకుంటానికి చూస్తారు. ఇటీవల అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ కాశ్మీరు సమస్యలో మధ్యవర్తులుగా, న్యాయమూర్తులుగా వ్యవహరించడానికి చేసిన ప్రయత్నం దీనిలో భాగమే.

కాశ్మీరు విషయంలో కాంగ్రెస్ పోషించిన పాత్రను దాని స్వంత విధానాలను సమర్థించు కుంటూ బిజెపిపై కాంగ్రెస్ చేసిన విమర్శల స్వభావంలో మౌలికంగానే బలహీనతలున్నాయి. 370 మరియు 35-ఎ ఆర్టికళ్ళ రద్దుపై బిజెపి ప్రభుత్వంపై చేసిన విమర్శలో పసలేదు. ఎందుకంటే ప్రధాన అంశమైన కాశ్మీరుకు ప్రత్యేక హోదా విషయంలో వారు చేసిన హామీలు, వాగ్దానాలపట్ల వారి ప్రస్తుత వైఖరి ఏమిటో, కాశ్మీరు ప్రజలకు వారు ఎలా న్యాయం చేయదలుచుకుంటున్నారో వివరించలేదు. పైగా వారు దేశ ప్రయోజనాలను కాపాడటంలో కాశ్మీర్ విషయంలో పాకిస్థాన్ జోక్యాన్ని వ్యతిరేకించడంలో బిజెపి ప్రభుత్వానికి అండగా నిలబడతామని పదేపదే ప్రకటించడం ద్వారా బిజెపి పన్నిన ప్రచార ఉచ్చులో కాంగ్రెస్ చిక్కుకుంది. సాధారణ ప్రజలు, ప్రజాస్వామికశక్తులు ఈ వైఖరిని కాశ్మీరు ప్రజలకు వ్యతిరేకంగా భారత పాలకవర్గాలు ఒకరికొకరు సౌహార్ద్రతను, ఐక్యతను ప్రదర్శించుకోవడంగానే చూశారు.

బిజెపి చర్య దుర్మార్గమైనది. కుట్రపూరిత మైనది. ఇది ప్రజలకు వెన్నుపోటు పొడిచింది. ఇది కాశ్మీరు ప్రజలకు దుష్ప్రభావాలను కొని తెచ్చింది. కాశ్మీరు ప్రజలు గత ఏడు దశాబ్దాలుగా అనేక దుర్మార్గాలను చవిచూశారు. అయినా వారికి ఏ మూలనో ఒక ఆశ వుంది. ఏదో ఒకనాటికి భారత పాలకులకు వివేచన కలుగుతుందనీ, అది తమ బతుకులకు ఒక మేలిమలుపు యిస్తుందనే భ్రమ వుంది. కాని ప్రస్తుత బిజెపి చర్య వారికి వినాశకరమైన శిక్షను విధించింది. అవిభక్త కాశ్మీరు ప్రజలకు ఒక విలక్షణమైన ఆర్థికవ్యవస్థ, సంస్కృతి, భాష, జీవన విధానాలున్నాయి. సమ్మిళిత జాతికి వుండాల్సిన మంచి లక్షణాలు ఆ ప్రజల స్వంతం. కాశ్మీరు ప్రజలను హిందూ ముస్లిం విభజన కళ్ళద్దాల గుండా చూడడం ఆ ప్రజలపట్ల అవమానకరమైన, అన్యాయమైన చర్య అవుతుంది. మౌలిక భూసంస్కరణలు, ప్రజాస్వామిక వ్యవస్థకొరకు భూస్వామ్య రాజ్యానికి వ్యతిరేకంగా సుదీర్ఘంగా జరిగిన పోరాటంలో కాశ్మీరు ప్రజల్లో జాతీయ ఆకాంక్షలు, ప్రజాస్వామిక లక్షణాలు వెల్లివిరిశాయి. ఇక్కడ వివిధ విశ్వాసాలున్న ముస్లిములు, హిందువులు, సిక్కులు, సూఫీలు లాంటి ప్రజలు సహజీవనం, ఐక్యత, పరస్పర గౌరవం మరియు సౌభ్రాతృత్వములతో కూడిన జీవనానికి మంచి ఉదాహరణగా నిలిచారు. ఈ ప్రజలు సమైక్య కృషితో ఒక ఉమ్మడి, లౌకిక, సమ్మిళిత సంస్కృతిని పెంపొందించుకొని దానిని 'కాశ్మీరియత్'గా చెప్పుకోవడానికి గర్విస్తారు. వారు డోగ్రా రాజు హరిసింగ్ పాలనలో దుర్మార్గమైన దాడులు, మూకుమ్మడి హత్యలతో బాధపడ్డారు. వారు పాకిస్థాన్, మరియు మతతత్వశక్తులు కలిగించిన ఒత్తిడిని, రెచ్చగొట్టే విధానాలను, ఇండియా పాకిస్థాన్‌ల మధ్య జరిగిన రెండు వినాశకరమైన యుద్ధాలను తట్టుకొని నిలబడ్డారు. బిజెపి తొలి అవతారాలు, సంఘ్‌పరివార్‌శక్తులు వీరిలో మతతత్వాన్ని ప్రవేశపెట్టి సామాజికంగా విభజించడానికి చాలా విఫలయత్నం చేశారు.

ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం ఒక పెద్దగొడ్డలితో జమ్ముకాశ్మీర్‌ను భౌతికంగా రెండు ముక్కలుగా నరికిన చర్య అత్యంత పెద్ద కఠోరమైన తిరోగమన చర్య. ఇది యిన్నాళ్ళు కాశ్మీరు ప్రజలు తమ రక్తాన్ని, స్వేదాన్ని చిందించి పెంపొందించుకున్న ఆరోగ్యకరమైన జాతీయ లక్షణాలను సర్వనాశనం చేసే గొడ్డలిపెట్టులాంటి చర్య.

బిజెపి మరియు దాని సంఘ్‌పరివార్ కాశ్మీర్ ప్రజలను విభజించడానికి చాలా చేసింది. గత ఆరు సంవత్సరాలలో కాశ్మీరు ప్రజల (2016) న్యాయమైన పోరాటాన్ని అణచి వేయటకు రక్తాన్ని పారించింది. అయినప్పటికీ వారు కాశ్మీరు ప్రజల సంకల్పాన్ని, ఐక్యతను దెబ్బతీయడంతో విఫలమయ్యారు. ఇప్పుడు జమ్ముకాశ్మీర్‌ను భౌతికంగా రెండు ముక్కలుగా నరికి వాటిని రాష్ట్రస్థాయికంటే హీనంగా కేంద్రపాలిత ప్రాంతాలుగా చేశారు. ఈవిధంగా చేయడంద్వారా మతతత్వాన్ని రెచ్చగొట్టి విభజించే నీచరాజకీయాలను ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వర్తించవచ్చునీ, మెరుగైన రాజకీయ భవిష్యత్తుకోసం కాశ్మీరు ప్రజలు సాగిస్తున్న పోరాటపు వెన్నెముకను విరిచెయ్యవచ్చని బిజెపి ఆశపడ్తున్నట్లు కన్పిస్తుంది.

కాశ్మీరు ప్రజలపై బిజెపి చేసిన దాడి భారతదేశంలోని యితర ప్రజలకు కూడా ప్రమాదకరమైన సంకేతాలు పంపింది. ఈశాన్య భారతంలోని ప్రజలు వారి పరిణామం, అభివృద్ధికి సంబంధించిన చారిత్రక నేపథ్యంవల్ల భారతదేశంలో విలీనమయ్యే ప్రక్రియలో ఇంకా విశ్వాసం పొందే క్రమంలోనే వున్నారు. ఇక్కడున్న కొన్ని రాజకీయ ముఠాలు భారతదేశంతో జరుపుతున్న చర్చలు, పోరాటాలు వివిధ స్థాయిల్లో వున్నాయి. ప్రస్తుత కాశ్మీరు పరిణామం వీరికి పెద్ద షాక్. ప్రత్యేక హోదాలు పొందిన రాష్ట్రాలు భారత ప్రభుత్వం తమపై ఎప్పుడు వేటువేస్తుందోనని భయపడ్తున్నాయి. కేంద్రంలో అధికార కేంద్రీకరణ ఫలితంగా మున్సిపాల్టీల స్థాయికి దిగజార్చబడిన రాష్ట్రాలు బిజెపి అమ్ముల పొదిలో తమకోసం ఏమి దాచివుంచిందోనని భయపడ్తున్నాయి. ప్రతిపక్షాలను విచ్ఛిన్నం చేయడంలో, నయానో భయానో వివిధ రాష్ట్రాల్లో అధికారం కైంకర్యం చేసుకోవడంలో, ఫెడరల్ నిర్మాణాన్ని అపహాస్యం చేయటంలో బిజెపి అనుసరిస్తున్న ఉన్మాదపూరిత పద్ధతులను చూసి కాశ్మీరు అనంతర పరిణామాలు ఎలా వుంటాయోనని ఈ రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. బిజెపికున్న హిందూత్వ దాహం, అది జెప్తున్న ఒకే దేశం, ఒకే సంస్కృతి, ఒకే మతం, ఒకే భాష లాంటి విధానాలు భారతదేశానికున్న భిన్నత్వ భావన, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదం, ఉమ్మడి ఆకాంక్షలు కృషి ఆధారంగా వివిధ జాతులు ఒక పుష్ప గుచ్ఛంలా కలిసి వుండి అభివృద్ధివైపు పయనించే స్వభావానికి గొడ్డలిపెట్టులా తయారయ్యాయి. అందువల్ల కాశ్మీరు ప్రజలపై దాడి అంటే దోపిడీకి, అణచివేతకు గురవుతున్న మొత్తం భారతప్రజలపై దాడి తప్ప వేరు కాదు.

బిజెపి చేస్తున్న చర్యలు, పెడ్తున్న ప్రతిపాదనలు చేదుమాత్రలనడంలో సందేహం లేదు. కాని కాశ్మీరు ప్రజల ఉపాధికి, పెట్టుబడులకు, సమగ్ర అభివృద్ధికొరకే కాశ్మీరు తలుపులు తెరుస్తున్నామని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే. సామ్రాజ్యవాదానికి లొంగుబాటు విధానాలు మరియు దోపిడీ విధానాల ద్వారా భారత పాలకులు దేశాన్ని తిరిగి కోలుకోలేని స్థాయికి నెట్టివేశాయి. నిరుద్యోగిత యింతకు ముందెన్నడూ లేనంత స్థాయికి ఈ పాలకులు తీసుకెళ్ళారు. వీరంతా సహజ వనరులను, ప్రభుత్వరంగ పరిశ్రమలను, సేవారంగ సంస్థలను, మానవవనరులను విదేశీ మరియు కార్పోరేట్ దోపిడీదార్లకు తాకట్టు పెట్టడమో, తెగనమ్మడమో చేస్తున్నారు. దీని పర్యవసానంగా ఏర్పడే ఆర్థిక భారాన్ని ప్రజల నెత్తిన రుద్దుతున్నారు. ప్రజలను ఈ స్థితిలో వుంచి కాశ్మీరు ప్రజలకు మెరుగైన భవిష్యత్తును యిస్తామని చెప్పడం ప్రజలను వంచించడమే అవుతుంది. గత ఏడు దశాబ్దాలలో కాశ్మీరు ప్రజలను అభివృద్ధిచేయడానికి ఎవరూ అడ్డు పడలేదు. ఇప్పుడు బిజెపి కాశ్మీరు ప్రజలను చీకట్లోకి నెట్టి, భారీ గొలుసులతో కాళ్ళు చేతులు కట్టిపడేసి గొప్ప విందును యిస్తామని భ్రమింప జేయడం చాల ఆశ్చర్యకరమైన విషయం. ఇది కాశ్మీరు ప్రజల జీవితాలతో, భావోద్వేగాలతో ఆడుకోవడం తప్ప వేరు కాదు. బిజెపి పాలకుల నుండి వారు కాశ్మీరును విదేశీ మరియు కార్పోరేట్ దోపిడీకి తలుపులు బార్లా తెరవడం, వారి మతతత్వ ఎజెండాను ముందుకు తీయడం తప్ప యితరత్రా ప్రజోపయోగ కార్యక్రమాలను ఆశించలేము.

భారత పాలకులు కాశ్మీరు ప్రజలపై ఉక్కుపాదం మోపి కొంతకాలంపాటు వారి నోరు మూయించవచ్చు. కాని బలప్రయోగం ద్వారానో, కుతంత్రాలద్వారాలో ఆ ప్రజలను జయించలేరు. కాశ్మీరు ప్రజలు దారుణమైన పరిస్థితులను చవిచూశారు. ప్రస్తుత క్లిష్టపరిస్థితుల నుండి కూడా వారు బయటపడగలరు. వారి కాళ్ళమీద వారు నిలబడి తమ పోరాటాన్ని కొనసాగించే మార్గాలను అన్వేషించుకోగలరు.

ఈ క్రింది డిమాండ్ల సాధన అత్యవసరం

1. కాశ్మీరు ప్రజలకు అన్నిరకాల స్వేచ్ఛలను, వారి హక్కులను పునరుద్ధరించాలి.
2. కాశ్మీరు లోపల, బయట ప్రపంచంతో అన్నిరకాల సమాచార వ్యవస్థలను పునరుద్ధరించాలి.
3. నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజా సంఘాలు, మీడియాను ఎలాంటి ఆటంకాలు లేకుండా వారి కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అనుమతించాలి.
4. కాశ్మీరు సమస్యపై ఆమోదయోగ్యమైన, శాశ్వతమైన పరిష్కారం కనుగొనేందుకు కాశ్మీరు ప్రజలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చేందుకు, తమ ఫిర్యాదులను పూర్తిస్థాయిలో, స్వేచ్ఛగా ప్రపంచదృష్టికి తెలియజేసేందుకు, తెచ్చేందుకు వారిని తప్పక అనుమతించాలి. ✶





## 'అనంత' కరువుకు అంతమెప్పుడు?

పేజీలు : 40

వెల : రూ. 10/-

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ప్రచురణ

కాపీలకు : **మైత్రీబుక్‌హౌస్**, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

# కొనసాగుతున్న కుల వివక్షా దురాచారం

**నిమ్న** కులాలుగా చూడబడుతున్న ప్రజలపై చూపుతున్న వివక్ష తొలగాలని, సామాజిక సమానత్వం కావాలని ప్రముఖ సంస్కరణవాది, హేతువాది అయిన పెరియార్ నాయకత్వాన అనేక ఉద్యమాలు జరిగిన తమిళనాడు రాష్ట్రం ఎఐడిఎంకెతో సహా అన్ని ద్రవిడ రాజకీయ పార్టీలు పెరియార్‌ను తమ పెద్దగానూ, గురువుగానూ భావిస్తాయి.

కానీ ప్రస్తుత ఆధునిక యుగంలో, తమిళనాడు రాష్ట్రంలో, ద్రవిడపార్టీ అయిన ఎఐడిఎంకె పాలనలో కులవ్యవస్థ తన అన్ని వికృత రూపాలతో వేళ్ళూనుకొని వుంది. నిమ్న కులాలపై అత్యంత హేయమైన వివక్ష కొనసాగుతూవుంది.

ముస్సోరీలోని లాల్‌బహదూర్ శాస్త్రి ఎకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో 2018 ఐఎఎస్‌లకు శిక్షణనిచ్చే ఆఫీసరు "తమిళనాడులో స్కూలు విద్యార్థులను తమతమ కులాలను తెలియజేసే విధంగా ముంజేతికి బ్యాండ్లు ధరించాలని బలవంతం చేస్తున్నారు" అన్న విషయంపై ఒక చర్చ నిర్వహించి, నివేదిక తయారు చేసి సమర్పించేవరకు అత్యంత అమానవీయమైన ఈ విషయం వెలుగులోకి రాలేదు. ఈ విషయం ఇలా బహిర్గతం కావటంతో తమిళనాడు పాఠశాల విద్యాశాఖాధికారి అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు వారి వారి ప్రాంతాలలో ఇటువంటి విధానం కొనసాగుతున్న స్కూళ్ళను గుర్తించాలని, ఆయా స్కూళ్ళ ప్రధానోపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఒక సర్క్యులర్ జారీచేయవలసి వచ్చింది. కుల వివక్షచూపే ఈ విధానానికి వ్యతిరేకంగా ఆ సర్క్యులర్ ఇవ్వడమనే ఎత్తుగడ ద్వారా విమర్శల నుండి తప్పించుకోజూశారు.

ఈ విధంగా విద్యార్థులు కులాన్ని సూచించే బ్యాండ్లను విక్షపురం జిల్లాలలోని స్కూళ్ళలో ధరించవలసి రావటమన్న విషయం రెండు సంవత్సరాల క్రితమే తెలిసింది. దిగువ దక్షిణాదిన ముఖ్యంగా తిరుచ్చి జిల్లాలో కూడా ఈ దురాచారం కొనసాగుతూ వుందనేది ఈ మధ్యనే వెలుగులోకి వచ్చింది.

తమిళనాడులోని కొన్ని స్కూళ్ళలో విద్యార్థులు ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, కాషాయరంగు బ్యాండ్లను తమది అగ్రకులమో, నిమ్నకులమో తెలియజేసేందుకు ధరించవలసి వస్తోంది. ఉంగరాలు, తిలకం వంటివి కూడా కులవ్యక్తీకరణలుగా వున్నాయి. ఈ ముంజేతి పట్టీలుగానీ, ఉంగరాలుగానీ, తిలకంగానీ ధరించిన విద్యార్థులు నిమ్న కులాలవాళ్ళు అయితే ఆటలలో ఎంపిక కావటంలో, బోధనా సంబంధమైన విషయాలు మొదలైన వాటిలో వాళ్ళు తీవ్ర వివక్ష ఎదుర్కొంటున్నారు.

కులంతో ప్రభావితమైన ఆయా కులాల ప్రతినిధులు, ఉపాధ్యాయుల సహకారంతోనే ఈ దురాచారం కొనసాగుతోంది. ఈ విషయం బట్టబయలయ్యేంత వరకు పాలనా వ్యవస్థ మౌనప్రేక్షక పాత్ర వహిస్తోంది.

ఈ సందర్భంలోనే ఈ దురాచారాన్ని ఆపమని తమిళనాడు విద్యాశాఖాధికారి జారీ చేసిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా బిజెపి నాయకుడు హెచ్.రాజు ట్విట్టర్‌లో వ్యాఖ్యానించాడు. తమిళనాడు విద్యాశాఖమంత్రి సెంగొత్తయ్యన్ ఈ సర్క్యులర్‌ను అమలు జరపవద్దని ఆదేశించాడు. ఓట్లను దండుకునే రాజకీయాల వికృతరూపమిది.

విద్యార్థులలో ఈ విధమైన కులవివక్షత చూపించటమనేది మొదటగా తమిళనాడులోని అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రారంభమైంది. భోజనం వడ్డించేటప్పుడు అగ్రకులాలకు చెందిన విద్యార్థులు తమ పళ్ళేలను తామే తెచ్చుకోవటం ప్రారంభించారు. 1964 నుండి 1970 వరకు మధురై జిల్లాలోని కళ్ళిఉడి వద్దగల పంచాయితీ పాఠశాలలో కేవలం 21 మంది దళిత విద్యార్థులు మాత్రమే చేరారు. 1970ల నుండి నేటివరకు దళిత విద్యార్థులు తప్ప ఇతర కులాలకు చెందిన వారెవరూ ఈ స్కూలులో చేరలేదు. కొన్ని స్కూళ్ళలో అగ్రకులాల విద్యార్థులు దళిత లేదా ఇతర తక్కువ కులాలవారు వండిన భోజనాన్ని తినటానికి నిరాకరించారు.

సర్వశిక్షా అభియాన్ పనితీరుపై వెలువరించిన నివేదిక కూడా పాఠశాలల్లో కులవివక్షత చాలా తీవ్రంగా వుందని తెలియజేస్తోంది.

ఈ దురాచారానికి పాల్పడుతున్న వారిని పట్టించుకోకపోవటం, వారిని శిక్షించకుండా వుండటమనే విధానాన్ని పాలనావ్యవస్థ అవలంబిస్తోంటే, పాలకులు తమ కుల ప్రయోజనాలకోసం పాకులాడుతుంటే కులవాదం దాని అ్యతంత వికారరూపంతో సమాజంలో కొనసాగుతూ వుంది.

కులవ్యవస్థ యొక్క మూలాలు మన అర్థవలస, అర్థఫ్యూడల్ సమాజంలో లోతుగా పాతుకుపోయి వున్నాయి. ఈ వ్యవస్థయొక్క సహజ లక్షణంగా అది వుంది. ఈ వ్యవస్థను తుదముట్టించకుండా ఈ దురాచారాలను రూపుమాపటం సాధ్యం కాదు. ముఖ్యంగా ప్రస్తుతం ఉన్మాద పద్ధతులతో వ్యవహరిస్తున్న హిందూత్వ శక్తుల ఏలుబడిలో కులవివక్షకు వ్యతిరేకంగా కులనిర్మూలన కొరకు సంఘటిత ప్రజా ఉద్యమాలు నిర్మించి పోరాడాల్సిన అవసరం నేడెంతైనా వుంది. ★

---

**(15వ పేజీ నుండి)**

'చట్ట విరుద్ధ కార్యకలాపాలకు' నడుమ దగ్గరి సరిపోలికను చూడవచ్చు.

ఈ చట్టాన్ని వ్యక్తుల స్థాయిలో అమలు చేస్తే, ఆతని ప్రాథమిక హక్కులపై ఘోరమైన దుష్ఫలితాలను చూపుతుంది.

ఇక, దీనితో ఎవరైతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొంతెత్తుతారో వారందరినీ 'టెర్రరిస్టు'లుగా సులభంగా ఎలాంటి విచారణ చేయకుండానే ముద్రవేయవచ్చు. బిజెపి-ఎన్‌డిఏ ప్రభుత్వం 'ఉపా' చట్టానికి ఈ సవరణ తేవటంతో ప్రభుత్వ వ్యతిరేక స్థితిని చట్టవిరుద్ధ మరియు టెర్రరిస్టు కార్యకలాపాల స్థితికి సమానం చేసింది.

పైన పేర్కొన్న చట్టాలకు ఈ సవరణలు చేయటంద్వారా ప్రభుత్వం తన అధికారాలను అమలుచేయటంలో చట్టబద్ధంగా జవాబుదారీతనం లేకుండా వుండేందుకు మాత్రమే కాకుండా అధికారాలన్నింటినీ తన వద్దే కేంద్రీకరించుకోవటానికే చేస్తున్నదని స్పష్టమౌతున్నది.

నిరంకుశాధిపత్య పాలనను నెలకొల్పటం మినహా ఇది వేరుకాదు. బిజెపి-ఎన్‌డిఏ ప్రభుత్వం తనకు కట్టబెట్టిన అధికారాలను తప్పుగా వినియోగిస్తూ తప్పుడు పాలన కొనసాగిస్తోంది.

ఈ అప్రజాస్వామిక, అణచివేతతోకూడిన, క్రూర సవరణలు చేయటంద్వారా బిజెపి-ఎన్‌డిఏ ప్రభుత్వం గుంజుకున్న విశేష అధికారాలన్నీ ఖచ్చితంగా ప్రజావ్యతిరేకమైనవీ; నిరంకుశమైనవే.

ఈ అణచివేత చట్టాలకు వ్యతిరేకంగా ఒక బలమైన ఐక్య ప్రజాఉద్యమం నేటి తక్షణావసరంగా వుంది. ★

# నిరంకుశాధిపత్య పాలన సాగిస్తున్న బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం

**భారతదేశ** ఆర్థికవ్యవస్థ త్వరలో 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోనుందనే ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఘనమైన ప్రకటనను స్వాగతిస్తూ, ఆయనను అభినందిస్తూ భారత కార్పొరేట్ రంగంలో ఒక ప్రముఖుడైన ఆడి గోద్రెజ్ ఈవిధంగా వ్యాఖ్యానించాడు: "అభివృద్ధి ఆకాంక్షలు, కలలు ముందుకు సాగుతున్నప్పటికీ అదంత సులువైనదేమీ కాదు. పేదరికం ఈనాటికీ మన దేశాన్ని పట్టిపీడిస్తున్న భయంకర వ్యాధిగా వుంది. అసహనం పెరిగి పోవటం, సామాజిక అస్థిరత, ద్వేషపూరిత నేరాలు, మహిళలపై హింస, నైతిక విధి నిషేధాలు, మరియు అనేక రూపాల్లో సాగుతున్న అసహనాలు దేశవ్యాపితంగా పెచ్చుమీరు తున్నాయి". ఈవిధంగా అతనే మనదేశంలో నెలకొన్న చీకటి కోణాల్ని వాస్తవికంగా పేర్కొన్నాడు.

అయితే, సిగ్గుమాలిన ఈ పరిస్థితులను జాగ్రత్తగా మార్పుచేయటానికి, ప్రజాజీవితాన్ని మెరుగుచేయటానికి, వారికి సంక్షేమాన్ని అందించటానికి ప్రయత్నించకపోగా, బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం మనదేశ పాలనా వ్యవస్థను నిరంకుశ, ఆధిపత్య పాలనా వ్యవస్థగా రూపొందించటానికి నిర్ణయించుకుంది.

ప్రజల జీవితాలను వారి హక్కులను నష్టపరిచే, చాలా తీవ్రంగా ప్రభావితంచేసే నిర్దిష్ట ప్రాధాన్యత గలిగిన బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టి, వాటిపై ఎలాంటి చర్చలు లేకుండా మొరటు మెజారిటీతో దొర్లించుకుంటూ పోవటాన్ని చూపినపుడు, ఈ బిల్లులలోని ప్రజా వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక స్వభావంతోనే బిల్లులు ఆమోదం పొందినపుడు - బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ నిరంకుశాధిపత్య పాలనను సాగించే ప్రయత్నాలు చేస్తున్నదని అందరూ ఎత్తి చూపారు.

అన్ని ప్రజాస్వామిక సూత్రాలను వారు తోసిపుచ్చారు. పార్లమెంటరీ సాంప్రదాయాలుగా చెప్పబడే వాటినన్నింటినీ ప్రక్కకు నెట్టి వేశారు. వారు నిర్లజ్జగా బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టామనిపించి, చట్టాలుగా ఆమోదం పొందేట్లు చేసుకున్నారు. ఈవిధంగా చేయటం ద్వారా పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు వికృత పార్శ్వాన్ని ప్రజా ప్రతినిధులుగా, ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించాల్సిన చట్ట సభలలోని సభ్యుల జోక్యానికి సంబంధించిన వంచనను కూడా ఈ సమావేశాలు వెల్లడిచేశాయి.

"నిర్హేతుకంగా, విశేషాధికారాలతో వ్యవహరించే అవినీతికర ప్రభుత్వాల పాలిట ఓ ఆయుధం"గా దాని నిర్మాతలైన అరుణ్‌రాయ్ వంటివారు అభివర్ణించే అనేక పోరాటాల ఫలితంగా పొందిన సమాచారహక్కు చట్టం(ఆర్‌టిఐ)- 2005ను ఓ చట్టసవరణ ద్వారా నీరుగార్చి వేశారు. అధికారుల హోదాలను హేతుబద్ధీ కరించే ఉద్దేశ్యంతో ఈ సవరణ చేశామని చెప్పారు. అయితే ఈ సవరణ ఆర్‌టిఐ అధికారుల హోదా, కాలపరిమితిలతోపాటు ప్రభుత్వ సేవకులవలెనే కమిషనర్ విధులను కూడా నిర్వచించింది. వారి స్వయంప్రతిపత్తి, స్వేచ్ఛ తొలగించివేశారు. ఇప్పుడు వారు నిష్పాక్షికంగానూ, స్వతంత్రంగానూ వుండే కమీషనర్లుగా వుండలేరు. యంత్రాంగాన్ని గుప్పెటలో పెట్టుకున్న స్వార్థ ప్రయోజనా పరులకు ఉపయోగం కలిగించే తిరోగామి చర్య ఇది. ఆర్‌టిఐ చట్టం - 2005కు ఈ సవరణ చేయటంతో బిజెపి - ఎన్‌డిఏ ప్రభుత్వం స్వార్థపరులు చేసే తప్పుడు పనులపై కొంతైనా నిఘా పెట్టకలిగిన ఈ చట్టం యొక్క ప్రయోజనకర ప్రభావాన్ని తొలగించివేసింది.

గత పార్లమెంటు సమావేశాలలోనే 'మానవ హక్కుల పరిరక్షణా చట్టం-1993' అనే మరో చట్టాన్ని కూడా మార్పు చేశారు. ప్రభుత్వంచే నియమితులైన వారు మాత్రమే జాతీయ మానవహక్కుల కమిషనర్‌గా కొనసాగుతారని ఈ సవరణ హామీ ఇస్తోంది.

1993 నాటి మానవహక్కుల పరిరక్షణా చట్టం ప్రకారం భారత ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన వారు మాత్రమే ఎన్‌హెచ్‌ఆర్‌సి అధ్యక్షునిగా వుండటానికి అర్హులు. కానీ ఆ చట్టానికి చేసిన ప్రస్తుత సవరణ ప్రకారం, మాజీ భారత ప్రధాన న్యాయమూర్తితోపాటు, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి కూడా ఎన్‌హెచ్‌ఆర్‌సి అధ్యక్షునిగా కొనసాగవచ్చు. ఈ విధంగా ప్రస్తుత సవరణ ఎన్‌హెచ్‌ఆర్‌సి అధ్యక్షున్ని నియమించుకునే విచక్షణాధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెట్టింది. మరోమాటలో చెప్పాలంటే 'జీహుజూర్' అనే వారినే ఎన్‌హెచ్‌ఆర్‌సి అధ్యక్షునిగా నియమించు కునేందుకు మార్గాన్ని వేసింది.

ఇంకా, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యుఏపిఏ-ఉపా)కు కూడా ఈ పార్లమెంటరీ సమావేశాలలోనే సవరణలు చేశారు. ఇందిరాగాంధి ప్రధానిగా వున్న కాలంలో 'ఉపా' చట్ట రూపం దాల్చింది. ఆనాటి నుండి వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్నీ తమ అధికారాలను మరింతగా పెంపుచేసుకుంటూ సవరణలు చేసుకుంటూ వస్తున్నారు. ఈ చట్టం 2004 సం॥లో సవరణ పొంది సమగ్ర టెర్రరిస్టు వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టంగా రూపొందింది. ఈ చట్టంలో టెర్రరిజాన్ని నిరోధించే, లేదా టెర్రరిస్టులను శిక్షించే చర్యలను కూడా పొందుపరిచారు. ఆ తర్వాత ఈ చట్టం 2008లోను, 2013లోను టెర్రర్‌ను ఎదుర్కొనేందుకు, చట్టపరిధిని సవరించేవిధంగా సవరణలు పొందింది.

తిరిగి ఎన్‌డిఏ ప్రభుత్వం యూనియన్ హోంమంత్రి అమిత్‌షాకు అనుగుణంగా 'ఉపా' చట్టాన్ని సవరించింది. దీనిప్రకారం ఎవరినైనా టెర్రరిస్టు లేదా అర్బన్ నక్సలైట్‌గా ప్రకటించవచ్చు. 2019 నాటి 'ఉపా' చట్టం దేశంలోని భద్రతా సంస్థలకు విశేషాధికారాలు కల్పిస్తోంది. దీనిప్రకారం ఆ సంస్థలు అనుమానితుల నెవరినైనా 'టెర్రరిస్టు'గా పేర్కొని వారి ఆస్థులను సైతం జప్తు చేయవచ్చు. ఈ సవరణతో వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కులను కోల్పోవటమే జరుగుతోంది. టెర్రరిస్టుగా ఎవరినైనా ముద్ర వేస్తే, దాని దుష్ఫలితాలు, ఆ వ్యక్తి ప్రతిష్టకు అది కల్గించే నష్టం తిరిగి పూడ్చుకోలేనిది. అలా ప్రకటించబడిన వారిని అరెస్టుచేసి, నిర్బంధంలోకి తీసుకోవచ్చు. అంతేగాక కోర్టులనుండి బెయిల్ పొందివున్నప్పటికీ వారిని నిర్బంధించే అధికారాన్ని ఈ సవరణ కల్పిస్తోంది. ఈ దోషాన్ని మోయటంతోపాటుగా వారి కదలికలు అన్నింటినీ కుదించివేయటం జరుగుతుంది. రాజ్యంతో కలిసి నడిచేవారు కాని వారెవరికి వ్యతిరేకంగానయినా భద్రతా బలగాలు స్వేచ్ఛగా చర్యలు తీసుకోవటానికి దీనితో అవకాశం కల్పించారు.

దర్యాప్తు సంస్థలకు విశేష అధికారాలు కల్పించిన కొలదీ అవన్నీ దుర్వినియోగమవు తాయనేది మన గత అనుభవాలు చెబుతున్నాయి. టెర్రరిస్టులను లేదా వారి సానుభూతిపరులను ప్రత్యేకించి 'అర్బన్ నగ్జలైట్'లను తమ ప్రభుత్వం ఉపేక్షించబోదని కేంద్రహోంమంత్రి అమిత్‌షా చేసిన హెచ్చరిక, ఈ చట్టం ఎన్ని విధాలుగా దుర్వినియోగం కాబోతున్నదో చెప్పకనే చెపుతున్నది.

మాజీ కేంద్రమంత్రి పి.చిదంబరం సందేహం వెలిబుచ్చినట్లుగా 'రాజద్రోహానికి'

**(తరువాయి 14వ పేజీలో)**

# యురేనియం తవ్వకాలు మరుగుపరుస్తున్న వాస్తవాలు

**యురేనియం** ఖనిజ తవ్వకాల అంశమై ఇటీవల కాలంలో ఇరు తెలుగు రాష్ట్రాలలోనూ మరోసారి తీవ్ర చర్చ రాజుకుంది. యురేనియం నిక్షేపాల వెలికితీత ప్రయత్నాలను నిరసిస్తూ ప్రజలు-ముఖ్యంగా అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న ఆదివాసులు, ప్రజాసంఘాలు, పర్యావరణవాదులు, మేధావులు వివిధ రూపాల్లో వ్యతిరేకిస్తూ నిరసనాందోళనలు నిర్వహిస్తున్నారు. ఆంధ్ర-తెలంగాణ సరిహద్దున నల్లమల అటవీ ప్రాంతంలో యురేనియం తవ్వకాలకై ప్రభుత్వ ఏజెన్సీలు బోర్లు వేసి అన్వేషణ సాగిస్తుండటంతో ఈ ప్రజాందోళన మరింత పెరిగింది. దీనితో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ, శాసనమండలిలో తవ్వకాలను వ్యతిరేస్తున్నట్లుగా పోజు పెడుతూ తీర్మానాలు చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం దీనిపై నిమ్మకు నీరెత్తినట్లుగా వుంది.

## యురేనియం వెలికితీతపై కొనసాగుతూ వస్తున్న వ్యతిరేకత

యురేనియం ఖనిజాకున్న స్వభావం- ప్రజలఆరోగ్యం, పర్యావరణంపై దాని ప్రభావాన్ని గురించిన విజ్ఞానం వెల్లడి కావడంతోపాటు యురేనియం తవ్వకాలు, శుద్ధి చేయటం, అణు విద్యుత్తు కేంద్రాలలో దాని వినియోగం, దాని ఉపఉత్పత్తులుగా వెలికివచ్చే ప్లూటోనియం వంటి వాటిని అణుబాంబులలో వినియోగించటం వంటి అంశాలు వెలుగులోకి వస్తూండటంతో యురేనియం తవ్వకాలపట్ల వ్యతిరేకత పెరుగుతూవస్తోంది.

భారతదేశంలో యురేనియం తవ్వకాలకై వెదుకులాట, తవ్వకాలు ప్రారంభమైన తర్వాత అణు విద్యుత్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐఎల్) కు అనుబంధంగా ఉన్న యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యుసిఐఎల్) ఆధ్వర్యంలో దేశంలోని వివిధ ప్రాంతాలలో యురేనియం తవ్వకాలు సాగిస్తూ, కొత్త ప్రాంతాలలో యురేనియం నిక్షేపాల కోసం వెతుకులాట సాగిస్తూనే వస్తున్నారు.

మేఘాలయ రాష్ట్రం డొమిసియాడ్ ప్రాంతంలో 1990ల నుండి యురేనియం ఖనిజం తవ్వకాలు సాగించే ప్రయత్నాలను ఆప్రాంత ప్రజలు అడ్డుకుంటూ వచ్చారు. 2009 నాటికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా యూసిఐఎల్ మేఘాలయ పశ్చిమ ఖాశీ కొండలను 30 సంవత్సరాలు లీజుకు తీసుకుంది. 1046 కోట్ల రూపాయల వ్యయంతో మేఘాలయాలో ముడియురేనియం ఖనిజాన్ని వెలికితీసి రోజుకు పదిహేను వందల టన్నుల యురేనియాన్ని శుద్ధిచేసే కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రకృతి సౌందర్యానికి, పర్యావరణానికి పేరొందిన మేఘాలయలోని ప్రాంతాలన్నీ అనతికాలంలోనే తీవ్రకాలుష్యానికి గురయ్యాయి. ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యాలు, ప్రాణాలకు తీవ్ర హాని జరిగింది. అయినా యుసిఐఎల్, మేఘాలయ రాష్ట్రప్రభుత్వం తవ్వకాలు సాగిస్తున్నాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నల్గొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలం- పెద్దగట్టు సంభంపూర్‌లలో యురేనియం నిక్షేపాలు కనుగొని తవ్వకాలు చేపట్టే ప్రయత్నాలను 2003 సం॥లోనే ఆ ప్రాంత ప్రజలు ప్రతిఘటించారు. ప్రజాభిప్రాయ సేకరణ తంతును నిలువరించారు. దాన్ని దశాబ్దకాలం పాటు నిరోధించారు. అయినా ప్రభుత్వాలు మొండిగా యురేనియం ఖనిజం వెలికితీత, శుద్ధి ప్రక్రియలను చేపట్టేందుకే మొగ్గుచూపాయి.

కడపజిల్లా-పులివెందుల నియోజకవర్గ పరిధిలోని వేముల మండలం ఎం. తుమ్మలపల్లి ప్రాంతంలో ప్రజల నిరసనను బేఖాతరు చేస్తూ, 1,106 కోట్ల రూపాయలతో వ్యయంతో యురేనియం ఖనిజ తవ్వకాలను నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి కాలంలో 2007 నవంబరు 20న ప్రారంభించారు.

ప్రజల జీవనం అభివృద్ధి చెందుతుందనీ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయనీ, స్థిర నివాసం, మెరుగైన విద్యా, వైద్యం కల్పిస్తామని అరచేతిలో వైకుంఠం చూపిన పాలకుల వాగ్దానాలన్నీ కొద్దికాలంలోనే తేలిపోయాయి.

2008 సంవత్సరం నుండి ఈ ప్రాంతంలో యుసిఐఎల్ ఆధ్వర్యంలో యురేనియం ఖనిజాన్ని తవ్వి తీస్తున్నారు. దీనికోసం తుమ్మలపల్లితో పాటు రాచకుంటపల్లి, మబ్బు చింతపల్లి తదితర ప్రాంతాలలో 1100 ఎకరాలను ప్రజల నుండి బలవంతంగా గుంజుకున్నారు.

ఇవన్నీ నిక్షేపంగా పంటలు పండే భూములే. ఇవిగాక యురేనియం తవ్వకాలకు మరో 1300 ఎకరాల ప్రభుత్వ భూములను కూడా కట్టబెట్టారు. యురేనియం నిల్వలు కడప జిల్లాలోనే అధికంగా ఉన్నట్లుగా నివేదికలను వెలువరించారు. ఇక్కడి నుండి తవ్వితీసే యురేనియంలో 99.97% కాలుష్య పూరిత వ్యర్థాలుగా మిగిలిపోగా, 0.03 శాతమే శుద్ధ యురేనియంగా మిగులుతుంది.

యురేనియం తవ్వకాలు ప్రారంభమైన నాటినుండి ఈ ప్రాంత ప్రజల కష్టాలు తీవ్రమయ్యాయి. పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర కాలుష్యానికి తోడు అంతుచిక్కని అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. బోరు బావుల్లో నీరు అడుగంటి పోయింది. వెయ్యి అడుగులు తవ్వినా నీరుపడలేదు. ఒకవేళ నీరుపడినా అణు ధార్మికతతో కూడి ప్రమాదకరంగా పరిణమించింది. భూగర్భంనుండి వెలికితీసి లక్షల టన్నుల యురేనియం ముడి ఖనిజాన్ని ఇప్పటికే గుట్టలుగా పోశారు.

## శుద్ధిచేసే కర్మాగారంతో సమస్యలు మరింత తీవ్రం

తవ్విపోసిన ముడి ఖనిజాన్ని శుద్ధి చేసేందుకు 2012 ఏప్రిల్ 20న ప్రభుత్వం యుసిఐఎల్ శుద్ధి కర్మాగారాన్ని ప్రారంభించింది. శుద్ధిచేసిన పిదప ఈ కర్మాగారం నుండి ప్రతిరోజు వేలాది టన్నుల వ్యర్థాలను పైపులైన్ల ద్వారా సుదూరంగా నిర్మించిన టైలింగ్ పాండ్‌కు తరలిస్తున్నారు. శుద్ధి ప్రక్రియ ప్రారంభమైన కొద్దికాలానికే విష కాలుష్యాన్ని మోసుకెళ్లే పైపులైను లీకేజీతో పర్యావరణాన్ని, ప్రజల ప్రాణాలను హరించి వేస్తోంది. ఈ వ్యర్థాలు ప్రవహించిన నేలమీద గడ్డిపరకకూడా మొలవని స్థితి నెలకొంది.

యురేనియం తవ్వకాల రెండవదశ విస్తరణ రాచకుంటపల్లి వద్ద చేపట్టారు. మొదటి దశలో భూగర్భంలో 900 అడుగుల లోతు తవ్వకాలు చేపట్టగా, రెండవ దశలో 1670 అడుగుల లోతువరకు తవ్వకాలు చేపట్టారు. యురేనియం శుద్ధి కర్మాగారాల నుండి వెలువడే టన్నుల కొద్దీ వ్యర్థాలను నింపటానికి నిర్మించిన టైలింగ్ పాండ్స్ ఏ మాత్రం సరిపోవు.

ఈ మొత్తం తవ్వకాలు, శుద్ధిప్రక్రియల ఫలితంగా కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలలో మనుషుల, పశువుల ప్రాణాలకు పంటలకు తీవ్ర హాని సంభవిస్తోంది. ఈ వ్యర్థ జలాలు సోకిన పశువులు చర్మం ఊడిపోతోంది, మొక్కలు ఎండిపోతున్నాయి. పశువులు గర్భం దాల్చే శక్తి కోల్పోతున్నాయి. యువకుల నుండి వృద్ధుల వరకు కీళ్లనొప్పులు తీవ్రమయ్యాయి. కొందరికి చర్మవ్యాధులు, లైంగిక సమస్యలు, క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. యురేనియం

శుద్ధిలో వినియోగించే గాఢ సల్ఫ్యూరిక్ ఆమ్లం ఫలితంగా కూడా అనేక దుష్ఫలితాలు వెంటాడుతున్నాయి.

యురేనియం ప్రాజెక్టు ప్రారంభానికి ముందు ఈ ప్రాంతప్రజల రక్తనమూనాలను, భూగర్భజలాల నవతూనాలను సేకరించి పరీక్షించి, నిక్షిప్తం చేశారు. ప్రస్తుతం ప్రజలు ఇంతటి తీవ్ర అనారోగ్య పరిస్థితుల నెదుర్కొంటున్నప్పటికీ కాలుష్య తీవ్రత బయటకు వెల్లడవుతుంది అనే కారణంతో తిరిగి ప్రజలకు రక్త పరీక్షలు, భూగర్భజల పరీక్షలు చేపట్టకుండా కాలం వెళ్లబుచ్చుతున్నారు.

తీవ్ర కరువు నెదుర్కొంటున్న రాయలసీమ జిల్లాల్లో ముఖ్యంగా నీటి కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్న ఈ ప్రాంతంలో యురేనియం శుద్ధి అవసరాలకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి రోజుకు ఆరువేల ఘనపు మీటర్ల నీటిని వాడుకునేందుకు పాలకులు అనుమతినివ్వటం వారి ప్రజావ్యతిరేక వైఖరిని చాటిచెపుతోంది.

## యురేనియం తవ్వకం

### పర్యావరణ సమస్య మాత్రమే కాదు

యురేనియం తవ్వకాలు, శుద్ధిచేసే ప్రక్రియ ద్వారా ప్రజలు, పశువులు, పర్యావరణానికి కలిగే హానితోపాటు దీని వెనుక పాలకులు మరుగుపరుస్తున్న ముఖ్యమైన అంశముంది. భారతదేశంలోనున్న అపార వనరులను ఉపయోగించుకుని, తక్కువ ఖర్చుతో, తక్కువ ప్రమాదాలతో, తక్కువ కాలుష్యంతో ఎక్కువ ప్రయోజనాలను పొందడానికి ఉన్న అవకాశాలన్నీ పాలకులు తిరస్కరిస్తున్నారు. 2020 నాటికి భారత దేశానికి అవసరమైన అరవై మూడు వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సాధించాలంటే అణువిద్యుత్తే ఏకైక మార్గంగా ప్రవచిస్తున్నారు. అణు విద్యుత్తు కర్మాగారాలలో వినియోగించే రేడియోధార్మిక మూలకాలైన యురేనియం వంటి మూలకాలను విచ్చలవిడిగా తవ్వితీసే పనిని తలకెత్తుకున్నారు. ఇదంతా సామ్రాజ్యవాద దేశాల, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాద అణ్వాయుధాల తయారీ కనుగుణంగా ఈ ప్రక్రియను పాలకులు తీవ్రం చేస్తున్నారు.

ముడియురేనియంను శుద్ధి చేసి, సామ్రాజ్య వాదుల సాయంతో లభించిన సాంకేతిక పరిజ్ఞానంతో అణు విద్యుత్తు కేంద్రాలు స్థాపించడం జరుగుతోంది. ఈ విద్యుత్ కేంద్రాలలో యురేనియంను విచ్ఛిత్తి చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. ఇంతవరకే బయటకు ప్రకటిస్తారు అయితే దీని తర్వాత ఉప ఉత్పత్తులుగా వెలువడే ప్లుటోనియాన్ని పాలకులు సామ్రాజ్యవాద దేశాలకు సరఫరా చేస్తారు. ఈ ప్రక్రియ చాలా ప్రమాదంతోనూ, ప్రజల ప్రాణాలతోనూ, తీవ్ర కాలుష్యంతోనూ కూడుకున్నది కావడం వలన సామ్రాజ్యవాద దేశాలలో ప్రజల నిరసనను ఎదుర్కోలేక మనదేశం లాంటి మూడవ ప్రపంచ దేశాలపై ఆ భారం మోపుతున్నారు. అమెరికా అగ్రరాజ్య సామ్రాజ్యవాదం భూమండలంపై అంతులేని అణ్వస్త్రాలను కలిగి ఉండి, ప్రపంచ దేశాలను శాసిస్తూ, మరింతగా మానవజాతిని నాశనం చేసేందుకు సరికొత్త అణ్వాయుధాలను తయారుచేస్తోంది. కాగా అందుకు అవసరమైన యురేనియం, థోరియం, ప్లుటోనియం వంటి మూలకాలను పాలకులు అత్యంత వినయ విధేయతలతో వారికి సమర్పించుకుంటూ, మరోవైపున ఇదంతా మనదేశ ప్రజల అభివృద్ధి కొరకే అని వంచిస్తున్నారు. ఒక పెద్ద కుట్రపూరిత పథకంలో భాగంగా వరుసగా అధికారంలోకి వస్తున్న భారత పాలకులు అంతా తెగబడి ఈ చర్యలను వేగవంతం చేస్తున్నారు. యురేనియం తవ్వకం, శుద్ధి, అణు విద్యుదుత్పత్తి -ఈ ప్రక్రియలన్నింటా జీవజాలానికే ప్రమాదకరమైన విషపూరిత అణుధార్మికతకు దేశీయులను బలి చేయడానికి ఎన్ని కల్లబొల్లి కబుర్లైనా చెబుతారు. ప్రపంచాన్ని తన గుప్పెట్లో బంధించాలనుకుంటున్న అగ్రరాజ్య సామ్రాజ్యవాద అధిపత్య కాంక్షలకు అనుగుణంగా వారికి అవసరమైన ముడిపదార్థాల సరఫరాదారులుగా పాలకులు నిస్సిగ్గుగా తమని తాము రుజువు చేసుకుంటున్నారు. ఇందుకు అడ్డుగా నిలిచిన ప్రజావ్యతిరేక నిరసనలన్నింటిని సామ దాన భేద దండోపాయాలతో అడ్డు తొలగించుకొని సామ్రాజ్యవాదానికి నిఖార్సైన సేవ చేస్తున్నారు. అణుమాత్రం దేశభక్తి, ప్రజా ప్రయోజనాల పట్ల బాధ్యత కలిగిన ఎవరైనా దీనిని ప్రశ్నిస్తే దానిని దేశద్రోహంగా పాలకులు చిత్రిస్తున్నారు. అభివృద్ధి నిరోధకులని, విదేశీ ఏజెంట్లని వారిపై ముద్రలు వేయడమే గాక రాజద్రోహ నేరాన్ని మోపి అణచివేత ప్రయోగిస్తున్నారు.

## యురేనియం తవ్వకాలకు వ్యతిరేకత

యురేనియం నిక్షేపాలు కనుగొనే ప్రయత్నాలకు, యురేనియం ఖనిజాన్ని తవ్వి తీసే ప్రయత్నాలకు వ్యతిరేకంగా నల్లమల అటవీ ప్రాంతంలో ప్రజల ఆందోళనలు సాగుతున్నాయి. వీరికి సంఘీభావంగా ఇరు రాష్ట్రాలలో వివిధ ప్రజాసంఘాలు, మేధావులు నిలుస్తున్నారు. అలాగే కడపజిల్లా ఎం.తుమ్మలపల్లిలోని యురేనియం శుద్ధి కర్మాగారానికి ప్రజావ్యతిరేకత తీవ్రమైన ఫలితంగా వైఎస్ఆర్ సీపీ నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఓ నిపుణుల కమిటీని నియమించింది. ప్రజల ఆరోగ్యం, పర్యావరణాలపై దుష్ఫలితాలను వివరించమని కోరింది. టీఆర్ఎస్, వైసీపీల నాయకత్వంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వాలు తాత్కాలికంగా ప్రజా వ్యతిరేకతను నిలువరించడానికి నెపాన్ని కేంద్రంలోని బీజేపీపై మోపి తప్పుకోవటం మినహా ప్రజలతో గొంతు కలిపి వాటిని రద్దుచేసేందుకు పూనుకోవనేది స్పష్టమే.

## ఉద్యమంలో భిన్న ధోరణులు

యురేనియం తవ్వకాలను వ్యతిరేకించాలని కోరే వారిలో, సమగ్ర అవగాహనలో కొరవ లున్నాయి. నల్లమల అడవులలో చెంచుల, బోయల ఇతర ఆదివాసుల ఉనికికి నష్టకరం కావున, కొందరు పర్యావరణవాదులు అక్కడే పరిమితమౌవుతున్నారు. మరి కొందరు యురేనియం నుండి వెలువడే కాలుష్యాన్ని మాత్రమే కారణంగా చూస్తున్నారు. యురేనియం తవ్వకాలు - శుద్ధిచేయడం - అణువిద్యుత్ కర్మాగారాల స్థాపన - సామ్రాజ్యవాద దేశాల అణ్వాయుధాలకు అవసరమైన ప్లుటోనియం తదితరాల సరఫరా వరకు పాలకుల లోతైన కుటిల లక్ష్యాన్ని అవగాహన చేసుకోవాలి.

మనదేశ అవసరాలకు, మన ప్రజల అవసరాలకు ఏమాత్రం ఉపయోగపడని, పైగా మనదేశ ప్రజల జీవితాలతో, ఆరోగ్యాలతో, పర్యావరణంతో చెలగాటమాడే, ప్రజలను నిరంతరం వ్యాధిగ్రస్తులుగా మార్చివేసే యురేనియం ఖనిజ తవ్వకాలు -శుద్ధి ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేయాలి. సామ్రాజ్యవాదుల ప్రపంచాధిపత్య వ్యూహంలో భాగంగా అణ్వస్త్రాల తయారీకి అవసరమైన ముడిసరకు అవసరాలు తీర్చేందుకే భారత పాలకులు మనదేశంలో ప్రజలపాలిట అత్యంత ప్రమాదకరమైన ఈ చర్యలు చేపట్టారనేది స్పష్టం. యురేనియం తవ్వకాలు- శుద్ధి- విస్తరణ కొత్తగా ప్రారంభించదలచిన ప్రాంతాలన్నింటా వెంటనే ఈ ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని, మానవజాతికే పెను విపత్తుగా పరిణమించనున్న యురేనియం తవ్వకాలన్నింటినీ, అణువిద్యుదుత్పత్తిని ఆపి వేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించాలి. ★

# ఉన్నావో కేసు

# నేరచరిత పాలక నేతలను సంరక్షించే వ్యవస్థ స్వభావాన్ని వెల్లడిచేసిన మరో ఉదంతం

**2017** సంవత్సరంలో బిజెపి ఎమ్మెల్యే కులదీప్ సింగ్ సింగార్ చేతిలో అత్యాచారానికి గురైన ఉత్తర ప్రదేశ్ ఉన్నావోకు చెందిన యువతి ఇటీవల ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చావు బతుకుల మధ్య ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్న ఘటన -మన వ్యవస్థయొక్క నిజస్వభావాన్ని, ఈ వ్యవస్థ ఎవరి ప్రయోజనాలను పరిరక్షిస్తుంది అన్న అంశాన్ని మరోమారు స్పష్టంగా తేటతెల్లం చేసింది.

ఈ ఘటనను కేవలం శాంతిభద్రతల కోణం నుండి మాత్రమే చూడలేము, చూడకూడదు; ఈ వ్యవస్థ వర్గస్వభావ కోణం నుండి దీనిని పరిశీలించాలి. అధికారంలో నున్నవారు సాగించే హింస, అకృత్యాల నుండి సాధారణ ప్రజానీకాన్ని పరిరక్షించేందుకు ఈ వ్యవస్థ ఉద్దేశించబడి లేదని స్పష్టమవుతుంది. మరోవైపున సంపన్న పాలకవర్గాలు, వారి శక్తి వంతమైన ఏజెంట్లు, పాలకవర్గాలకు ప్రాతినిధ్యం వహించే రాజకీయ నాయకుల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వ్యక్తమయ్యే ప్రజల అసంతృప్తి, ఆగ్రహం నిరసనల నుండి కాపాడు కోవడానికే ఈ వ్యవస్థ కంకణం కట్టుకొని ఉన్నదని కూడా తేటతెల్లమౌతుంది. మనదేశ అర్ధవలస, అర్ధ ఫ్యూడల్ వ్యవస్థ, పాలకులు, పాలకవర్గాలు లేదా నేరపూరిత రాజకీయ నేతలకు వ్యతిరేకంగా శాంతి భద్రతలను కాపాడేందుకు ఏనాడూ ప్రయత్నించదు.

రెండు సంవత్సరాల క్రితం ఉన్నావోకు చెందిన యువతి, అప్పటికి నాలుగు పర్యాయాలు బిజెపినుండి శాసనసభ్యునిగా ఎన్నికవుతూ వచ్చిన బంగారుమౌకు ప్రాతినిధ్యం వహించే కులదీప్ సింగ్ సెంగార్ వద్దకు ఉద్యోగం కోసం వెళ్ళింది. దీనిని అవకాశంగా తీసుకున్న సింగ్ సెంగార్ ఆ యువతిపై అత్యాచారం, సామూహిక అత్యాచారం సాగించాడు. ఈ ఘటన గురించి గత సంవత్సరం ఏప్రిల్ నెలలో ఆ యువతి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నివాసం ఎదుట ఆత్మహత్యా ప్రయత్నం చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కులదీప్ సింగ్ సెంగార్‌పై తను ఇచ్చిన ఫిర్యాదును తీసుకోవడానికి సైతం పోలీస్ అధికారులు నిరాకరించడంతో ఆ యువతి గత్యంతరం లేని స్థితిలో ఈ చర్యకు పాల్పడింది. ఎట్టకేలకు పోలీసులు ఫిర్యాదును తీసుకున్న తర్వాత నుండి ఆ యువతిని వారి కుటుంబ సభ్యులను నిరంతరం వేధించడం, వెంటాడడం తీవ్రమైంది. కులదీప్ సింగ్ సెంగర్ సోదరుడు ఆ యువతి తండ్రిని పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి తీవ్రంగా కొట్టి చంపివేశాడు. వారి బంధువులను పోలీసులు అరెస్టు చేశారు. ఆ యువతిపై అత్యాచారం కేసుతో బాటుగా పోలీస్ స్టేషన్‌లో ఆ యువతి తండ్రిని బంధించి హత్య గావించిన కేసును కూడా కలిపి విచారించవలసినదిగా సీబీఐని ప్రభుత్వం ఆదేశించింది. సిబిఐ రెండు కేసుల్లోనూ 2018 జూలైలో చార్జిషీట్లను సమర్పించింది. అయినప్పటికి ఏ కేసులోనూ విచారణ మాత్రం ప్రారంభం కాలేదు. చార్జిషీటు సమర్పించబడిన అనేక రోజుల తరువాత అంతుచిక్కని పరిస్థితులలో మహమ్మద్ యూనస్ అనే ఓ కీలకమైన ప్రత్యక్షసాక్షి మరణించాడు.

తాజాగా జరిగిన రోడ్డు ప్రమాదంలో బాధితురాలు ఆమె కుటుంబ సభ్యులు ఆమె న్యాయవాది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో బాధితురాలి అత్త ఒకరు మరణించారు. ఈమె ఈ అత్యాచార కేసులో మరో కీలక సాక్షిగా ఉన్నారు. కాగా బాధితురాలైన యువతి పరిస్థితి విషమంగా ఉంది. ఆమె కూడా మరణిస్తే నేరచరితుడైన రాజకీయ నాయకుడు న్యాయ ప్రక్రియ నుండి మరింత తేలికగా బయటపడి దర్జాగా బయటకురాగలుగుతాడు.

కులదీప్ సింగ్ అక్రమ ఇసుక తవ్వకాలు, అక్రమ ప్రజారవాణా వంటి నేరాల ద్వారా సంపదను కూడబెట్టడంతో పాటు క్రూరమైన రాజకీయవేత్తగా అవతరించాడు. ఉన్నావో జిల్లాలో దాదాపు ప్రతి గ్రామం నుండి సెంగార్‌కు విధేయులు వుండేవిధంగా అతని ఆధిపత్యం కొనసాగుతోంది.

ఉన్నావోకు 157 కి.మీ దూరంలో నున్న జైల్లో సెంగార్‌ను నిర్బంధంలో ఉంచినప్పటికీ లోక్‌సభ ఎన్నికలలో బిజెపికి చెందిన అభ్యర్ధి అయిన సాక్షిమహారాజ్‌ను గెలిపించుకోవడానికి గట్టిగా కృషిచేసి, గెలిపించుకున్నాడు. పార్లమెంటు ఎన్నికలలో గెలిచిన తర్వాత సాక్షి మహారాజ్ మొదటి కర్తవ్యం ఏమిటంటే జైలులో ఉన్న సెంగార్‌ను సందర్శించి బహిరంగంగా ఆతనికి తన కృతజ్ఞతలు తెలియజేయడం! బిజెపికి అధికారంలోకి రావడమే కావాలి అంతే తప్ప వ్యక్తి గుణగణాలతో పట్టింపులేదు. సెంగార్ రాజ్‌పూత్ కులానికి చెందినవాడు. యోగి ఆదిత్యనాథ్ ఎన్నికలలో దీనిని కూడా తమకు అనుకూలంగా ఉపయోగించాడు. ఈ కుల రాజకీయాలు కూడా ప్రభుత్వం తమపై ఏ చర్య తీసుకోకుండా సెంగార్‌ను కాపాడుతున్నాయి. ఉన్నావ్ ఉదంతం బాధితురాలి తండ్రి హత్య ఆమెపై వారి కుటుంబ సభ్యులపై రోడ్డు ప్రమాదం రూపంలో జరిగిన హత్యా ప్రయత్నం వంటివన్నీ సెంగార్ యొక్క పగ ప్రతీకారాలను సూచిస్తున్నాయి. ఈ విధంగా సెంగార్ చట్టభీతి లేకుండా నిర్నిరోధంగా రాజ్యవ్యవస్థ దన్నుతో అత్యాచారాలు అకృత్యాలు సాగించుకుంటూ వస్తున్నాడు.

ఉన్నావో ఉదంత బాధితురాలిపై రోడ్డు ప్రమాదం రూపంలో సాగిన హత్యాప్రయత్నంతో దేశవ్యాపితంగా వ్యక్తమైన ఆగ్రహావేశాలతో కోర్టు ఆలస్యంగా అయినా రంగంలోకి వచ్చింది. ఉన్నావో అత్యాచార బాధితురాలి బంధువు ఒకరు సాయాన్ని కోరుతూ రాసిన లేఖను సైతం సకాలంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎదుట ఉంచలేదు. సుప్రీంకోర్టు పరిపాలనా యంత్రాంగపు సాధారణ తప్పిదంగా మాత్రమే దీనిని పరిగణించ జాలము. ఎందువలన అంటే ఇలాంటి తప్పుడు పనులు చేయటం పాలనా యంత్రాంగానికి ఇది మొదటిసారి మాత్రమే కాదు.

మన వ్యవస్థ ఇలాంటి (ఉద్దేశ్యపూరిత) లొసుగులన్నింటిని ఆమోదించడానికి అనువుగా రూపొందించబడింది. సంపన్నులను శక్తివంతు లైన నేరస్తులను కాపాడి, వారు తప్పించు కోవటానికి అనుగుణంగా మలచబడింది. పంపన్న పాలకవర్గాలకు, పాలకులకు లోబడి మాత్రమే పోలీసులు శాంతి భద్రతలను పరిక్షిస్తుంటారు. శక్తివంతులైన అధికార రాజకీయ నేతలను, సంపన్న వర్గాలను, నిస్సహాయులు, సాధారణ ప్రజానీకం నుండి వేరు చేసి వ్యవహరించడంలో కారణమిదే.

ఉన్నావోలో జరిగినదే మన దేశంలోని పలుప్రాంతాల్లో చాలా తరచుగా జరుగుతూ వస్తున్నది. సెంగార్ తరహాలో అనేకమంది నేరగాళ్ళు అధికార దన్నుతో ఇలాంటి అకృత్యాలకు పాల్పడుతూనే ఉన్నారు. చట్టభీతి లేకుండా ఇలాంటి అత్యాచారాలు ➡

# న్యాయానికి పాతర

**పెహ్లూఖాన్‌పై** మూకదాడి సాగించి హత్యగావించిన కేసులో నిందితులైన ఆరుగురిపై కేసును కొట్టివేస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై దేశవ్యాపితంగా తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి.

వధించడానికి గోవులను తరలిస్తున్నాడని ఆరోపిస్తూ రెండు సంవత్సరాల క్రితం పెహ్లూఖాన్ అనే పాడి రైతును గోరక్షకుల పేరిట ఒక ముఠా దాడి సాగించి పెహ్లూఖాన్‌ను అతని కుమారులను క్రూరంగా హింసించిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెహ్లూఖాన్ రెండు రోజుల తర్వాత మరణించాడు.

పెహ్లూఖాన్‌పై అతని కుమారులపై గోరక్షకులు పేరిట జరిగిన మూకదాడి ఘటన మొత్తాన్ని వీడియో తీసి టీవీలలో ప్రదర్శించడం కూడా జరిగింది. మూకదాడిచేసి ఈ నీచమైన అకృత్యానికి ఆ గుంపు పాల్పడ్డారనే దానికి ఇదో సజీవ సాక్ష్యంగా అందుబాటులో ఉంది. అంతేగాక ఎన్డి టీవీ నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్ (రహస్య పద్ధతుల్లో విషయ సేకరణ) లో నిందితుల్లో ఒకరైన విపిన్ యాదవ్ మాట్లాడుతూ తాము ఏ విధంగా దాడిచేసి వారిని కొట్టిందీ వివరాలతో సహా బాహాటంగా చెప్పి ఉన్నాడు కూడా.

అయినప్పటికీ 'సందేహ లాభం' (బెనిఫిట్ ఆఫ్ డౌట్) క్రింద అడిషనల్ జిల్లా న్యాయమూర్తి నిందితులనందరిని నిర్దోషులుగా పేర్కొంటూ తీర్పునిచ్చారు. కొన్ని చట్టపరమైన కారణాల ప్రాతిపదికపై అంటూ న్యాయమూర్తి పెహ్లూఖాన్‌పై దాడి వీడియోను సాక్ష్యంగా పరిగణించజాలనని చాలా సులభంగా ఆ సాక్ష్యాన్ని నిరాకరించాడు. సంబంధిత ఘటనలను చిత్రీకరించిన వీడియోగ్రాఫర్ న్యాయస్థానం ఎదుట హాజరై తన సాక్ష్యాన్ని నమోదు చేయలేదనే హేతువిరుద్ధ తర్కంతో ఈ సాక్ష్యాన్ని పూర్తిగా కొట్టివేశారు.

ఇదేదో సాధారణంగా న్యాయప్రక్రియలో జరిగిన తప్పిదం మాత్రమే కాదు. మన దేశ పాలనా వ్యవస్థ న్యాయానికి గొంతునులిమి పాతర వేయడమే జరిగింది. దశాబ్దాల కాలంగా పాలకులు, పాలకవర్గాలు శాంతిభద్రతలను కాపాడేపేరిట, చట్ట-న్యాయపాలన సాగించే పేరిట న్యాయానికి పాతరవేసే ఈ ఆచరణను సాగిస్తూనే ఉన్నారు.

హిందూమతతత్వ ఆర్.ఎస్.ఎస్ దన్నుతో అధికారపగ్గాలు చేపట్టిన బిజెపి, కనీస పాటి ప్రజాస్వామిక భావనలను కూడా సహించకుండా, ఉద్దేశ్యపూరితంగా న్యాయానికి పాతరవేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

మాలెగావ్ బాంబుపేలుళ్లలో సంఝౌతా ఎక్స్‌ప్రెస్ వంటి అనేకమందిని హత్యగావించ బడిన ఘోరమైన కేసులలో హిందూ మతతత్వ టెర్రరిస్టులు ఏ విధంగా పాల్గొన్నారనేది, ఆ కేసులనుండి నిర్దోషులుగా ఏ విధంగా బయట పడ్డారనేది ఇప్పటికే రుజువైంది. దేశం మొత్తం దీనిని ఇప్పటికే వీక్షించింది కూడా.

గుజరాత్ ఎదురుకాల్పుల కేసులో నిందితుడైన బిజెపి అధ్యక్షుడు అమిత్‌షాపై కేసు ఏవిధంగా కొట్టివేయబడిందో, అతను మన దేశ హోంమంత్రిగా వుండటాన్ని కూడా మనం చూస్తున్నాం.

ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్ సంస్థల ఆవేశ పూరితమైన మతోన్మాదశక్తులు- ముస్లిములు, దళితులపై దేశవ్యాపితంగా ఏవిధంగా మూకదాడులకు పాల్పడి హింస-రక్తపాతాలకు పాల్పడుతున్నారో; వారందరిపై కేసు నమోదు కాకుండాను, నమోదైనా ఉపసంహరించుకునే విధంగానూ లేదా విచారణ జరిగినా నిందితులందరిపై కేసులను కొట్టివేసే విధంగానూ జరగడాన్ని మనం గమనిస్తూనే ఉన్నాం.

అధికారంలో ఉన్న, అధికారం కలిగిన సంపన్న పాలకవర్గాల రాజకీయనేతలు న్యాయాన్ని తమ చేతుల్లోకి తీసుకొని దానిని హత్యగావించే విధంగా మన పాలనావ్యవస్థ రూపొందించబడింది. న్యాయ వ్యవస్థ కూడా ఈ వ్యవస్థలో అంతర్భాగమే; దాని మనుగడ కోసం న్యాయ వ్యవస్థలు కూడా పాలకులపైనే ఆధారపడి ఉండాలి. పాలక ప్రభుత్వాల విధానాలు లేదా అభిమతాలకు భిన్నంగా ప్రజలకు పాలకులు గొప్పగా చెబుతున్న 'నిజమైన న్యాయాన్ని' అందించే విధంగా న్యాయవ్యవస్థ వ్యవహరించ జాలదు. దర్యాప్తు సంస్థలు, పోలీసులు, న్యాయవ్యవస్థలనేవి స్వతంత్రమైనవి కావు; పాలకవర్గాల, వారి ఏజెంట్ల ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వాల అదుపులోనే ఇవి ఉంటాయి. అందుకే అధికారంలోని పాలకుల కనుగుణంగా వీరు ఏదో ఒక సాకుతోనో లేదా మరో అంశాన్నో ఉపయోగించి మూకదాడులు వంటి నేరాలలో నిందితులైన వారిని సైతం శిక్షింపబడనీయకుండా కేసులనుండి తప్పిస్తున్నారు.

అంతేగాక న్యాయ పాలనాధికారులు, దర్యాప్తు అధికారులలో అత్యధికులంతా ఈనాడు దేశంలో దూకుడుగా విస్తృతంగా వున్న హిందూ మతతత్వ భావజాలం వైపు మొగ్గుజూపే వారిగా ఉన్నారు. మనదేశ న్యాయవ్యవస్థలో నెలకొన్న నిజమైన వాస్తవమైన కఠినమైన పరిస్థితులు ఈ విధంగా ఉన్నాయి

కనుక దోపిడీ పాలకవర్గాల, వారి ఆధిపత్యంలోని ప్రభుత్వాల అదుపులో ఉన్న పక్షపాత పూరితమైన న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడవలసిన బాధ్యత దేశంలోని ప్రజాస్వామ్యశక్తులపై ఉంది. ★

---

➡ సాగడానికి మన దేశంలోని పురుషాధిపత్య వ్యవస్థ కూడా అవకాశం కల్పిస్తోంది. మహిళలు ప్రత్యేకించి పేద మహిళలు, వారు ఈ వ్యవస్థ మార్పుకోసం పోరాడే స్థాయికి ఉద్యమాలను తీసుకురాకుంటే న్యాయాన్ని ఏ విధంగానూ పొందలేరు. మన రాజకీయ వ్యవస్థలోనే ఈ లొసుగుల కారణంగా, వాటిపైనే పోరాడాల్సిన అవసరం ఉంది. ప్రజా ఉద్యమం ద్వారానే ఇది సాధ్యమవుతుంది. అలాంటి ఓ లక్ష్యంతో ఆ విధమైన ఓ శక్తివంతమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ★


*Read !* *Subscribe!!*




*Organ of Central Committee of CPI (ML)*

*Read !* *Subscribe!!*




*Hindi Organ of Central Committee of CPI (ML)*

# అటవీ రక్షణముసుగులో ఆదివాసులపై గొడ్డలి వేటు

**ఇటీవలి** కాలంలో ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో మొత్తం పులుల సంఖ్యను విడుదల చేస్తూ పులుల రక్షితప్రాంతాలలో వన్యప్రాణులన్నీ సురక్షితంగానే ఉన్నాయని పేర్కొన్నాడు. వన్యప్రాణి సంరక్షణ, దేశంలో జీవవైవిధ్య పరిరక్షణ గురించి డిమాండ్ చేసే 'నిపుణులు' లేదా 'కార్యకర్తలు' ఈ సమాచారంతో చాలా సంతోషించారు. అయితే ఈ నిపుణులు లేదా కార్యకర్తలు అటవీ పరిరక్షణ పేరుతో జరుగుతున్న మానవ ప్రాణాల మనుగడకు సంబంధించిన విషాదాన్ని పరిగణలోకి తీసుకోవటానికే నిరాకరిస్తున్నారు.

మనదేశంలో 1,60,276 చ॥కి॥మీల వైశాల్యంలో వన్యమృగ సంరక్షణ కేంద్రాలు లేదా జాతీయ ఉద్యానవనాలు విస్తరించి వున్నాయి. రక్షిత ప్రాంతాలుగా అడవులు గుర్తించబడక మునుపే అడవులలోనే నివసిస్తూ, ఈ అడవులపై ఆధారపడి జీవనం సాగించే ఆదివాసీ ప్రజానీకం అక్కడ ఉన్నారు. ఈనాడు అటవీ సంరక్షణ పేరుతో అనాదిగా అడవినే నమ్ముకుని బతుకుతున్న అమాయక ఆదివాసీలను ఆక్రమణదారులంటూ అడవుల నుండి తరిమివేస్తూ చట్టవిరుద్ధంగా అడవులలో నివసిస్తున్నారని, ఆక్రమణదారులని వారిపై నేరారోపణ చేస్తున్నారు. అడవులలో నివసించే అమాయకప్రజల, ఆదివాసుల ప్రాణాలను బలిపెడుతూ ప్రభుత్వాలు రక్షిత అడవులుగా పేర్కొనే వాటిని సృష్టిస్తూ ఆదివాసుల ఉనికిని గుర్తించ నిరాకరిస్తున్నాయి.

ఒక అధ్యయనం ప్రకారం ప్రపంచ వ్యాపితంగా ఈ విధంగా కృత్రిమంగా రక్షిత అడవులు, అభయారణ్యాలు, ఉద్యానవనాల పేరిట అడవులను ఆక్రమించిన ఫలితంగా దాదాపు రెండు కోట్ల నుండి ఐదు కోట్ల మంది వరకు అటవీ ప్రజానీకం నిర్వాసితులుగా మారిపోయారు.

మనదేశంలో పులుల సంరక్షణ కేంద్రాలు, రక్షిత అడవులు పేరున అనేక ఆదిమ తెగల ప్రజానీకాన్ని వారి ఆవాసాల నుండి తొలగించి వారి జీవనాధారాలను ధ్వంసం చేశారు. ప్రభుత్వం ఈ విధంగా మట్టుబెట్ట బూనుకున్న ఆదివాసీ తెగలలో సోలిగాస్ అనేది ఒక తెగ. వీరిని బలవంతంగా అడవుల నుండి గెంటి వేసేందుకు, భారతదేశంలోని ఇతర పౌరులు అనుభవించే హక్కులను గుర్తించకుండా వీరిని రెండవ శ్రేణి పౌరులుగా పరిగణిస్తున్నారు.

కర్ణాటక రాష్ట్రం చామరాజనగర్ తహశీల్ పరిధిలోని కొల్లీగల్ అటవీప్రాంతం సోలిగాస్ యొక్క సహజసిద్ధ నివాస ప్రాంతంగా వుంది. ఈనాటి సోలిగాస్ యొక్క పూర్వీకులు ఈ అటవీ ప్రాంతాలలో స్వేచ్ఛగా సంచరిస్తూ జీవనం సాగించినవాళ్లే. పోడు వ్యవసాయం చేస్తూ అటవీ ప్రాంతాలలో సాగుచేస్తూ వారు జీవనం సాగించారు. ఈ పోడు వ్యవసాయం అటవీ ప్రాంతాల్లో ఆదివాసులు ఒక్కోచోట ఒక్కో విధంగా నిర్వహిస్తారు. ఆహారం కోసం వారు చిన్న జంతువులను వేటాడటంపై ఆధార పడతారు. తేనె, చింతపండు, వివిధ రకాల పండ్లు వంటి వివిధ అటవీ ఉత్పత్తులను సేకరించి వాటిని సమీప సంతలకు తీసుకెళ్లి అమ్ముకొని వారు జీవనం సాగించేవారు.

1974లో ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం పులులు, ఏనుగులు, దున్నపోతులకు ప్రసిద్ధి చెందిన ప్రాంతంగా గుర్తించి, బలిగిరి రంగనాథ స్వామి టెంపుల్ (బిఆర్‌టి) పులుల సంరక్షణా కేంద్రంగా ప్రకటించింది. దీనితో అటవీ ప్రాంతంలో ఆదివాసులు తమ ఆహారం కోసం సాగించే కొద్దిపాటి వేటను నిషేధించారు. అదేవిధంగా పోడు వ్యవసాయాన్ని ఆపివేయాలని ఆదేశించారు. మరొకవైపున అటవీ ఉత్పత్తులను సేకరించుకొని అమ్ముకొనటాన్ని కూడా నిలిపి వేశారు. ఈ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలోని అనేకమందిని బలవంతంగా తొలగించారు; వారి జీవనాధారాలు నాశనంచేశారు; వారి స్వేచ్ఛను పూర్తిగా హరించారు. అప్పటివరకు వారి ఆవాసాలుగా నున్నవే, వారు ప్రవేశించ వీలులేని నిషిద్ధ ప్రాంతాలుగా మార్చారు. తమ అడవితల్లిపై హక్కుకోసం రెండవశ్రేణి పౌరులుగా వారు ఆందోళన చేస్తున్నారు.

ప్రస్తుతం ఈ ఆదివాసీలను తరలించి ఉంచే ప్రదేశాలలో నీరు, విద్యుత్తు, ఆరోగ్యరక్షణ, బిడ్డల రక్షణ, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు, సౌకర్యాలన్నింటికి అనుమతులు తీసుకోవాలి. అధికారుల విచక్షణాధికారంపై ఆధారపడి ఈ అనుమతులు ఉంటాయి. ఎక్కడికైనా వెళ్లాలంటే కచ్చారోడ్‌లను ఉపయోగించాలి. అలాగే బయటకు వెళ్లిన వారు సాయంత్రం ఆరుకల్లా తిరిగి ఆవాసాలకు చేరుకోవాల్సి ఉంటుంది.

ఈ ఆవాసాలను వదిలి వెళ్లేందుకు అంగీకరించవలసిందిగా అటవీశాఖ అధికారులు వీరిపై వత్తిడి చేస్తున్నారు. గతంలో కూడా జేనుకుర్బాలనబడే ఆదివాసీల తెగవారిని కూడా బందీపూర్ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలో నుండి బలవంతంగా గెంటివేశారు. వీరందరినీ పాకలలో నివాసముంచి, వీరికి సాగు చేయబడని బీడు భూములను అప్పగించారు. వీరంతా అటవీ శైలి జీవితాన్ని పూర్తిగా కోల్పోయి, సేవకులుగా రోజువారీ కూలీలుగా మారాల్సి వచ్చింది. జేనుకుర్బాల విషాద పరిస్థితిని దృష్టిలో పెట్టుకునే సోలిగాస్‌వారి ఆవాసాలను విడిచి వెళ్ళేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించటంలేదు. సమాన పౌరులుగా తమనూ పరిగణించాలని వీరు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. రోడ్లు, విద్యుత్తు, పాఠశాల, ఆసుపత్రి అలాగే అటవీ హక్కులచట్టం – 2006 ద్వారా సంక్రమించిన హక్కులను డిమాండ్ చేస్తున్నారు.

దేశవ్యాపిత పులుల గణాంకాలను దేశ ప్రధాని వెల్లడిచేసిన రోజునే భారతదేశంలో పులుల సంరక్షణ కేంద్రాల సమర్థ యాజమాన్య మూల్యాంకనము గురించిన మరో నివేదిక కూడా వెల్లడైంది. ఈ నివేదికలో సోలిగాస్ యొక్క డిమాండ్లు రిజర్వు అటవీశాఖ అధికారులకు నిరంతర తలనొప్పిగా మారాయి అని పేర్కొన్నారు. దీనితో తమ ఆర్థికపరమైన, భౌతికపరమైన హక్కులకు శాశ్వతమైన బలమైన ముప్పు ముంచుకొస్తుందని సోలిగాస్‌కు అర్థమైంది. ప్రభుత్వం మరియు కొన్ని వన్యప్రాణి బృందాలు ఈ విధమైన ఆదివాసి వ్యతిరేక దృక్పథంతో ఆదివాసీలను ఆవాసాల నుండి తొలగించాలని కోరుకుంటున్నారు. భారతదేశ జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలనే పేరుతో భారతదేశంలో నివసిస్తున్న కోట్లాది మంది నిరుపేదలైన అమాయక ఆదివాసీలను వారి సహజసిద్ధ ఆవాసాల నుండి నిర్దాక్షిణ్యంగా తొలగింప జూస్తున్నారు.

అయితే ఈ అధికారులు, పరిరక్షణా బృందాలు అటవీ ప్రాంతాల్లో స్వేచ్ఛగా విచ్చలవిడిగా వ్యాపార దృష్టితో సాగుతున్న గనుల తవ్వకాన్ని, ఇతర మౌలికరంగ పరిశ్రమల ఏర్పాటును ఏనాడూ అభ్యంతరపెట్టలేదు. బ్రెజిల్‌లో అమెజాన్ అడవులలోని విశాల అటవీ

**(తరువాయి 22వ పేజీలో)**

# ఆధునిక రూపంలో బాలల వెట్టిచాకిరి

**డెబ్బైమూడేళ్ల** స్వాతంత్ర్య పాలన అనంతరం కూడా దేశ ప్రజల జీవితాలు మెరుగు పడకపోగా రోజురోజుకి మరింతగా దిగజారుతున్నాయి. దేశం పెద్ద అంగలేసుకుంటూ అభివృద్ధి పథంలో దూసుకు వెళ్తున్నదని పాలకులు, పాలకవర్గాలు గంభీర ప్రకటనలు చేస్తూ వస్తున్నారు. కానీ ఈ ప్రకటనలు - ప్రజల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రజల్లో పెరుగుతున్న అశాంతి, దుర్భర దౌర్భాగ్య పరిస్థితులను మరుగు పరచలేకున్నాయి. వరుసగా అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలు వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభం లోకి నెట్టివేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, దుర్భర జీవన పరిస్థితుల నడుమ ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. ఘనంగా పేర్కొన బడుతున్న ఉపాధి హామీ పథకం (నరేగా) తోసహా ఏ ఒక్క ప్రభుత్వ పథకం కూడా దీనస్థితిలో ఉన్న గ్రామీణ కుటుంబాలకు ఎలాంటి ఉపశమనాన్ని కల్పించడం లేదు.

బతుకుతెరువు కొరకు సుదూర ప్రాంతాలకు వెళ్ళి, అక్కడ అనాథలుగా జీవితాలు గడపడంతో పాటు గ్రామీణ పేదలు తమ పిల్లలను వెట్టిచాకిరి చేయించేందుకు తాకట్టుపెట్టే దుస్థితికి దిగజారు తున్నారు. పిల్లలనుభవిస్తున్న కటిక దారిద్ర్యమే ఆ తల్లిదండ్రులను అలాంటి చర్యలకు పురిగొల్పుతోంది.

ఈ విధంగా పిల్లలను తాకట్టుపెట్టు కుంటున్న ఘటనలు రాజస్థాన్‌లోని బాన్సువారా, ప్రతాప్ ఘర్ జిల్లాలో వెలుగులోకి వచ్చాయి.

వెట్టిచాకిరీ చేయించుకోవటానికి పిల్లలను తాకట్టు పెట్టుకుంటున్న విధానాన్ని పూర్వ హోంమంత్రిగా పనిచేసిన బిజెపికి చెందిన కిశోరీలాల్ మీనా ఇటీవల రాజ్యసభలో లేవనెత్తాడు.

గడేరియాలకీ, సంచార జాతుల వారికీ పెద్ద పెద్ద గొర్రెల మందలు ఉంటాయి. గొర్రెలు కాయటానికి ఈ గడేరియాలు అలాగే ఇతర గొర్రెలకాపర్లు పిల్లలను తాకట్టు వెట్టికి కుదుర్చు కుంటారు. ఈ గొర్రెలకాపరులు రాజస్థాన్‌లోని నైరుతి ప్రాంతానికి చెందినవారు. వెట్టిపై తీసుకొచ్చిన ఈ పిల్లలను వీరు పశ్చిమ మధ్యప్రదేశ్, ఉత్తర గుజరాత్ ప్రాంతాలకు తీసుకువెళుతుంటారు. ఆ పశువులను కాసే పని ఆ పిల్లలకు అప్పగిస్తారు. వీరికి మూడు పూటలా తిండికూడా అంతంత మాత్రంగానే పెడతారు. కొన్ని సందర్భాల్లో ఈ గొర్రెల కాపరులు తిరిగి ఈ పిల్లలను రోడ్ల వెంబడిఉండే హోటళ్ళ యజమానులకు, హోటల్‌లో పనులు చేయటానికి అమ్మివేస్తుంటారు.

ఈ విధంగా అమ్ముడుపోయిన పిల్లల జీవితాలు దుర్భరంగా ఉంటాయి. కనీస దుస్తులు ఇవ్వరు. నెలల తరబడి ఒంటిపై ఉన్న జతను మార్చుకునే అవకాశం ఉండదు. కాళ్లకు చెప్పులు లేకుండా అనేక మైళ్ళ దూరం నడవడంవల్ల అరికాళ్లు బొబ్బలెక్కుతాయి. రాత్రిపూట నాలుగైదు గంటలు మాత్రమే వీరికి నిద్రపోవటానికి అవకాశమిస్తారు. తరచుగా గొర్రెల కాపరుల కుటుంబ సభ్యులు చిన్న చిన్న విషయాలకు కూడా పిల్లలను కొడుతుంటారు. ఈ పిల్లలు తిరిగి తమ తల్లిదండ్రులవద్దకు చేరుకుంటారనే గ్యారెంటీ లేదు.

ఈ గొర్రెలకాపరులు భిల్ అనే గిరిజన తెగకు చెందిన పిల్లలను వెట్టికి కుదుర్చు కోవడానికి ఇష్టపడతారు. ఎందుకంటే ఈ పిల్లలు చౌకగా లభిస్తారు. తక్కువగా తింటారు, కష్టపడి పనిచేస్తారు. చెప్పిన మాటల్ని వినే స్వభావం ఉన్నవాళ్ళయినందున వీరిని తమ చెప్పుచేతల్లో పెట్టుకోవడం సులభంగా వుంటుందని యజమానులు భావిస్తారు.

ఇక తల్లిదండ్రులవైపు నుండి చూస్తే వారికే చెయ్యటానికి పనులు ఉండవు. బిడ్డలను అమ్ముకోవడం తప్ప గత్యంతరం లేని స్థితిలోకి వారు నెట్టబడ్డారు. అందుకే వారు విధిలేక తమ మైనర్ కుమారులను వెట్టిచాకిరీ చేసేందుకు అమ్ముకుంటున్నారు.

మైనర్ బాలల ఈ ఆధునిక బానిసత్వం గురించి వెల్లడైనప్పుడు పాలనా యంత్రాంగం మాత్రం వారికి అప్పుడే మొదటిసారి తెలిసినట్లు, పిల్లలను అమ్ముకుంటున్నారని మొదటిసారిగా వింటున్నట్టు నటిస్తారు.

అన్నిచోట్ల ఇదే రూపంలో లేనప్పటికీ ఇతర రాష్ట్రాలలోని ప్రజలు సైతం వేర్వేరు రూపాల్లో తమ పిల్లలను వెట్టిలో వుంచే పరిస్థితులున్నాయి. ఒరిస్సా రాష్ట్రంలో పేదకుటుంబాలలోని సభ్యు లందరూ ఇటుకబట్టీలలో పనిచేయడానికి (వెట్టి చేయడానికి) కుదుర్చుకుంటున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాలలోని 14 - 16 సంవత్సరాల మధ్య వయస్కులైన బాలికలు సుదూరప్రాంతాల్లోని జనపనార మిల్లుల్లో, బట్టల మిల్లులలో పనిచేయాలని వెట్టిపై పంపబడు తున్నారు.

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక గాజుల పరిశ్రమలో అనేక మంది పిల్లలు వెట్టి కార్మికులుగా ఉన్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరీ మరియు ఇతర పరిశ్రమల్లో అనేకమంది పిల్లలు వెట్టి చాకిరీ చేస్తున్నారు.

అలాగే పెద్ద సంఖ్యలో మైకా గనులు మరియు రాళ్ల క్వారీలలో పిల్లలు వెట్టిచాకిరికి కట్టివేయబతున్నారు.

కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న కుటుంబాలకోసం తమ ఇల్లు గడవడానికి తమ పిల్లలను తాకట్టు పెట్టడంతప్ప మరోమార్గం కానని దుస్థితిలో ఉన్నారనేది ఎవరు కాదనలేని వాస్తవం.

మనదేశంలో ఉన్న అర్ధభూస్వామ్య వ్యవస్థకు వారసత్వంగా వచ్చిన ఒక లక్షణం ఈ వెట్టిచాకిరీ విధానం. నయా ప్రపంచీకరణ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఆధునికత ఈ అర్ధభూస్వామ్య విధానంతో జత కలిసింది. భూస్వామ్య వ్యవస్థలో ఉండే ఇలాంటి హేయమైన విధానాలపై ఆధారపడి ప్రపంచంలో పెట్టుబడి అత్యధిక లాభాలను గడిస్తూ సంపదలను పోగేసుకుంటోంది.

మనుషులను అందులోనూ పసిపిల్లలను బానిసలుగా కట్టిపడేసే ఈ విధానానికి ముగింపు పలకాలంటే, దీర్ఘకాలికంగా నిస్తేజంగా ఉన్న ప్రజానీకం తమ జీవన స్థితిగతులను మెరుగు పరుచుకోవాలంటే శక్తివంతమైన ప్రజా ఉద్యమం యొక్క అవసరాన్ని ఈ నీచ, నికృష్ట పరిస్థితులు తెలియజేస్తున్నాయి. ★

**“విప్లవ సిద్ధాంతం లేనిదే విప్లవోద్యమం లేదు. అవకాశవాదాన్ని ఆకర్షవంతంగా బోధిస్తూ ఆచరణ విషయంలో అతి సంకుచితమైన రూపాలను అమలుజరుపుతున్న సమయంలో యీ విషయాల్ని చాల గట్టిగా నొక్కి చెప్పవలసిన అవసరం వుంది”**

**- లెనిన్**

# ఆర్డినెన్సు ఫ్యాక్టరీ కార్మికుల ముప్పయిరోజుల సమ్మె

**బిజెపి** ప్రభుత్వం, ప్రధానమంత్రి మోడీ జాతీయవాదం గురించి దేశరక్షణ గురించి పెద్దపెద్ద మాటలు మాట్లాడతారు. కాని వారు ఆయుధాలు తయారుచేసే ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డును కార్పొరేట్ సంస్థగా మార్చాలని నిర్ణయించారు. తద్వారా దేశరక్షణను కూడా విదేశీ మరియు వారితో జతకట్టిన స్వదేశీ బడాపెట్టుబడిదారుల లాభార్జనకు సాధనంగా మార్చారు.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డుకు స్వేచ్ఛనివ్వడానికి, ఉత్పాదకత పెంపుకు, తన ఉత్పత్తుల ఎగుమతులను పెంచడానికి సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో స్వతంత్రత కల్పించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత ప్రభుత్వం చెబుతోంది. భారత సైనికుల భవిష్యత్ ఆయుధ అవసరాలను త్వరితంగా పూర్తి చేసేందుకు, దాని ఉత్పత్తుల ఎగుమతుల పెంపుకు ప్రోత్సహించుటకు ఉత్తేజాన్ని పొందే విధంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను బలోపేతం చేయడానికే ఈ నిర్ణయం చేశామని ప్రభుత్వం వాదిస్తుంది. అయితే ప్రస్తుతం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలకు స్వేచ్ఛగా వ్యవహరించడానికి, స్వతంత్ర నిర్ణయాలు చేయడానికి, ఉత్పాదకత పెంచడానికి వున్న ఆటంకాలు ఏమిటో, ఆ ఆటంకాలను కార్పోరేటీకరణ ఎలా తొలగిస్తుందో ప్రభుత్వంనుండి వివరణ లేదు. వాస్తవానికి దేశరక్షణ, దేశ భద్రతలపై విదేశీ పెట్టుబడి, దానితో జతకడుతున్న భారతీయ పెట్టుబడియొక్క పట్టు మరింత పెరుగుతుంది.

మనదేశంలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డు ఆధ్వర్యములో 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు వున్నాయి. అందులో 82,000 మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీలు భారతీయ సైనిక, నావికా, వైమానిక దళాలకు అవసరమైన ఆయుధాలను, యుద్ధ ట్యాంకులను, తుపాకులను, యితర రక్షణ పరికరాలను ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు రక్షణరంగంలో నాలుగవ దళంగా పరిగణించ బడుతున్నాయి. ఈ ఫ్యాక్టరీలోని కార్మికులు, ఉద్యోగులు కష్టపడి పనిచేస్తూ దేశానికి అవసరమైన ఆయుధాలను, రక్షణ సామాగ్రిని ఉత్పత్తి చేస్తున్నారు.

వచ్చిన రక్షణ మంత్రులు, ప్రధాన మంత్రులు అందరూ రక్షణరంగం, ఆర్డినెన్స్ సంస్థలను ప్రైవేటీకరణ చేసే ప్రసక్తేలేదని పైకి చెబుతూనే, నాడు ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేశారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ప్రైవేటీకరించాలని కఠోర నిర్ణయాన్ని తీసుకుంది. ఈ నిర్ణయంవల్ల వీటికి ఆటోమేటిక్‌గా బియస్‌యన్‌యల్‌లాంటి ప్రభుత్వరంగ సంస్థలకు పట్టిన గతే పడుతుంది. పైగా వీటిని బడాపెట్టుబడిదార్ల నియంత్రణలోకి పంపడమంటే మనదేశ రక్షణను భారత కార్పొరేట్లకు సామ్రాజ్యవాదుల బహుళజాతి సంస్థల చేతులకు అప్పగించడమే అవుతుంది. అందుకే ఇది అత్యంత ప్రమాదకర నిర్ణయం.

మనదేశ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ప్రైవేటీకరణ చేసే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 41 ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న 82,000 మంది కార్మికులు, ఉద్యోగులు 2019 ఆగస్టు 21 నుండి 30 రోజుల నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఏఐటియుసి, సిఐటియు, ఏఐఎఫ్‌టియు(న్యూ) లాంటి కేంద్ర కార్మిక సంఘాలు ఈ సమ్మెకు మద్దతును సంఘీభావాన్ని ప్రకటించాయి. ఈ 30 రోజుల సమ్మెకు గుర్తింపుపొందిన మూడు డిఫెన్స్ ఫెడరేషన్‌లు పిలుపునిచ్చాయి. రక్షణ సంఘాల కన్ఫెడరేషన్ సమ్మె నోటీసు యివ్వనప్పటికీ అది కూడా ఈ నిరవధిక సమ్మెకు మద్దతునిచ్చింది. గ్రూపు-ఎ, అధికారులను, అత్యవసర శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను సమ్మెనుండి మినహాయించారు. అయినప్పటికీ వారు కూడా విధులకు హాజరవుతూనే హాజరు పట్టీలో వారు సంతకాలు చేయకుండా ఈ సమ్మెకు తమ సంఘీభావాన్ని తెలియజేస్తున్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల ప్రైవేటీకరణపట్ల తమ నిరసనను ఆవిధంగా తెలియజేస్తున్నారు. ★

---

**(20వ పేజీ తరువాయి)**

ప్రాంతాలను వ్యాపార ప్రయోజనాలకు ఉపయోగించజూసే ప్రయత్నాలను 400 ఆదిమజాతి సమూహాలు నిరోధించాయనేది జగమెరిగిన సత్యం. అయితే మనదేశంలో ప్రభుత్వమే వ్యాపార ప్రయోజనాలకు అడవులను కట్టబెట్టుతూ అనుమతుల నిస్తోంది. వారు అడవులను విచ్చలవిడిగా నరికివేస్తున్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో అడవుల నరికివేత గురించి ప్రభుత్వంవద్దకు వచ్చిన ప్రతిపాదనలలో 90 శాతం ఆమోదంపొందాయని గణాంకాలు చెబుతున్నాయి. మరోవైపున జాతీయ గనుల అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఎండిసి) ప్రభుత్వానికి బహుళజాతి కంపెనీలకు మధ్య వారిధిగా వ్యవహరిస్తూ ఆ కంపెనీలకు చట్టబద్ధ అనుమతులు సులభంగా వచ్చేందుకు మార్గాన్ని సుగమంచేస్తోంది. అదే సమయంలో తరతరాలుగా ఆదివాసీలు నివసిస్తున్న వారి భూములలో ఉండేందుకు మాత్రం వారికి అనుమతి నిరాకరిస్తోంది. అటవీపరిరక్షణ, జీవన వైవిధ్యాన్ని పరిరక్షించటం వంటి బడాయి మాటల మాటున వంచన ఇలాఉంది.

వరుసగా పాలన సాగిస్తున్న పాలకులు, అడవులను పరిరక్షించే పేరున ఆదివాసీలను అడవులనుండి ఖాళీ చేయించేందుకు ప్రస్తుతం వన్యప్రాణిరక్షణ బృందాలు తమ శక్తియుక్తులతో సుప్రీంకోర్టులో వాదనలు చేస్తున్నాయి. 18 లక్షల మంది ఆదివాసులను తొలగించడంపై సుప్రీమ్ కోర్టు విధించిన స్టేను రద్దు చేయించాలని చూస్తున్నారు.

ఆదివాసి ప్రజలకు వ్యతిరేకంగా సమాజంలో నాగరిక విభాగాలుగా చెప్పబడుతున్న వారి అనాగరికత్వం తీవ్రంగా ఖండించదగినది. ఆదివాసీల అటవీహక్కు అన్ని విధాల పరిరక్షించబడాలి. దేశంలోని యావత్తు ప్రజాస్వామికవాదుల డిమాండ్ అదే కావాలి. ★

---

**"అన్ని ఒంటెత్తు భావాలూ స్వీయాత్మకమైనవీ, విప్లవంయొక్క నిజఅవసరాలకు అననుకూలమైనవీనూ. కాబట్టి ఒంటెత్తు పోకడల వ్యతిరేకపోరాటం, స్వీయాత్మక ధోరణుల వ్యతిరేక పోరాటాలు ఒకేసారి నిర్వహించబడాలి"**

**- మావో**

# గుజరాత్ | ఆందోళనా పథంలో ఫోర్డు కార్మికులు

**2019** జూన్ 19వ తేదీని గుజరాత్ రాష్ట్రం-సనంద్‌లోని ఫోర్డు కంపెనీలో పనిచేసే కార్మికుడిని విధులనుండి తొలగించారు. గత సంవత్సరం 'ఫోర్డు ఇండియా' కార్మికులు 'కర్మావతి కామ్‌దార్ ఏక్‌తా సంఘ్'(కెకెఇఎస్) అనే పేరిట ఓ సంస్థను ఏర్పరచుకున్నారు. తమ కార్మికుల డిమాండ్ల వరకే పరిమితమై ఈ సంస్థ పనిచేస్తుంది. ఇందులో 900 మంది సభ్యులున్నారు. ప్రస్తుతం తొలగించబడిన కార్మికుడు ఈ సంస్థలో సభ్యుడిగా వున్నాడు. తనను తొలగించటానికి ఏవిధమైన చట్టబద్ధమైన సాక్ష్యాలు లేవని ఆ కార్మికుడు చెబుతున్నాడు.

కాగా జూన్ 21వ తేదీన కార్మికుని తొలగింపును నిరసిస్తూ వేలాది మంది కార్మికులు తరలివచ్చి నిరవధిక సమ్మె చేపట్టారు. తొలగించిన కార్మికుడిని తక్షణం విధులలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జూన్ 21 నుండి 27వ తేదీ వరకు 900 మంది కార్మికులు విధులు బహిష్కరించారు.

1. కెకెఇయస్ సంస్థాగత కార్మికుల పట్ల కంపెనీ యాజమాన్యపు కుట్రపూరిత చర్యలు మానుకోవాలని, తొలగించిన కార్మికుని వెంటనే చేర్చుకోవాలని వారంతా ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. 2. ఫోర్డు మోటార్స్ యాజమాన్యం విధులకు గైర్హాజరైన రోజులకు కూడా పూర్తి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉద్యమంయొక్క ఒత్తిడి ఫలితంగా చివరకి ఫోర్డు యాజమాన్యం ఈ కేసును పారిశ్రామిక ట్రిబ్యునల్‌కు పంపింది. 'ఈ ముహుర్త్' కరస్పాండెంట్‌తో కెకెఇఎస్ సభ్యులొకరు మాట్లాడుతూ తొలగించిన కార్మికుని తిరిగి తీసుకోవటం తమ ప్రథమ డిమాండ్ అని, విధులు బహిష్కరించిన కాలానికి కార్మికులందరికీ పూర్తి వేతనాలు చెల్లించాలనేది తమ ద్వితీయ ప్రాధాన్య డిమాండ్‌గా పేర్కొన్నాడు. ఫోర్డు మోటార్స్ యాజమాన్యం తొలగించిన కార్మికుని తిరిగి తీసుకోనట్లయితే, ఈ సంస్థలోని మిగిలిన సభ్యులంతా మరోసారి విధులు బహిష్కరించటానికి సిద్ధంగా వున్నారు.

ఈ డిమాండ్‌పై పోరాడుతున్న కార్మికులు నిరాహారదీక్షలు చేపట్టారు. తమ వేతనాల పెంపును వారు డిమాండ్ చేశారు. ఫిబ్రవరి నెలలో యాజమాన్యం తమకు అందించే ఆహారం, పానీయాలను 3 నెలలపాటు సామూహికంగా బహిష్కరించారు. ఆటోమొబైల్ పరిశ్రమలో పనిచేసే కార్మికుల సగటు వేతనంకంటే సనంద్‌లో పనిచేసే కార్మికులు తక్కువ పొందుతున్నారు. (సగటున నెలసరి ఆదాయం దాదాపు పదివేల రూ॥మాత్రమే) వీరిలో కొందరికి 9-10 సం॥ల పని అనుభవం కూడా వుంది. అయితే వేతనాలు ఆ స్థాయిలో పెరగటంలేదు. మరోవైపున చెన్నై ఫోర్డు కార్మికుల అదేపనిచేస్తున్న గుజరాత్ కార్మికుల కంటే అధిక వేతనం పొందుతున్నారు. తమలో ప్రోదిపడిన ఈ చైతన్యాన్ని నిరోధించి, నాశనం గావించేందుకు ఫోర్డు యాజమాన్యం చేస్తున్న కుట్రలను కార్మికులు తీవ్రంగా నిరసించారు. ✱

## తెలంగాణ ఆర్‌టిసి కార్మికుల సమ్మెను వెంటనే పరిష్కరించాలి

**అక్టోబరు** 5వ తేదీనుండి తెలంగాణా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి) కార్మికులు తమ డిమాండ్ల సాధనకై సమ్మె జరుపుతున్నా, తెలంగాణా రాష్ట్రప్రభుత్వం ఆ సమ్మెపట్ల మొండివైఖరిని ప్రదర్శించటాన్ని "జనశక్తి" తీవ్రంగా ఖండిస్తోంది. హైకోర్టు కార్మికులకు జీతాలు చెల్లించాలని నిర్దేశించినప్పటికీ, ఆ తీర్పు అమలును ఓడించటంకోసం-కార్మికుల జీతాలు చెల్లించటానికి సంస్థ వద్ద నిధులు లేవు అంటూ ఆర్‌టిసి యాజమాన్యం కోర్టుకు చెప్పిన తీరు ఆర్టీసీ యాజమాన్యమూ-దాన్ని నిర్దేశిస్తున్న తెలంగాణా ప్రభుత్వము సమ్మెపై ఎంతటి దారుణంగా కక్షగట్టారో తేటతెల్లం చోస్తోంది. ప్రభుత్వ-ఆర్టీసీ యాజమాన్యపు యీ కక్ష సాధింపు చర్యను "జనశక్తి" ఖండిస్తోంది. ఆర్టీసి కార్మికుల సమ్మెపై తెలంగాణా రాష్ట్రప్రభుత్వం సాగిస్తున్న వివిధ రకాల అణచివేత చర్యలను 'జనశక్తి' ఖండిస్తోంది. పంతాలూ, పట్టుదల, మొండితనాలను వీడి తెలంగాణా ప్రభుత్వం ఆర్టీసీ యాజమాన్యం సమ్మెను సత్వరమే పరిష్కరించాల్సిందిగా 'జనశక్తి' డిమాండు చేస్తోంది.

**"మన పనియొక్క ప్రాతిపదికా, ప్రధానవస్తువు ప్రజల రాజకీయ చైతన్యాన్ని అభివృద్ధిచేయడం. కానీ, యీ సాధారణ, నిత్య, మౌలిక కర్తవ్యంతోపాటే, రష్యాలో యిప్పుడున్నట్టి కాలం యితర నిర్దిష్ట, ప్రత్యేక కర్తవ్యాలను విధిస్తుంది. శాశ్వత కర్తవ్యాలకు అర్ధంలేని ప్రస్తావనలు చేయడంద్వారా ప్రస్తుత ప్రత్యేక కర్తవ్యాలను మనం తప్పించుకోవద్దు"**

**- లెనిన్**

Janasakti (Communist Revolutionaries'Fortnightly) RNI No.8315/63 VJ-077/2019-21
No.of pages : 24 Date of publication : 3rd & 18th of Every Month Posting date : 5th & 20th of Every Month

# 'ప్రస్తుత వ్యవస్థను మార్చటానికి పోరాడుతున్న శక్తులు-ఎదుర్కొంటున్న సవాళ్ళు' అంశంపై సిపిఐ(ఎం-ఎల్) పశ్చిమబెంగాల్ రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో సెమినార్

**సిపిఐ(ఎం-ఎల్)** పశ్చిమబెంగాల్ రాష్ట్రకమిటి ఆధ్వర్యంలో 'ప్రస్తుత వ్యవస్థను మార్చటానికి పోరాడుతున్న శక్తులు - ఎదుర్కొంటున్న సవాళ్ళు' అంశంపై 2019 జులై 20, 21 తేదీలలో రాష్ట్ర సెమినార్ జరిగింది. సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి పిలుపుమేరకు, కేంద్రకమిటి రూపొందించిన కీనోట్ ఆధారంగా కోల్‌కతాలోని 'బరాసత్ తితుమిర్ సభాగృహ'లో రెండురోజులు ఈ సదస్సు జరిగింది. రాష్ట్రంలోని కమ్యూనిస్టు విప్లవకారులు, వామపక్షవాదులందరినీ ఈ సెమినార్‌లో పాల్గొనవలసిందిగా ఆహ్వానించారు. సిపిఐ(ఎం-ఎల్)తోబాటుగా ఈ సెమినార్‌లో సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎం-ఎల్) రెడ్‌స్టార్, పిసిసి, సిపిఐ(ఎం-ఎల్), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ భారత్, ఆర్ఎస్‌పి, ఆర్ఎస్‌పిఐ, చేతన మరియు నవంబర్ విప్లవ శతవార్షిక కమిటీలు ఈ సెమినార్‌కు హాజరయ్యాయి. మజ్దూరు క్రాంతి పరిషత్ నుండి ఓ ప్రతినిధి పరిశీలకునిగా మాత్రమే హాజరయ్యారు.

ఈ సెమినార్ నిర్వహణకు కామ్రేడ్ అలోక్ ముఖర్జీని ఎన్నుకొన్నారు. తొలుత విప్లవోద్యమ కృషిలో అమరులైన వారందరికీ జోహార్లర్పించారు. కాIIబసు విప్లవ గీతాలాలపించారు.

సిపిఐ(ఎం-ఎల్) పశ్చిమబెంగాల్ రాష్ట్రకమిటి కార్యదర్శి కాIIసుబోధ్‌మిత్ర సెమినార్ ప్రతినిధులను ఆహ్వానిస్తూ స్వాగతోపన్యాసం చేశారు. కేంద్రకమిటి రూపొందించిన కీనోట్‌ను బసు ఆచార్య ప్రతినిధులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం సెమినార్‌కు హాజరైన వివిధ సంస్థల నేతలు తమతమ అభిప్రాయాలను సెమినార్ ముందుంచారు. ఈ క్రమంలో సిపిఐ నాయకుడు కళ్యాణ్ బంధోపాధ్యాయ, సిపిఐ(ఎం) నాయకులు కల్లోల్ మజుందార్, సిపిఐ(ఎం-ఎల్) రెడ్‌స్టార్ నాయకులు ప్రదీప్‌సింగ్ ఠాకూర్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ భారత్ ప్రతినిధులనుండి కాIIగోలామ్ గజి, పిసిసిసిపిఐ(ఎం-ఎల్) నాయకుడు కాIIతపన్‌నాగ్, ఆర్ఎస్‌పి నాయకుడు కాIIఅశోక్ ఘోష్, 'చేతన' సంస్థ నాయకుడు కాIIదేబషిష్ దత్తా, 'నవంబర్ విప్లవ శతవార్షిక కమిటీ' ప్రతినిధి కాIIసురేష్ బైనేలు ఈ సెమినార్‌లో పాల్గొని ప్రసంగించారు. తమ అభిప్రాయాలను వెల్లడించారు.

మరునాటి ప్రారంభ సెషన్‌లో వివిధ సంస్థల నాయకులు వ్యక్తంచేసిన అభిప్రాయాలపై సెమినార్ ప్రతినిధులు తమతమ సందేహాలను, ప్రశ్నలను ముందుంచారు. సెమినార్‌కు హాజరైన ప్రముఖ బెంగాలీ రంగస్థల కళాకారుడు కాIIగౌతం ముఖర్జీ క్లుప్తంగా ప్రసంగించిన అనంతరం ప్రశ్నలకు జవాబుల కార్యక్రమం ప్రారంభమైంది. నిర్దిష్ట పార్టీ ప్రతినిధిని ఉద్దేశించి కొందరు ప్రతినిధులు ప్రశ్నలు వేయగా, మరికొందరు రెండు, మూడు సంస్థలను ఉద్దేశించి ప్రశ్నలు అడిగారు. ఈ కార్యక్రమంలో సెమినార్ ప్రతినిధులంతా శ్రద్ధగా పాల్గొన్నారు. మధ్యాహ్న భోజనానంతరము కూడా ఈ కార్యక్రమం కొనసాగింది. ప్రతినిధులు వ్యక్తంచేసిన వాటిల్లో భిన్నాభిప్రాయాలు వున్నప్పటికీ, మతతత్వం, జాతీయ దురహంకారాలపై ఆధారపడి ముందుకొస్తున్న ఫాసిజం ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన ఆవశ్యకతను ప్రతినిధులంతా నొక్కి చెప్పారు. పశ్చిమబెంగాల్ నిర్దిష్ట పరిస్థితుల్లో మమతా బెనర్జి నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రతినిధులంతా స్పష్టంగా ముందుకు తెచ్చారు.

ఈ సెషన్ తర్వాత వివిధ సంస్థల నాయకులంతా కొద్దిసేపు ప్రత్యేకంగా సమావేశమై ఒక సంయుక్త ప్రకటనను వెలువరించారు. ఆర్‌సిపిఐ నాయకులు కాIIప్రబీర్ అధికారి మొదటిరోజు సెషన్‌లో పాల్గొనలేకపోయినప్పటికి, రెండవరోజు సెషన్‌లో చర్చలలో చురుకైన పాత్ర వహించి, సంయుక్త తీర్మానం చేయటంలో తోడ్పడ్డారు. నగ్జల్బరీ రైతాంగ ఉద్యమంలో వీరోచితంగా పాల్గొని, నేటికీ ఉద్యమ కృషిలో వున్న కామ్రేడ్ శాంతిముండా సిపిఐ(ఎం-ఎల్) ప్రతినిధిగా సెమినార్‌లో పాల్గొని సెమినార్‌కు హాజరైన ప్రతినిధులందరకూ అభినందనలు తెలియచేశారు.

సెమినార్‌ను నిర్వహించిన కామ్రేడ్ అలోక్‌ముఖర్జీ సంయుక్త ప్రకటనను ప్రతినిధుల ముందుంచారు.

1. ప్రస్తుత పరిస్థితుల్లోని సవాళ్ళను ఎదుర్కొనేందుకు ఇలాంటి చర్చలు జరపటాన్ని, అభిప్రాయాలను ఇచ్చి పుచ్చుకోవటాన్ని కొనసాగించాలని ఏకగ్రీవంగా సెమినార్ తీర్మానించింది.
2. ఈ సెమినార్‌లో పాల్గొనలేని ఇతర వామపక్ష, అభ్యుదయ శక్తులు కూడా ఈ క్రమంలో పాలుపంచుకోవాలని ఈ సెమినార్‌కు హాజరైన ప్రతినిధులంతా పిలుపునిచ్చారు.
3. ఫాశిస్టు వ్యతిరేక, ప్రజాస్వామ్య, లౌకికశక్తులన్నీ, వామపక్షాలన్నీ ఈ చొరవకు తమ మద్దతునందించాలని పిలుపునిచ్చారు.

ఈ తీర్మానాన్ని ప్రతినిధులంతా బలపరిచారు. ఈ సెమినార్ నిర్వహించిన సిపిఐ(ఎం-ఎల్) సంస్థే తదుపరి సమావేశానికి కూడా బాధ్యత తీసుకోవాలని కోరారు. అధ్యక్షుని క్లుప్తమైన ఉపన్యాసంతో సెమినార్ ముగిసింది. ✱



Printed, Published and Owned by P. Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor : P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010